# ఉసురు తీస్తున్నాయ్..!

- రక్తమోడుతున్న రహదారులు
- హెచ్చరికలు లేని మూలమలుపులు
- పరిమితికి మించి ప్రయాణికులు
- డ్రైవర్ల నిర్లక్ష్యం.. మితిమీరిన వేగం
- గాల్లో కలుస్తున్న విలువైన ప్రాణాలు



హెచ్చరికలు లేని బుదల్‌ఘాట్ మూలమలుపు

ఈనాడు
కుమురం భీం
గురువారం 24 ఆగస్టు 2017
16 పేజీలు

ఆసిఫాబాద్ అర్బన్, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

రోజురోజుకు పెరుగుతున్న రహదారి ప్రమాదాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఊహించని దుర్ఘటనల్లో విలువైన ప్రాణాలు అనంత వాయువుల్లో కలుస్తున్నాయి. కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయి. ఆధారం కోల్పోయి వీధిన పడుతున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం, మితిమీరిన వేగం, ప్రైవేటు వాహనాల్లో పరిమితిని మించి ప్రయాణికులు, రహదారుల దుస్థితి, నిబంధనల్ని అమలు చేయడం, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం నిత్యం రహదారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కుమురం భీం జిల్లాలో నెలకు సగటున 17 రహదారి ప్రమాదాలు జరుగుతుండగా ఈ ప్రమాదాల్లో సరాసరి ఆరుగురు చనిపోతున్నారు. జిల్లాలోని బెండార వద్ద మంగళవారం జరిగిన ఆటో ప్రమాదంలో ఆరుగురు మరణించిన సంఘటనకు డ్రైవర్ నిర్వాకంతో పాటు అధికారుల నిర్లక్ష్యమూ ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో జరుగుతున్న రహదారి ప్రమాదాలు, అందుకు దారి తీస్తున్న పరిస్థితులపై 'న్యూస్‌టుడే' కథనం.



చిన్నారులు నిత్యం ఇలా ఆటోల్లో పాఠశాలకు వెళ్తున్నారు



బెండార ప్రమాదంలో మృతిచెందిన తిరుపతి భార్య, కుటుంబీకుల రోదనలు

తప్పులు జరిగిపోయాక, ప్రమాదాలు సంభవించాక కేసులు నమోదు చేస్తున్న పోలీసులు, విచారణజరుపుతున్న వాహన తనిఖీ అధికారులు, ఆర్అండ్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు, ఆటోడ్రైవర్లు, ఇతర ప్రైవేటు వాహనాల వారు మద్యం తాగి యథేచ్ఛగా నడుతుంటే, ఆటోల్లో, జీపుల్లో పరిమితి మించి ప్రయాణికుల్ని తరలిస్తుంటే సంబంధిత అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు. ర.భ శాఖ అధికారులు ప్రమాదకర స్థలాల్లో రహదారిపై హెచ్చరిక బోర్డులు పెట్టడం, ఇరుకు వంతెనలను, రహదారులు బాగు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణాలతో ఇటీవల ప్రమాదాలు బాగా పెరిగిపోయాయి.

### పరిమితిపై పట్టింపేది..?

ఆటోల్లో, జీపుల్లో ప్రయాణికులను చేరవేసే వాహనదారులు నిబంధనలను తుంగల్లో తొక్కి ఔరా! అనిపించే రీతిలో ఆటోలో 10 నుంచి 12 మందిని, టాటా ఏస్ లాంటి ఇతర వాహనాల్లో, జీపుల్లో 15 నుంచి 18 మంది వరకు ప్రయాణికుల్ని కుక్కి ప్రమాదభరిత ప్రయాణాల్ని సాగిస్తున్నారు. పాఠశాల విద్యార్థులను ఒకరిపై ఒకరిని కూర్చోబెడుతూ ఊపిరాడని స్థితిలో తీసుకెళ్తున్నారు. ఆటోలో డ్రైవర్‌కు ఇరువైపులా ఇద్దరు చొప్పున నలుగురిని కూర్చోబెట్టుకోవడంతో (మిగతా 7లో)

# కట్టలు తెగిన అవినీతి

- మిషన్ కాకతీయ పనుల్లో కాసుల కక్కుర్తి
- మినీ ట్యాంక్‌బండ్‌లోనూ అదే తంతు..
- ఉలుకు.. పలుకు లేని పర్యవేక్షణ

ఆసిఫాబాద్



సిర్పూర్-టి మండలంలోని లోనవెల్లి చెరువు కట్టకు వచ్చిన పగుళ్లు

చెరువుల పనుల్లో గుత్తేదారులు, అధికారుల కాసుల కక్కుర్తి వల్ల కట్టలకు పగుళ్లు తేలుతున్నాయి. అడిగేవారేవరని అడ్డగోలుగా పనులు చేస్తూ, అయినకాడికి దండుకుంటున్నారు. మినీ ట్యాంక్‌బండ్‌ల పేరుతో జరుగుతున్న పనులు సైతం అడుగడుగునా నాసిరకంగా ఉంటున్నాయి. చెరువు పూడిక మట్టితోనే కట్ట నిర్మాణాన్ని కానించేస్తున్నారు. అస్తవ్యస్తంగా అలుగును పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. నూతనంగా నిర్మిస్తున్న చెరువు కట్టలు పగుళ్లతో పోటీపడుతూ ధ్వంసమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా పర్యవేక్షణ ఉలుకు పలుకు లేకుండా స్తబ్దుగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తుందని ప్రజలు వాపోతున్నారు.

చెరువుల సుందరీకరణ కోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున మినీ ట్యాంక్‌బండ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో జైనూర్ మండలంలోని రాఘపూర్‌లో రూ.2.40 కోట్లు, సిర్పూర్-టి మండల కేంద్రంలో నిర్మించే మినీ ట్యాంక్‌బండ్‌కు రూ.1.80 కోట్లు కేటాయించారు.

- రాఘపూర్ మినీట్యాంక్ బండ్‌కు కేటాయించిన నిధులు : రూ.2.32 కోట్లు
- సిర్పూర్-టి మినీట్యాంక్ బండ్ కోసం కేటాయించిన నిధులు : రూ.1.80 కోట్లు
- మూడు విడతల్లో మంజూరైన చెరువులు : 353
- వెచ్చించనున్న నిధులు : రూ.61.03

చెరువు నీటి నిలువ స్థాయిని బట్టి చెరువు కట్ట వెడల్పు ఆరు మీటర్ల నుంచి ఎనిమిది మీటర్ల వెడల్పు, కట్ట పొడవు 300 మీటర్ల వరకు ఉండవచ్చు. చెరువు కట్ట చుట్టూ నడక మార్గంతో పాటు, సైకిళ్లు వెళ్లడానికి వీలుగా దారులు రూపొందించాలి. బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణం, బోటింగ్, తినుబండారాల కేంద్రాల ఏర్పాటు, పిల్లల పార్కు, సెంట్రల్ లైటింగ్‌ను రూపొందించాలి.

### జరుగుతున్న పనులివే...

జైనూర్ మండలం రాఘపూర్ చెరువు వద్ద చేపడుతున్న మినీట్యాంక్‌బండ్ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. చెరువు సమీపంలోని పూడిక మట్టినే (మిగతా 15లో)

## పొత్తిళ్ల శిశువు.. పత్తి చేనులో...

### ఏ రాతి గుండె వద్దనుకుందో..!

నవమాసాలు మోసిన కన్న తల్లికే ఆ శిశువు భారమైంది. ఇంకా కళ్లు తెరవని పసివాన్ని రాతి గుండె వదిలించుకుంది. ఈ లోకంలో అనాథను చేసింది. ఆప్యాయతకు దూరంగా పడవేసింది. మానవత్వాన్ని మరిచింది. అమ్మ ఒడిలో హాయిగా నిద్రపోవాల్సిన శిశువు, పత్తి చేనులో ఏడుస్తూ కనిపించాడు. గుక్కపట్టి రోదిస్తున్న ఆ శిశువును బెజ్జూరు మండలం సులుగుపల్లి గ్రామ పొలిమేరల్లోని పత్తి చేనులో గ్రామస్థులు గుర్తించి సపర్యలు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని శిశు సంక్షేమ శాఖకు తరలించారు.



(వివరాలు 2లో)

# ఏదీ జలసిరి..!

- జలాశయాల్లో తగ్గుతున్న నీటిమట్టం
- అడుగంటి పోతున్న చెరువులు
- వరిపంటకు తడి అందేదెలా..?
- ఆరుతడి పంటలదీ అదే పరిస్థితి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

ఇతర ప్రాంతాల్లో అడపాదడపా వానలు కురిసినా కుమురం భీం జిల్లాలో మాత్రం జలాశయాలు నిండే వానలు లేవు. ఎప్పుడూ నిండు కుండల్లా కనిపించే జిల్లాలోని ప్రధాన జలాశయాలు అడుగంటిపోయాయి. వర్షాభావ పరిస్థితుల్లో జిల్లాలోని జలవనరుల స్థితిగతులపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.



అడుగంటిన నీటితో సిర్పూరు(టి)మండల కంచరిపేట చెరువు

జిల్లాలో అతిపెద్ద కుమురం భీం జలాశయంతో పాటు వట్టివాగు, ఎన్టీఆర్‌సాగర్, పాల్వాయిసాగర్ జలాశయాల కింద 87 వేల ఎకరాలకు, మిషన్ కాకతీయ కింద చేపట్టిన 241 చెరువుల ద్వారా సుమారు 25000 ఎకరాలకు సాగునీరందాలి. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క భారీ వర్షం కూడా కురవకపోవడంతో జలాశయాల్లోనికి నీరు చేరలేదు. పైగా నిల్వ ఉన్న కొద్దిపాటి నీరు ఇంకిపోతోంది. దీంతో ఆయకట్టు రైతాంగం పంటల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. చెరువుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అడపాదడపా కురిసిన వానలు చెరువులను నింపలేక పోయాయి. దీంతో ఆయకట్టులో వరినాట్లు వేయకుండానే పొలాలను బీళ్లుగా వదిలిపెట్టారు. జిల్లాలో భారీగా వేసిన పత్తి పంటతో పాటు ఇతర పంటలకు తాజాగా కురిసిన వర్షాలు ప్రాణం పోశాయి. అయితే జలాశయాలు, చెరువుల్లో నీరు చేరితేనే ఆయకట్టు రైతాంగం ఆశలు నిలుస్తాయి.

### అడుగంటిన కేబీ జలాశయం ఆశలు

ఆసిఫాబాద్ మండలంలోని అడ వద్ద పెద్దవాగుపై నిర్మించిన జిల్లాలోనే అతిపెద్దదైన కుమురం భీం జలాశయం పూర్తి సామర్థ్యం 10.393 టీఎంసీలు. దీని ద్వారా ఆసిఫాబాద్, సిర్పూరు నియోజవర్గాల్లోని 45,500 ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. ప్రధాన పనులు పూర్తి చేసి 2011 నవంబరులోనే నీటిని ఆయకట్టుకు వదిలారు. ఇప్పటికీ పిల్లకాలువలు పూర్తి కాలేదు. దీంతో ప్రధాన (మిగతా 7లో)

## వైద్యం అందక గిరిజన బాలిక మృతి

**ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే:** ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ పంచాయతీ పరిధిలోని ధర్ము గూడకు చెందిన మడావి శ్రీదేవి (16) వాంతులు, విరోచనాలతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందినది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి మూడు సార్లు వాంతులు, విరోచనాలు చేసుకుందని అన్నారు. చికిత్స నిమిత్తం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని పిట్టబొంగరం గ్రామం వరకు బురదలో ఎడ్లబండిపై గంటకు పైగా ప్రయాణం చేసి తీసుకెళ్లామని గ్రామ పటేల్ చాకటి మోహన్‌రావు తెలిపారు. పిట్టబొంగరం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ వైద్య సిబ్బంది లేరని, దీంతో ఆటోలో ముత్నూర్ గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. తనతో వైద్యం కాదని అన్నారని కుటుంబసభ్యులు వివరించారు. అక్కడే ఉండే 108 అంబులెన్స్ సిబ్బందిని నిద్ర లేపి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తుండగా పరిస్థితి విషమించి మృత్యువాత పడిందన్నారు.


మడావి శ్రీదేవి మృతదేహం వద్ద బంధువులు

## చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

**సారంగాపూర్, న్యూస్‌టుడే:** మండలంలోని జామ్ గ్రామానికి చెందిన కర్రె వసంత(38) అనే మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 6 నెలలుగా వసంత మతిస్థిమితంతో బాధపడుతోంది. పలుమార్లు వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన వసంత మంగళవారం గ్రామ సమీపంలోని పంట చేనుకు వెళ్లి సమీపంలోని నాగమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త శంకర్ కుటుంబ సభ్యులు గాలించారు. బుధవారం ఉదయం వసంత మృతదేహం చెరువులో కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై రవీందర్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. వసంతకు అయిదేళ్ల కుమార్తె ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.


వసంత మృతదేహం

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

**జైనథ్, న్యూస్‌టుడే:** మండలంలోని గూడ పంచాయతీలోని రాంపూర్(టి) గ్రామానికి చెందిన ఊట్ల లచ్చన్న(45) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై పుల్లయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చన్న నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తున్నాడు. పత్తి పంటకు తామర పురుగు సోకడంతో పంట పండదేమోననుకున్నాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం గాక దిగులు చెందాడు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కొడుకు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.


ఊట్ల లచ్చన్న మృతదేహం

### గాదిగూడలో...

**గాదిగూడ(నార్నూర్):** గాదిగూడ మండలంలోని కొత్తపల్లి(జి) గ్రామానికి చెందిన కాంబ్లే దత్త(35) అనే రైతు పురుగుల మందు తాగి మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ దామన్ తెలిపారు. బాధితుని కుటుంబీకులు, ఎస్‌హెచ్‌ఓ దామన్ తెలిపిన వివరాల ప్రకారం.. దత్తకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. మూడేళ్లుగా పంటలు సరిగా పండటం లేదు. ఇద్దరు సంతానంలో ఒక కుమార్తె ఆరోగ్యం బాగోలేదు. ఖర్చులు పెరిగి పోయాయి. చేసిన అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మంగళవారం ఉదయం తన సొంత వ్యవసాయ భూమిలో పనులకు వెళ్లాడు. దినమంత పని చేసి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. పురుగుల మందు తాగాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గాదిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా దారి మధ్యలోనే మృత్యువాత పడ్డాడు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌ఎస్‌ఓ దామన్ కేసు నమోదు చేశారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం శవాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే నిరుపేద రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని దళిత సంఘాల నాయకులు అనిల్ మోతేవాడ్, ధన్‌రాజ్‌లు డిమాండు చేశారు.

# స్నానానికి వెళ్లి మృత్యు ఒడిలోకి

## టీవీటీ నీటి కుంటలో మునిగి ఇద్దరు బాలుర మృతి

**బోథ్, న్యూస్‌టుడే:** బోథ్ మండలం సాకెర గ్రామానికి చెందిన ఇద్దరు మేకల కాపరులు నీటికుంటలో పడి మృతి చెందారు. కన్నవారికి కడుపుకోత మిగిల్చారు. ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటనతో మండలంలో విషాదం నెలకొంది. ఎస్సై బుక్క శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండలం సాకెర గ్రామానికి చెందిన జాదవ్ చంపక్, అనసూయ దంపతుల కుమారుడు జాదవ్ ధర్మేందర్(13), జాదవ్ దేవీదాస్, దేవ్‌శ్రీ దంపతుల కుమారుడు జాదవ్ హరికృష్ణ(14)లు స్థానిక టీవీటీ గ్రామం వద్ద మేకల కాపరులుగా పని చేస్తున్నారు. వీరితోపాటు రాథోడ్ సురేష్ అనే బాలుడు కూడా మేకలు కాస్తున్నాడు. వీరు ముగ్గురు సరదాగా సమీపంలో ఉన్న నీటి కుంటలో స్నానం చేయడానికి దిగారు. కుంటలో లోతు తెలియక లోపలికి వెళ్లారు. అయితే లోతు ఎక్కువగా ఉండటంతోపాటు ఈత రాక ధర్మేందర్, హరికృష్ణలు కుంటలో మునిగిపోయారు. వెంటనే బయటకు వచ్చిన సురేష్ గ్రామస్థులకు సమాచారం అందించాడు. అప్పటికే వారు మృతి చెందారు. గ్రామస్థులు కుంటలోకి దిగి మృతదేహాలను బయటికి తీశారు. కుమారులు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


మృతి చెందిన బాలురు జాదవ్ ధర్మేందర్, జాదవ్ హరికృష్ణ


ఇద్దరు బాలురు మృతి చెందింది ఈ చెరువులోనే

# పాపం.. పసికందు..!

## పత్తి చేనులో శిశువు లభ్యం

**బెజ్జూరు, ఆసిఫాబాద్ పట్టణం:** మానవత్వం మంట కలిసింది.. తల్లి ఒడిలో నిద్రపోవాల్సిన పసి కందును పత్తి చేనులో పడేశారు. కళ్లు కూడా తెరవని పసికందుపై ప్రదర్శించిన కఠినత్వం మానవత్వానికి మచ్చగా నిలుస్తోంది. కారణం ఏదైనప్పటికీ ఈ ఘటన అందరిని కలిచివేసింది. గ్రామ పొలిమేరలోని పత్తిచేనులో పసికందును ఓ మాతృమూర్తి పడేసిన సంఘటన బెజ్జూరు మండలం సులుగుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బుధవారం ఉదయం ఆ పత్తి చేను వైపు బహిర్భూమికి వెళ్లిన వ్యక్తులకు పసికందు ఏడుపు వినబడటంతో పసికందును చూసి గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామస్థులు పసికందును చూసి పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో తహసీల్దార్ రఘునాథ్, ఎంపీడీఓ తోటాజీ, ఎస్‌ఐ శివప్రసాద్, కార్యదర్శి సాయికృష్ణ, సర్పంచి విశ్వేశ్వర్‌రావు అక్కడికి వచ్చి పరిశీలించారు. పంట చేనులో గుర్తు తెలియని శిశువు(మగ)ను అంగన్‌వాడీ టీచర్ కవిత ద్వారా సిర్పూర్ ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని శిశు సంక్షేమ శాఖకు శిశువును తరలించారు. శిశువుకు సిర్పూర్ సివిల్ ఆసుపత్రిలో చికిత్సలు చేయించారు. శిశువు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


శిశువుతో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

## 'పింఛన్ల తొలగింపు సరికాదు'

**బెల్లంపల్లి గ్రామీణం:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా అందించిన ఆసరా పింఛన్ల తొలగింపుతో పేదలకు కష్టాలే నని బెల్లంపల్లి జడ్పీటీసీ కార్కూరి రాంచందర్ అన్నారు. బుధవారం పాత బెల్లంపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల తొలగింపు కేవలం బెల్లంపల్లి మండలంలో మాత్రమే ఉందని పేర్కొన్నారు. సుమారుగా 455 పింఛన్లు తొలగించినట్లు ఆరోపించారు. సర్పంచులు, నాయకుల సలహాలు లేకుండానే వృక్ష గతంగా సదరు శాఖ అధికారులు సర్వే చేసి తొలగించారని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే పింఛన్లను అర్హులందరికీ అందించాలని లేదంటే జిల్లాపాలనాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎంపీటీసీ సత్తి, స్వామి, తిరుపతి, రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పట్టివేత

**రెబ్బెన, న్యూస్‌టుడే :** రెబ్బెన మండల కేంద్రం మీదుగా ఆటోలలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తహసీల్దార్ బండారి రమేష్‌గౌడ్ పట్టుకున్నారు. మంచిర్యాల నుంచి వాంకిడికి వైపు ఉదయం 6 గంటలకు రెండు ఆటోలలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా రెబ్బెనలోని గంగాపూర్ ఆర్చ్ వద్ద పట్టుకొన్నట్లు తెలిపారు. రెండు ఆటోల నుంచి 12.97 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి రామగిరి ప్యాసింజర్‌లో అక్రమంగా తరలిస్తున్న 8.47 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు ఆటోలను పోలీసు స్టేషన్‌కు తరలించామని, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు 6(ఎ) కింద కేసు నమోదు చేసుకొని, నివేదికను జిల్లా పాలనాధికారికి పంపించినట్లు పేర్కొన్నారు. పౌర సరఫరాకు సంబంధించిన బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా తరలిస్తే ఉపక్షేంచేది లేదని హెచ్చరించారు.


ఆటోలో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న తహసీల్దార్ రమేష్‌గౌడ్

### వాంకిడిలో...

**వాంకిడి :** మండల కేంద్రంలో బుధవారం పౌర సరఫరాల శాఖ అధికారులు వ్యాపారుల ఇండ్లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సత్యనారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ హీరాలాల్ ఆధ్వర్యంలో ఇండ్లలో సోదాలు నిర్వహించారు. మొదట ఎంపీ లతీఫ్‌ఖాన్ ఇంట్లో సోదాలు నిర్వహించగా వాహనంలో 20 కింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. అనంతరం ఎస్‌కే యూనిస్ ఇంట్లో మూడున్నర క్వింటాళ్ల బియ్యం లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని స్థానిక చౌకధరలో దుకాణంలో, వాహనాన్ని ఠాణాలో అప్పజెప్పారు. వారి వెంట తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్ఐ దౌలత్‌కుమార్ ఉన్నారు.


పట్టుకున్న బియ్యం వాహనంతో అధికారులు

## అక్రమంగా తరలిస్తున్న 3 కిలోల గంజాయి పట్టివేత

**గోదావరిఖని:** గోదావరిఖనిలో అక్రమంగా రవాణా చేస్తున్న 3 కిలోల గంజాయిని ఒకటో పట్టణ పోలీసులు బుధవారం సాయంత్రం స్థానిక గంగానగర్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన బండం శిల్వ(33) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల జల్సాలకు అలవాటు పడ్డ శిల్వ గంజాయి విక్రయాలు ప్రారంభించాడు. వరంగల్ నుంచి కిలో గంజాయి రూ.4 వేల చొప్పున కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.100 చొప్పున మంచిర్యాల, గోదావరిఖని ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే వరంగల్ నుంచి 3 కిలోల గంజాయిని కొనుగోలు చేసుకుని గోదావరిఖనిలో విక్రయించేందుకు వచ్చిన శిల్వ గంగానగర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు పట్టుకొని విచారించారు. అతని వద్ద ఉన్న బ్యాగును సోదా చేయడంతో 3 కిలోల గంజాయి లభించింది. చిన్న చిన్న ప్యాకెట్లు కూడా లభించాయి. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. రూ.30 వేల విలువ చేసే గంజాయిని మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రయత్నించిన శిల్వపై కేసు నమోదు అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఎస్‌ఐలు రమేశ్‌బాబు, దేవయ్యలతో పాటు హెడ్ కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుళ్లు ఏలియా, జంపయ్య, సదయ్యలు నిందితున్ని పట్టుకోవడంలో కృషి చేశారని వెల్లడించారు.

## అటవీశాఖ సిబ్బందిపై స్మగ్లర్ల దాడి

**నేరడిగొండ:** మండలంలోని ఈస్పూర్ అటవీ ప్రాంతంలో అక్రమ కలప రవాణను అడ్డుకునేందుకు వెళ్లిన అటవీశాఖ సిబ్బందిపై స్మగ్లర్లు దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్పూర్ అటవీప్రాంతంలో ద్విచక్రవాహనాలపై అక్రమంగా కలప తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు అటవీశాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది వెళ్లారు. ఈ నేపథ్యంలో నేరడిగొండ మండలం కొర్టికల్ గ్రామానికి చెందిన స్మగ్లర్ గోపాల్ అటవీశాఖ సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారు. మరి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారు. ఈ దాడిలో అధికారి అలీంకు గాయాలయ్యాయి. అటవీ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలోని సిబ్బందిపై స్మగ్లర్లు దాడులకు పాల్పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అటవీశాఖ సిబ్బంది పేర్కొన్నారు.


స్మగ్లర దాడిలో గాయపడిన అలీం

# కదిలిస్తే కన్నీటిగాథలే!

★ కెరమెరి మండలంలో మిన్నంటిన రోదనలు
★ ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికుల డిమాండు

**కెరమెరి, న్యూస్‌టుడే :**

వారంతా దాదాపు ఒకే వయసు వారు. అందరి ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే కావడంతో ఎవరూ పెద్దగా చదువుకోలేదు. ఒక్కరికి మాత్రమే వివాహం అయింది. వారికి వచ్చిన పనులు చేస్తూ ఇంట్లో వాళ్లకు చేదేడు వాదోడుగా ఉంటున్నారు. అమ్మా జాతర పోయి సాయంత్రం తిరిగొస్తాం అని చెప్పిన ఆ పిల్లలు ఇక తిరిగి రాని లోకాలకు వెళ్తారని వారికి తెలియదు. తమ జీవితాల్లో వెలుగులు రావాలని మొక్కుకున్నారు. మొక్కులు తీర్చుకొని వచ్చే క్రమంలో విధి చిన్న చూపు చూసింది. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఆరుగురిని బలితీసుకుంది. కెరమెరి మండలంలో విషాదచాయలు అలుముకున్నాయి.


జ్ఞానేశ్వర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

● రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి అంత్యక్రియలు బుధవారం వారి స్వగ్రామంలో కుటుంబ సభ్యుల రోదనల మధ్య సాగాయి. చూసిన వారిని కంటతడి పెట్టించాయి. తోడుగా ఉంటాడనే కొడుకులు ఇకలేరనే విషయాన్ని ఆ మాతృమూర్తుల హృదయాలు భరించలేకపోయాయి. విధి ఆడిన నాటకం కావడంతో ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. గుండెలవిసేలా రోదించడం తప్ప. అంత్యక్రియలు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనాలు తరలి వచ్చారు.

● పంచానామా బుధవారం నిర్వహించడంతో ఝరికి చెందిన రమేష్, అగార్‌వాడకు చెందిన జ్ఞానేశ్వర్ మృతదేహాలు స్వగ్రామానికి చేరే సరికి ఆలస్యం కావడంతో అంత్యక్రియలు మధ్యాహ్నం జరిగింది. మిగతవారి పంచానామ మంగళవారం జరగడంతో బుధవారం ఉదయాన్నే అంత్యక్రియలు జరిగాయి. డ్రైవర్ రాంచందర్, మోహర్లే తిరుపతి, వడాయి గణేష్, రవీందర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారు ఆరోగ్యంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## లీమ్‌గూడవాసులే ముగ్గురు..

మృతుల్లో ముగ్గురు లీమ్‌గూడకు చెందిన వారే కావడంతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి. తిరుపతికి ఇద్దరు ఆడ పిల్లలతో పాటు భార్య భారతి గర్భంతో ఉంది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారి రోదన అంతింత కాదు. ఇద్దరు చిన్నారులకు అందరూ ఎందుకు ఎడుస్తున్నారో తెలియని వయసు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో కుటుంబం రోడ్డున పడినట్లయింది. ప్రభుత్వమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

● మోహర్లే సాంబ, లచ్చుబాయి దంపతులకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు ఆడ పిల్లలు. మృతుడు సంతోష్ మూడో సంతానం. ఇద్దరు చెల్లెలకు ఇంకా పెళ్లిలు కావాల్సి ఉంది. కొడుకు ఇక లేడనే విషయాన్ని ఆ కుటుంబీకుల జీర్ణించుకోలేక పోతున్నారు. మమ్మల్ని విడిచిపెట్టి పోయావా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.


అంబారావు మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న బంధువులు

● ఇగురపు లింగయ్య, పుల్లవ్వకు నలుగురు సంతానం. మృతుడు నవీన్ రెండో వాడు. శవపంచానామ అనంతరం మృతదేహాన్ని ఆసిఫాబాద్ మండలంలోని తుంపల్లిలోని తమ సోదరుని ఇంటికి తీసుకెళ్లారు. అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

## అమ్మమ్మే తనకు అన్ని...

వెడ్మ అంబారావుకు తల్లి చనిపోయింది. తండ్రి ఉన్నాగానీ అమ్మమ్మ దగ్గర ఉంటున్నాడు. అమ్మమ్మే అన్ని తానై చూసుకుంటోంది. మనవడైనా తల్లిలాగే లాలించింది. దైవ దర్శనానికి వెళ్లిన మనవడు ఇక రాలేడనే నిజాన్ని తట్టుకోలేక పోతోంది. ఆమె వ్యధను చూసిన వారు దుఃఖం ఆపుకోలేకపోయారు.


ఝరిలో రమేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి నీలాబాయి, బంధువులు

● మోహర్లే అబాజీ, సుగుణబాయికి ఆరుగురు సంతానం. మృత్యుడు జ్ఞానేశ్వర్ నాలుగోవాడు.. సాయంత్రం ఇంటికి వస్తాడు కదా అనుకున్న కొడుకు....ఇక రాడు అన్న చేదు నిజం తెలుసుకున్న కుటుంబీకులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

వారి పరిస్థితి అందరిని కదిలించింది. ముగ్గురు అక్కలకు పెళ్లిళ్లు కావాల్సి ఉంది.

## ఝరిలో...

● బాబురావు, నీలబాయికి ఇద్దరు సంతానం. ఒక కొడుకు, ఒక కూతురు. ఉదయం ఎంతో ఉత్సాహంగా వెళ్లిన కొడుకు సాయంత్రం కల్లా ప్రమాదానికి గురయ్యాడనే విషయాన్ని ఆ తల్లిదండ్రులు నమ్మలేకపోయారు. ఉన్న ఒక్క కొడుకు మృతదేహం వద్ద తల్లి రోదన.... వర్ణనాతీతం.. ఏం చేస్తే తన కొడుకు తిరిగి వస్తాడంటూ ఆమె అంటున్న మాటలు ప్రతి ఒక్కరిని కంట తడి పెట్టించాయి.

# బొట్టు పెట్టి... మొక్కల పంపిణీ

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పాలనాధికారి చంపాలాల్, పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ సీపీ. విద్యావతి ఆధ్వర్యంలో వినూత్నంగా ఇంటింటా మొక్కల పంపిణీ చేశారు. స్థానిక ఏల్లాగౌడ్‌తోట నుంచి ద్వారకానగర్, బాలాజీనగర్‌లో హరితహారం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా ఛైర్‌పర్సన్ సీపీ. విద్యావతి ప్రతి ఇంటింటా మహిళలకు బొట్టు పెట్టి మొక్కను అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని ఖాళీ స్థలాల్లో కనీసం ఒక్క మొక్కనైనా పెంచాలంటూ మహిళలను కోరారు. బాలాజీనగర్‌లోని మహిళా స్వయం సహాయ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, మహిళలు స్వయం ఉపాధి కోసం తయారు చేసిన వివిధ సామగ్రిని జిల్లా పాలనాధికారి పరిశీలించారు. స్వయం సహాయ సంఘాల మహిళల స్వయం ఉపాధి కోసం ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పాలనాధికారి మహిళలకు భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా పాలనాధికారి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో హరితహారంలో భాగంగా 60 శాతం పూర్తి అయినట్టు చెప్పారు. వచ్చే సెప్టెంబరు వరకు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాలు లేక పోవడం వల్లే కొంత జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం వర్షాలు పుష్కలంగా కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఏఈ సతీష్‌కుమార్, ఆర్ఓ అంజయ్య, ఆర్ఐ పెద్దింటి క్రాంతి, అకౌంటెంట్ మహ్మద్ రఫీక్ హైమ్మద్ షరీఫ్, టీపీబీవో సాయికృష్ణ, హరితహారం ఇన్‌ఛార్జి నారాయణ, ఉద్యోగులు వెంకటేశ్వర్లు, శివప్రసాద్, సునీల్, నారాయణ, హోక్టయ్య, కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, దేశ్‌ముఖ్‌శ్రీనివాస్, వసీమున్నిసా, ఆఫ్‌సిన్ బేగం, జిల్లా మైనార్టీ అధికారి హైమ్మదుల్లాఖాన్, ఐకేపీ ప్రతినిధులు ఉషా, అరుణ, రేణుక, తెరాస నాయకులు సీపీ. రాజ్‌కుమార్, షబ్బీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు బొట్టుపెడుతున్న ఛైర్‌పర్సన్


మొక్కను అందజేస్తున్న ఛైర్‌పర్సన్, జిల్లా పాలనాధికారి తదితరులు

### పాలనాధికారికి ఫిర్యాదు

స్థానిక పురపాలక సంఘంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, లీకేజీలకు మరమ్మతులు చేయడం లేదని కౌన్సిలర్ వసీమున్నీసా, మాజీ కౌన్సిలర్ షబ్బీర్‌హుస్సేన్ జిల్లా పాలనాధికారి చంపాలాల్‌కు ఫిర్యాదు చేశారు. పలుమార్లు బల్దియా అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా స్పందన కరవైందన్నారు. సత్వరమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# ప్రజలతో మమేకమై విధులు నిర్వహించాలి

## కరీంనగర్ రేంజి డీఐజీ రవివర్మ

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** ప్రజలతో మమేకమై పోలీసులు ముందుకు సాగాలని కరీంనగర్ రేంజి డీఐజీ రవివర్మ పేర్కొన్నారు. బుధవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయానికి వచ్చిన డీఐజీకి మొదట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో గణపతి ఉత్సవాలు, బక్రీద్ పండుగల నేపథ్యంలో తీసుకుంటున్న భద్రతా చర్యలపై చర్చించారు. పోలీసులు ప్రజలతో పాటు అన్ని శాఖలతో పరస్పర సహకారంతో ముందుకు సాగాలన్నారు. సరిహద్దు పోలీసులతో ఎప్పుడికప్పుడు సమాచారం అందిపుచ్చుకునే విధంగా స్నేహపూరితంగా వ్యవహరించాలన్నారు. జిల్లా పోలీసులు నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. గిరిజనులు అభివృద్ధికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు జిల్లాలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ముందున్నారని కితాబిచ్చారు. ఏఎఫ్ఐఎస్, రాపిడ్ కాప్స్ అప్లికేషన్ వినియోగంలోనూ ముందున్నారన్నారు. మారుమూల మండలాల్లోని గిరిజన విద్యకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా జిల్లా ఎస్పీ, క్యాంపు కార్యాలయాల నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని ఎస్పీతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ హబీబ్‌ఖాన్, గ్రామీణ సీఐ ప్రసాద్‌రావు, రెబ్బెన, కెరమెరి ఎస్‌ఐలు నరేష్ కుమార్, సత్యనారాయణ, ఎస్బీ ఎస్ఐ ఎం. శివకుమార్, ఎస్ఐబీ ఇన్‌ఛార్జి జె. శ్యాం సుందర్, పాస్‌పోర్టు అధికారి మురళి, పీఆర్ఓ మనోహర్, ఎస్బీ సీసీ దుర్గం శ్రీనివాస్‌లు ఉన్నారు.


డీఐజీ రవివర్మకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్


మొక్కను పంపిణీ చేస్తున్న జేసీ అశోక్‌కుమార్, ఆర్డీవో కందం సురేష్

# మొక్కలను కాపాడండి

## జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్‌కుమార్

**కెరమెరి, న్యూస్‌టుడే :** పర్యావరణాన్ని కాపాడడంలో మొక్కలదే కీలక పాత్ర అని జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం కెరమెరి మండలంలోని కేస్లాగూడలో హరితహారంలో భాగంగా ఇంటి ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా దిన్‌కర్ ఇంటి ఆవరణంలో ఆర్డీవో కందం సురేష్‌తో కలిసి మొక్కలు నాటారు. ముందుగా ఆదివాసీ సాంప్రదాయ పద్ధతిలో వారికి ఘనంగా స్వాగతం పలికారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ ఉంటుందన్నారు. ఖాళీ ప్రదేశాలు, పొలాలలతోపాటు ప్రతి ఇంటి ఆవరణంలో మొక్కలు నాటడానికి గృహిణులు ముందుకు రావాలని సూచించారు. నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. ప్రతి ఇంటికి ముగు దొడ్డి కట్టుకునేలా అధికారులు అవగాహనతో పాటు ప్రోత్సహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాచర్ల గణేష్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎఫ్‌ఆర్‌వో మజిరోద్దిన్, ఎంపీడీవో వేణు, ఏపీవో నగేష్, ఏపీఎం జగదీష్, ఈవోపీఆర్డీ అశోక్, సర్పంచి సుంగుబాయి, నాయకులు కోవ దేవ్‌రావు, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్

## నేడు రుణాల కోసం ముఖాముఖి

**తిర్యాణి, న్యూస్‌టుడే :** తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్ట, దేవాయిగూడ గ్రామ పంచాయతీలోని లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు గురువారం ఉల్లిపిట్ట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ముఖాముఖి(ఇంటార్వ్యూ) నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ తెలిపారు. చిర్రకుంట తెలంగాణ బ్యాంకు పరిధిలో 3 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

## పది రోజుల్లో మొక్కలు నాటే లక్ష్యం పూర్తి చేయాలి

**తిర్యాణి, న్యూస్‌టుడే :** పది రోజుల్లో మొక్కలు నాటే లక్ష్యం పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఉపాధి హామీ క్షేత్ర సాంకేతిక సహాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరితహారం కింద పంట పొలాల గట్ల మీద టేకు మొక్కలు నాటడానికి లక్ష 20 వేలు లక్ష్యం కాగా నేటి వరకు 70 వేల టేకు మొక్కలు నాటినట్లు, మిగతా వాటిని పది రోజుల్లో నాటే విధంగా చూడాలని ఆయన సూచించారు. కన్నెపల్లిలోని టేకు నర్సరీ కేంద్రాన్ని పరిశీలించారు. నర్సరీలో 80 వేల మొక్కలు పెంచగా నేటి వరకు 40 వేలు మొక్కలు పంపిణీ చేశామని మిగతా వాటిని 15 రోజుల్లో రైతులకు పంపిణీ చేయాలని ఎంపీడీఓ సిబ్బంది ఆదేశించారు. ప్రతి టేకు మొక్క రక్షించే బాధ్యత రైతుపై ఉంటుందని వారికి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో మమత, ఈసీ రజిత తదితరులు పాల్గొన్నారు.



రక్త నమునాలు తీసుకుంటున్న వైద్య సిబ్బంది

## గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

**జైనూరు, న్యూస్‌టుడే :** మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దబోలి, గౌరి, ముస్లీంగూడ, గోండుగూడ, కొలాంగూడ, ముక్కెరగూడ, రాశిమెట్ట గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇంటింటికి వెళ్లి జ్వరపీడితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 68 మందికి సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధరణ చేశారు. ఆయా గ్రామాల్లో రెండో విడత దోమల నివారణకు ఏసీఎం ద్రావణం పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కిశోర్, రమేశ్, భరత్, వినోద్, మనోజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

**తిర్యాణి, న్యూస్‌టుడే :** బడిఈడు పిల్లలందరు బడిలోనే ఉండేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తిర్యాణి ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుండాల గ్రామానికి చెందిన రాయిసిడాం జ్యోతిలక్ష్మి గత సంవత్సరం మండలంలోని చెలిమల ఆశ్రమ పాఠశాల చదువుతూ మధ్యలో బడి మానివేయగా ఆమెను తిరిగి గత నెలలో ఇదే పాఠశాలలో చేర్పించామన్నారు. మూర్ఛవ్యాధి రావడంతో మంచిర్యాల ప్రయివేటు ఆసుపత్రిలో తాము వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడ మందులు ఇప్పించామని ఆమె కోరిక మేరకు గిన్నెధరి బాలికల ఆశ్రమ పాఠశాలలో చేర్పించామన్నారు. జ్యోతిలక్ష్మి ఆరోగ్యం పూర్తిగా కుదుట పడే వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వైద్య చికిత్స అందించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. గుండాల గ్రామానికి చెందిన చిక్రం ఈశ్వరీని కూడా పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.



బడి మానేసిన పిల్లలు, తల్లిదండ్రులతో ఎస్ఐ శ్రీనివాస్

## వీఓఏ శిక్షణ అవగాహన సదస్సు

**తిర్యాణి, న్యూస్‌టుడే :** తిర్యాణి ఐకేపీ కార్యాలయ ఆవరణలో బుధవారం వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల నిర్వహణ బాధ్యత, పుస్తకాల నిర్వహణ, పొదుపు, రుణాల చెల్లింపు విధానంపై డీఎంజీ రాజలింగు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

## నైపుణ్య వారధి.. భవితకు పునాది

- విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపునకు ప్రత్యేక తరగతులు
- సత్ఫలితాల కోసం అధికారుల కృషి



జైనూరులో త్రీఆర్స్ కార్యక్రమంలో బాలికల పాఠశాల విద్యార్థులు

జైనూరు, న్యూస్‌టుడే

**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో కనీస సామర్థ్యం పెంపునకు ప్రభుత్వం ప్రయోగాత్మకంగా తీఆర్స్ కార్యక్రమం ప్రారంభించింది. 70 శాతం మంది విద్యార్థులకు చదవడం, రాయడం, సరిగ్గా రాదనేది బహిరంగ సత్యమే. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఇటీవల ప్రత్యేక దృష్టి సారించింది. పూర్వస్థాయి నుంచి విద్యార్థులకు చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, గుణకారాలు తదితర సామర్థ్యాలను కచ్చితంగా నేర్చుకునేలా తర్ఫీదునిచ్చి, పిల్లల భవిష్యత్తుపై ఆత్మవిశ్వాసం పెంచేందుకు తీఆర్స్ లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇటీవల ఉపాధ్యాయులందరికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు త్రీఆర్స్ పేరిట 60 రోజుల కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 3వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల నైపుణ్యాబివృద్ధికి ఆగస్టు 1 నుంచి చేపట్టిన కార్యక్రమం విధివిధానాలు.. విద్యార్థుల ఆసక్తిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..**

కుమురం భీం జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తం 733 ప్రభుత్వ పాఠశాలల్లో 49,726 మంది చదువుకుంటున్నారు. 3 నుంచి 9వ తరగతి విద్యార్థుల అభ్యసనా స్థాయి పెంపునకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆగస్టు 1 నుంచి త్రీఆర్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 60 పని దినాలు పాఠశాలల్లో శిక్షణను ప్రారంభించారు. శిక్షణలో విద్యార్థులకు తెలుగు చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం చేసే విధానం నేర్పిస్తారు. ఆయా తరగతుల విద్యార్థులకు ఒక పరీక్ష నిర్వహిస్తారు. ఏ, బీ గ్రూపులుగా విభజించి రెండు గ్రూపుల వారికి బోధన చేయడానికి ప్రత్యేక ప్రణాళికలతో అభ్యాసన కార్యక్రమాలు చేపడతారు. ముందుగానే ఉపాధ్యాయులకు సామర్థ్యాల పెంపుదలపై ప్రత్యేక కార్యశాల నిర్వహించడంతో ఉపాధ్యాయులందరిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పునకు నాణ్యమైన విద్యా బోధన లక్ష్యమని భావించిన ప్రభుత్వం ప్రత్యేక కసరత్తు చేసి పూర్వ విద్యార్థి దశ నుంచే విద్యా ప్రమాణాలు పెంపునకు చర్యలు చేపట్టింది. ఇందు కోసం కొత్తగా త్రీఆర్ అని నామకరణం చేసింది. (ఆర్.ఆర్.ఆర్) (రీడింగ్, రైడింగ్, రెస్పాండింగ్) కనీస సామర్థ్యం కోసం దృష్టిసారించింది. ప్రతి విద్యార్థికి తెలుగు, ఆంగ్లం, గణితంలో చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు గుణకారం చేసే సామర్థ్యాలను కచ్చితంగా నేర్చుకునేలా కార్యాచరణతో 60 రోజుల కార్యక్రమం చేపడుతోంది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 60 రోజులు కచ్చితంగా పాటించేలా జిల్లా విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

### కార్యాచరణ ప్రణాళిక ఇలా..

మొదటి విభాగంలో చదవడం, రాయడం రాని విద్యార్థులపై రోజూ ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. వీరికి ఒత్తులు, అక్షరాలు, అంకెలు, సంఖ్యలు గుర్తించేలా చేయడంతో పాటు వాక్యాలను చదడం, రాయడం నేర్పించాలి. రెండో విభాగంలో చదవడం, రాయడం, వచ్చిన విద్యార్థులకు స్వీయరచన, సృజనాత్మకత కృత్యాలపై అభ్యాసనం చేయించాలి. గణితంలో దశాంశాలు, భిన్నాలు పోల్చడం, సహజ, పూర్ణసంఖ్యలు, బీజగణితాన్ని ప్రధానంగా నేర్పించాల్సి ఉంది. ఉదయం పూట పుస్తక పాఠ్యాంశాల బోధన చేసి, మధ్యాహ్నం తరువాత మూడు తరగతులు తప్పని సరిగా 3 ఆర్‌కు కేటాయించి బోధన చేయాలి.

### భవిష్యత్తుకు బాటలు..

**- అనక దేవేందర్, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు**



త్రీఆర్స్ కార్యక్రమంలో భాగంగా భవిష్యత్తును చక్కదిద్దుకోవచ్చు. 60 రోజుల ప్రత్యేక తరగతుల నిర్వహణతో చదవడం, రాయడంతో పాటు గణితం, ఆంగ్లంపై సామర్థ్యం పెంపునకు ఎంతో దోహదపడుతుంది. రెండు నెలల పాటు క్రమం తప్పక అభ్యాసన కార్యక్రమం నిర్వహించడంతో నిరుపేద పిల్లలకు ప్రయోజనం కలుగుతుంది. త్రీఆర్స్ కార్యక్రమం ఎంతో బాగుంది. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే మేలు జరుగుతుంది.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు త్రీఆర్ పేరిట కొనసాగుతున్న కార్యక్రమం పకడ్బందీగా అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రోజు పాఠశాలలను పర్యవేక్షణ చేస్తున్నాం. ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షణ చేసే వీలు ఉంది. ఉపాధ్యాయులు తమ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం పెంచే దిశగా కృషి చేయాలి. ఈ కార్యక్రమం విజయవంతం చేసే పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్లే.

### వెనుకబడిన విద్యార్థులకు మేలు

**- ఆత్రం విజయ, విద్యార్థిని, జైనూరు**



చదువులో వెనుకబడిన విద్యార్థులకు త్రీఆర్స్ పేరిట చేపట్టిన కార్యక్రమం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. ప్రతి విద్యార్థికి తప్పని సరిగా చదవడం, రాయడం వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తే విద్యార్థులు స్వీయరచన, సృజనాత్మకత కృత్యాలపై అభ్యాసనం మరింత ప్రయోజనం కలుగుతుంది.

### సక్రమంగా అమలైతే మంచి ఫలితాలు

**- పెందూర్ కవిత, విద్యార్థిని, జైనూరు**



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఈ కార్యాచరణ తప్పక చేయూతనిస్తోంది. సక్రమంగా అమలు చేసే విధంగా ఉపాధ్యాయులు చూడాలి. సరళ పదాలు నేర్పడానికి వారం రోజులు చాలు. అభ్యాసనాభివృద్ధి, కనీస సామర్థ్యాల సాధన కోసం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి ఉపాధ్యాయుడు ఆచరించాలి. విషయాల వారీగా రోజూ ప్రణాళిక ప్రకారం బోధన చేయాలి. సక్రమంగా అమలు జరిగితే మంచి ఫలితాలు వస్తాయి.

## మానవ హక్కుల వేదిక మహాసభను జయప్రదం చేయాలి

### ★ ఉమ్మడి జిల్లాల మహిళ ప్రతినిధి సుగుణ

**జైనూరు, న్యూస్‌టుడే :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న చట్ట వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో 27న నిర్వహించ తలపెట్టిన మానవ హక్కుల వేదిక మహాసభను జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లాల మహిళ ప్రతినిధి ఆత్రం సుగుణ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70, పీసా చట్టం అమలు ఉన్న గ్రామసభల అనుమతి, గిరిజనుల అభిప్రాయం ఆమోదం లేకుండా అభివృద్ధి పనుల పేరిట చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. రోజు రోజుకు గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుల పెత్తనం పెరిగి ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉభయ జిల్లాలో పీడిత ప్రజలు అడుగడుగునా తీవ్ర అన్యాయానికి గురవుతున్నా పాలక ప్రభుత్వాలు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. గుక్కెడు తాగునీటికి, విద్య, వైద్య సదుపాయాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మానవ హక్కుల వేదిక కార్యకర్తలు కుమ్ర బాగుబాయి, యశోద, లక్ష్మిబాయి, జంగుబాయి, సముద్రబాయి, కనక వేంకటేశ్వర్‌రావు, కుమ్ర నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మానవహక్కుల వేదిక జిల్లా మహిళ ప్రతినిధి, కార్యకర్తలు

# ఆసిఫాబాద్

## నిరుద్యోగులు ఉపాధి కార్డును పునరుద్ధరణ చేసుకోవాలి

**ఆసిఫాబాద్ పట్టణం, న్యూస్‌టుడే :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని నిరుద్యోగులు తమ ఉపాధి కార్డును పునరుద్ధరణ (రెన్యూవల్) చేసుకోవాలని జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి బ్రహ్మానంద రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2000 సంవత్సరం నుంచి జులై 2017 లోపల ఎవరైనా తమ ఉపాధి కార్డును పునరుద్ధరించుకోని వారు జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.






తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఆర్పీలు

## సమాన పనికి.. సమాన వేతనం ఇవ్వాలి

**జైనూరు, న్యూస్‌టుడే :** తెలంగాణ సర్వశిక్షా అభియాన్ పథకంలో భాగంగా పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సర్వశిక్షా అభియాన్ సంఘం మండల అధ్యక్షుడు తుకారం డిమాండు చేశారు. సర్వశిక్షా అభియాన్ ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం రాష్ట్రశాఖ (జేఏసీ) పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ శంకర్‌గౌడుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ పురోగతికి సర్వశిక్షా అభియాన్ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు చాలీచాలనీ వేతనాలతో ఏళ్ల తరబడి కృషి చేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులకు సైతం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు వెల్లడించిన తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవుతు ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు రేణుక, రాజన్న, రవీందర్, తిరుమల, రాజమణి, వందన, సురేఖ, కృష్ణ, పెందూర్ గంగు, భరత్, సుధారాణి, వసంత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ పట్టణం:** వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని నూతనంగా ఎన్నుకున్న సర్వశిక్ష అభియాన్ జేఏసీ మండల అధ్యక్ష కార్యదర్శులు సుభాష్, సంతోష్‌లు డిమాండు చేశారు. బుధవారం స్థానిక ఐఈఆర్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఈ సమావేశంలో సర్వశిక్ష అభియాన్ మండల జేఏసీని కార్యవర్గ స్థాపకుడు రమణ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షుడిగా సంఘమిత్ర, కోశాధికారిగా నగేష్, ప్రధాన సలహాదారులుగా ప్రవీణ్, రమేష్‌లు ఎంపికైనట్లు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

## ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించేలా చూడాలి

★ పాలనాధికారి చంపాలాల్

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** జిల్లాలో గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేలా అధికారులు దృష్టి సారించాలని జిల్లా పాలనాధికారి చంపాలాల్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిర్‌లో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరాత్రి వేడుకల జయప్రదం కోసం మండళ్ల నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. వినాయకులు ప్రతిష్ఠించే వారు తప్పకుండా అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. రాత్రి 10.00 గంటల వరకు మాత్రమే మైక్‌లు వినియోగించుకోవచ్చన్నారు. నిమజ్జనం రోజు అన్ని మండళ్ల నిర్వాహకులు ఒక సమయాన్ని నిర్దేశించుకొని దాని ప్రకారం సాగాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. నిమజ్జనం కూడా జాగ్రత్తగా త్వరగా పూర్తి చేయాలన్నారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలనాధికారి చంపాలాల్ పక్కన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

### రెండో విడత అక్రిడిటేషన్‌లు జారీ

**ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలో బుధవారం రెండో విడత అక్రిడిటేషన్‌లను పాలనాధికారి చంపాలాల్ జారీ చేశారు. మహిళా పాత్రికేయురాలికి అక్రిడిటేషన్ అందించి మాట్లాడారు. అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులందరికి జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే హెచ్143 జిల్లా నాయకుడు రవి నాయక్, కమిటీ సభ్యుడు మసాదె సంతోష్, పాత్రికేయులు పాల్గొన్నారు.

### నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

**ఆసిఫాబాద్ :** డీపీఆర్ఓ వైఖరికి నిరసనగా గురువారం ఉదయం 11.00 గంటలకు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం ఉంటుందని ఆ సంఘం జిల్లా నాయకుడు రహమాన్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు ప్రకాశ్‌గౌడ్‌లు ప్రకటించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.



మోతుగూడలో మొక్క నాటుతున్న డీఆర్‌డీఓ శంకర్, అధికారులు

## బాధ్యతగా మొక్కలను సంరక్షించాలి

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** ఇంటి ఆవరణలో నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి డా. ఈ. శంకర్ పేర్కొన్నారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బుధవారం హోం స్టీడ్ ప్లాంటేషన్‌లో భాగంగా మండలంలోని మోతుగూడలో రెండు వేల మొక్కలను ఇళ్లకు పంపిణీ చేసి పలు చోట్ల నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటికి కనీసం నాలుగైదు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. తద్వారా ఇంటి ఆవరణ పచ్చదనంతో నిండడమే కాకుండా మంచి ఆరోగ్యానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మహిళలు, ఉపాధి కూలీలు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా ఇళ్లలో 70 వేల మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, డీపీఎం సారయ్య, ఈజీఎస్ ఏపీఓ చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సిబ్బంది కిషన్ గ్రామస్థులు పాల్గొన్నారు.

**వాంకిడి:** మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని డీఆర్‌డీవో పీడీ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో మొక్కలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు ఎంతోగాను ఉపయోగ పడతాయని, భవిష్యత్తును గుర్తుంచుకొని మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీలోని మహిళలకు మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దుర్గం అర్తిక, సర్పంచి విమలబాయి, ఎంపీటీసీ సభ్యురాలు తారాబాయి, ఏపీఎం మహేష, తహసీలక్ మల్లికార్జున్, మండల సమైఖ్య అధ్యక్షురాలు యశోధ, ఏపీవో మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి

■ జిల్లా విద్యాధికారి ఎండీ అబ్దుల్ రఫీక్

**కెరమెరి, న్యూస్‌టుడే :** వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి ఎండీ అబ్దుల్ రఫీక్ అన్నారు. బుధవారం జిల్లా నోడల్ అధికారి జబ్బార్‌తో కలిసి కెరమెరి మండలంలోని ఇందాపూర్, ఉమ్రి, సాకడ, సాంగ్వి పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రీఆర్ కార్యక్రమంలో ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, చతుర్వేద ప్రక్రియలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రుచికరమైన మధ్యాహ్న భోజనం పెట్టి, నాణ్యమైన విద్యను అందించాలన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలను పెంచాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులతో బోర్డుపై రాయించి ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల స్పందన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. దస్త్రాల నిర్వహణ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉంటూ సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్, నిరూగుణ, రాధ తదితరులు పాల్గొన్నారు.



సాకడలో విద్యార్థులతో బోర్డుపై రాయిస్తున్న డీఈవో రఫీక్

## గౌతమి మండల సమాఖ్య కమిటీ ఎన్నిక

**రెబ్బెన, న్యూస్‌టుడే:** రెబ్బెన మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గౌతమి మండల సమాఖ్య సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లావాదేవీల ఆమోదం, కమిటీ మార్పిడిపై చర్చించారు. అనంతరం గౌతమి మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని ఐకేపీ ఏపీఎం వెంకటరమణ శర్మ తెలిపారు. అధ్యక్షురాలిగా బుర్స లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా కె. సరిత, కార్యదర్శిగా ఎస్. ప్రేమల, సహాయ కార్యదర్శిగా కె. విజయలక్ష్మి, కోశాధికారిగా ఎస్‌కె నషిమాలను మండల సమాఖ్య ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏరియా కోఆర్డినేటర్ అన్నాజీ, ఏపీఎం ఐబీ డి. ధన్‌రాజ్, ఏపీఎం సతీష్, సీబీవో అడిటర్ రాజ్‌కుమార్, సీసీలు హనుమంతురావు, కాశయ్య, శంకర్, ఎల్లయ్య, తిరుపతి, జ్యోతిరావు, సభ్యులు పాల్గొన్నారు.



బుర్స లక్ష్మి

## నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

**వాంకిడి, న్యూస్‌టుడే :** స్థానిక మండల పరిషత్తు ఆవరణలో గురువారం తొమ్మిదో విడత ఉపాధి హామీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అర్జున్ పవార్, ఏపీవో మల్లయలు తెలిపారు. 01.06.2016 నుంచి 31.05.2017 వరకు జరిగిన రూ. 3.41 కోట్ల పనులపై క్షేత్రస్థాయిలో అడిట్ నిర్వహించారని, గురువారం మండలస్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.

## ఉత్సాహంగా స్వాగతోత్సవం

**జైనూరు, న్యూస్‌టుడే :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన స్వాగతోత్సవం కార్యక్రమం ఉల్లాసం.. ఉత్సాహంగా జరిగింది. రెండో సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమం విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులు చేసిన నృత్యాలు, ఆట, పాట సందడి చేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సత్యనారాయణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ లక్ష్యం పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సత్యనారాయణ



పాల్గొన్న విద్యార్థులు

## 'గణేష్ మండళ్లకు ఉచితంగా విద్యుత్తును ఇవ్వాలి'

**ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే :** వినాయక చవితి నుంచి తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోనున్నందున గణేష్ మండళ్లకు ఎలాంటి ఛార్జీలు లేకుండా విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని ఆసిఫాబాద్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, వాసవి గణేష్ మండలి ప్రముఖులు గుండా ప్రమోద్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గణేష్ మండళ్లవారు తొమ్మిది రోజుల అవసరాల కోసం విద్యుత్తు కనెక్షన్ తీసుకోవడానికి రూ. 1406 నుంచి రూ. 2745 చెల్లించాలని విద్యుత్తు శాఖవారు ఆదేశిస్తున్నారని పేర్కొన్నారు.

# మొక్కల సంరక్షణ బాధ్యత స్వయంసహాయక సంఘాలదే

● జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్‌కుమార్

**జైనూరు, న్యూస్‌టుడే :** ఇంటి వాకిట్లో అయిదేసి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వయం సహాయక సంఘాల మహిళలే తీసుకోవాలని జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో పండ్లు, పూలు, నీడనిచ్చే అయిదేసి మొక్కలు తప్పని సరిగా నాటాలన్నారు. పిల్లలను కంటికి రెప్పలా కాపాడినట్లు ఇంటి ఆవరణలో నాటిన ప్రతి మొక్కను పరిరక్షించుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో కాలానుగుణంగా వచ్చే పండ్ల మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛమైన పండ్లు దొరుకుతాయన్నారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలోని అనుబంధ గ్రామాల్లో నిర్దేశించిన 14 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కదం సురేష్ , తహసీల్దార్ శంకర్‌గౌడు, ఎంపీడీఓ దత్తారావు, సర్పంచి మెస్రం లక్ష్మణ్, ఈఓ మధుకర్, ఏపీఓ బాలయ్య, ఎఫ్‌ఎస్‌ఓ చౌహన్ ప్రియాంక, ఎఫ్‌బీఓ ప్రేంసింగ్, ఎఫ్‌ఏలు ఆత్రం రవీందర్, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్‌కుమార్

## ప్రత్యేక ప్రజాఫిర్యాదుల విభాగానికి విశేష స్పందన

**లింగాపూర్ (సిర్పూర్(యు)):** లబ్ధిదారుల నుంచి స్వీకరించిన అర్జీల సమస్యలను సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు కుమురం భీం జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా సంయుక్త పాలనాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజాఫిర్యాదుల విభాగానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సంయుక్త పాలనాధికారి మాట్లాడుతూ ఆయా గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు తమ సమస్యలను తెలుపుతూ పరిష్కారం కోరుతూ అర్జీలు పెట్టుకున్నారన్నారు. లబ్ధిదారులు అందించిన అర్జీలను పరిశీలించి సమస్యను పరిష్కరించామన్నారు. 1బీ పహాణీలు ఆన్‌లైన్‌లో చూపించకబ్యాంకులో రుణాలు అందుకోవడం లేదని లబ్ధిదారులు ఎక్కువగా వినతులు ఇచ్చారన్నారు. మండలంలో చేపడుతున్న రైతుల భూమి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ బాబుసింగ్‌కు సూచించారు. మండలంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగాలని తహసీల్దార్‌కు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో, వంజరీగూడ పాఠశాలో హరితహారం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట ఆర్డీవో కదం సురేష్, సిర్పూర్(యు) తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, వైస్ ఎంపీపీ గౌరీబాయి, సర్పంచులు ఓంప్రకాష్, సుమలత, ఎనాబాయి, లక్ష్మి ఉదయ్‌సింగ్ తదితరులు ఉన్నారు.



అర్జీలు అందించడానికి వచ్చిన రైతులు

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● సమీక్షలో పాలనాధికారి చంపాలాల్

**ఆసిఫాబాద్ పట్టణం, న్యూస్‌టుడే :** రూర్బన్ పథకం నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పాలనాధికారి చంపాలాల్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రోగ్రాం మేనేజర్ నర్సింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూతన జిల్లాగా అవతరించిన కుమురం భీం ఆసిఫాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు రూర్బన్ పథకం కింద మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూర్బన్ పథకం కింద రూ. 2.30 కోట్లు జూబ్లీ మార్కెట్ ఆధునికీకరణ, రూ.1 కోటితో పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు, రూ. 50 లక్షలు రోడ్డుకు మధ్యలో విభాగినుల ఏర్పాటు, రూ. 50 లక్షలు సెంట్రల్ లైటింగ్, రూ.50 లక్షలు పార్కు అభివృద్ధి, రూ. 10 లక్షలు అమరవీరుల స్థూపం చివరి దశ పనుల కోసం మంజూరైనట్లు తెలిపారు. అంతకుముందు సీఆర్డీ ప్రోగ్రాం మేనేజర్ అధికారులతో కలిసి రూర్బన్ పథకం కింద జిల్లా కేంద్రంలో చేపట్టే పనులను పరిశీలించారు. సమీక్షలో డీఆర్‌డీఓ శంకర్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకట్రావ్, పంచాయతీరాజ్ ఈఈ వెంకటరమణ, విద్యుత్‌శాఖ ఈఈ, డీడబ్ల్యూఓ సావిత్రి, ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, ఏపీడీ సందానంద్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ చంద్రశేఖర్, రూర్బన్ సిబ్బంది శ్రీకాంత్, శ్రావ్య పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా పాలనాధికారి చంపాలాల్



రోడ్డు కల్వర్టు నిర్మాణం పరిశీలిస్తున్న నర్సింహులు, డీఆర్‌డీఓ శంకర్

## పనుల పరిశీలన

**ఆసిఫాబాద్:** పట్టణంలో రూర్బన్ పథకం కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రోగ్రాం మేనేజర్ నర్సింహులు బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి డా. ఈ. శంకర్‌లతో కలిసి పరిశీలించారు. పట్టణంలో రూ. 2.30 కోట్లతో నిర్మించే జూబ్లీ మార్కెట్ పనులు, రూ. 60 లక్షలతో నిర్మించే ఉద్యాన వన పనులు, పలు రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. అధికారి వెంట ఎంపీడీఓ శ్రీనివాస్, రూర్బన్ పథకం ప్రత్యేక అధికారి సదానందం, ఈజీఎస్ ఏపీఓ చంద్రశేఖర్, సంగణక నిర్వాహకుడు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీవో శంకర్

# హరిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలి

● డీఆర్‌డీఓ శంకర్

**రెబ్బెన:** జిల్లాలో అత్యధిక మొక్కలు నాటి, హరిత జిల్లాగా రూపొందిచడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి(డీఆర్‌డీఓ) శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని ఖైర్‌గాం గ్రామంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ కార్నాథం సంజీవ్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శంకర్ మాట్లాడుతూ జిల్లాలో పచ్చదనం పెంచేందుకు కోటి మొక్కలు లక్ష్యంగా ఉన్నాయని, దానిని నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని 173 గ్రామ పంచాయతీలలో 1.10 కోటి మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో 40 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా ఉందని, ప్రజల భాగస్వామ్యంతో జిల్లాను హరిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వాతావరణ సమతుల్యతలో ముఖ్యపాత్ర పోషించే మొక్కల పెంపకం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఇళ్లల్లో, వీధుల్లోతో పాటు రహదారులకు ఇరువైపుల నాటాలన్నారు. నాటడమే కాకుండా అవి పెరిగే వరకు సంరక్షించుకునే బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్నాథం సంజీవ్‌కుమార్, ఏడీ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఏపీఎం వెంకటరమణ శర్మ, ఏపీవో కల్పన, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాయితీ బియ్యం స్వాధీనం

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** మహారాష్ట్రకు అక్రమంగా పలు రైళ్లలో రాయితీ బియ్యాన్ని రవాణా చేస్తుండగా స్వాధీన పర్చుకున్నట్టు కాగజ్‌నగర్ తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం ముందస్తు సమాచారం మేరకు మంగళవారం రాత్రి కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో భాగ్యనగర్, ప్యాసింజర్ రైళ్లను తనిఖీలు చేయగా 11 క్వింటాళ్ల రాయితీ బియ్యం లభించినట్టు చెప్పారు. ఈ మేరకు బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ దాడుల్లో చింతలమానేపల్లి తహసీల్దార్ ప్రకాష్, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.



బియ్యాన్ని స్వాధీన పర్చుకున్న రెవెన్యూ అధికారులు, రైల్వే పోలీసులు

# భట్టుపల్లిలో మొక్కల పంపిణీ

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లిలోని లక్ష్మినగర్‌లో బుధవారం జిల్లా పాలనాధికారి చంపాలాల్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి అవరణలో పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచి, పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీవో శ్యాంనాయక్, ఏపీఎంలు అన్నాజీ, ముక్తేశ్వర్, బుచ్చన్న, నగేష్, రాము, సర్పంచి రాధాబాయి, స్వయం సంఘాల మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉసురు తీస్తున్నాయ్..!

**(మొదటి పేజీ తరువాయి)** డ్రైవర్ హ్యాండిల్ తిప్పడానికి, బ్రేకు వేయడానికి వీలు లేకుండా ఉంటుంది. పరిస్థితి అదుపు తప్పినపుడు డ్రైవర్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేని పరిస్థితుల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మంగళవారం వాంకిడి మండల బెండార వద్ద జరిగింది ఇదే. ప్రమాద సమయంలో ఆటోలో 11 మంది ఉన్నారు. డ్రైవర్‌కు రెండు వైపులా నలుగురు ఉన్నారు. అంతకు మించి మితిమీరిన వేగంలో వెళ్తున్నాడు. అసలే ప్రమాదాల మూలమలుపు. హెచ్చరిక బోర్డు లేదు. ముందున్న బస్సును దాటేయడానికి వేగాన్ని మరింత పెంచాడు. ఎదురుగా వస్తున్న లారీ రూపంలో మహా దారుణం పొంచి ఉందని తెలుసుకొనే లోపే ప్రమాదం జరిగిపోయింది. ఆటోను రక్షించుకొనే ప్రయత్నానికి అవకాశమే లేదు. ఈ ఘటనలో ఆరుగురు విగతజీవులయ్యారు. ఐదుగురు క్షతగాత్రులయ్యారు. డ్రైవర్ రాంచందర్ మద్యం తాగి ఉన్నాడని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ ఒక్క సంఘటనను పరిశీలిస్తేనే ఇన్ని తప్పులు కనిపిస్తున్నాయి. డ్రైవర్‌తో పాటు పోలీసులు, వాహనాల తనిఖీ అధికారులు, ర.భ శాఖ అధికారుల తప్పు కూడా స్పష్టంగా కనిపిస్తోంది.



ఆటోలో డ్రైవరు పక్కన కూర్చోవడం కాగజ్‌నగర్‌లో సాధారణం..

**కుమురం భీం జిల్లాలో జిల్లా ఏర్పడిన నాటి నుంచి..**

| | |
|---|---|
| రహదారి ప్రమాదాలు | - 171 |
| మృత్యులు | - 57 |
| క్షతగాత్రులు | - 149 |
| డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకున్నది | - 341 |
| వాహన తనిఖీల్లో నమోదైన కేసులు | - 35,869 |
| విధించిన జరిమానా | - రూ. 49,36,990 |

### కనిపించని హెచ్చరిక బోర్డులు..

రహదారిపైకి వచ్చే ప్రతి వాహనానికి జీవితకాలపు రహదారి పన్నును వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. రహదారులు నిర్వహణ, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యల కోసమే ఈ పన్నులు తీసుకుంటున్న రహదారులు, భవనాల శాఖ వారు తమ బాధ్యతల్ని విస్మరిస్తున్నారు. నిత్యం రహదారులు రక్తసిక్తమవుతుంటే కళ్లప్పగించి చూస్తున్నారు. ఇరుకు వంతెనలు, ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు, రద్దీ ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలనే సంగతే మరిచిపోతున్నారు. దీంతో జరిగిన చోటే మళ్లీమళ్లీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బెండార వద్ద జరిగిన రహదారి ప్రమాదం ఇందుకు తాజా ఉదాహరణ. హైదరాబాద్-నాగ్‌పూర్ రాష్ట్రీయ రహదారి ఇది. ప్రమాద స్థలంలో పెద్ద మూలమలుపు ఉంది. అక్కడే ఇరుకైన పాత వంతెన కూడా ఉంది. ఇక్కడ కనీసం నెలకు రెండు మూడు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఇక్కడ హెచ్చరిక సూచికను ఏర్పాటు చేయలేదు. వంతెనను పునర్ నిర్మించే పనులు చేపట్టలేదు. ఈ మార్గంలోనే బుదల్‌ఘాట్ వంతెన వద్ద కూడా ముందు వాహనం కనిపించనంతగా మూల మలుపు ఉంది. నిజాం కాలంనాటి ఇరుకు వంతెన ప్రమాదాలకు నెలవుగా ఉంది. ఇక్కడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెబ్బెన మండలంలోని బెల్లపుఒర్రె, తక్కళ్లపల్లి, పులికుంట, కాగజ్‌నగర్-దహెగాం మార్గం మూలమలుపులు, సిర్పూరు(టి)మండల డోరపల్లి, కెరమెరి ఘాట్స్, ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడ, భారత్‌గ్యాస్ గోదాం, గోలేటి క్రాస్ మూలమలుపులు ప్రమాదాలకు నెలవులుగా మారాయి, ఇక్కడ ప్రమాదాలను అరికట్టడానికి సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం.

### తిరుపతి కుటుంబానికి ఆధారం లేకుండా పోయింది

బెండార వద్ద జరిగిన ఆటో ప్రమాదంతో మృతి చెందిన కెరమెరి మండల లీమ్‌గూడకు చెందిన ఆదె తిరుపతి కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. ఆయన భార్య భారతి ప్రస్తుతం గర్భవతి. ఇప్పటికే అయిదేళ్లలోపు వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. మృతదేహం వద్ద భారతి, కుటుంబ సభ్యులు రోదించిన తీరు చూసిన వారిని కంటతడి పెట్టించింది. వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషించే తిరుపతి ప్రమాదంలో చనిపోవడం ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ సంఘటనలో చనిపోయినవారిది ఒక్కొక్కరి ఒక్కో విషాదగాథ. దీనంతటికీ బాధ్యులెవరు ప్రత్యక్షంగా డ్రైవర్ అయినా పరోక్షంగా సంబంధిత అధికారులే.

### ఈ సంఘటనలూ అంతే..

☛ గత జూన్ 13న రెబ్బెన మండల తక్కళ్లపల్లి బస్టాండ్ సమీపంలో లారీ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకుల జీవితాలు అర్ధంతరంగా ముగిశాయి. సంఘటన స్థలంలో రహదారి ఇరుకుగా ఉండటం, హెచ్చరిక సూచనలేమీ లేక పోవడం, మితిమీరిన వేగాలు ఈ దుర్ఘటనకు కారణమయ్యాయి.

☛ ఇదే మండలంలోని పులికుంట వద్ద అంబులెన్సు వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ చనిపోయింది. రహదారి సమస్యతో పాటు మితిమీరిన వేగమే ఇందుకు కారణమని పోలీసులు నిర్ధరించారు.

ఇలా జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదాలు దాదాపుగా డ్రైవర్ల నిర్లక్ష్యంతో పాటు, రహదారులు సమస్యలు, పరిమితిని మించిన ప్రయాణికులే కారణంగా తెలుస్తోంది.



ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేని బెండార మూలమలుపు

### తనిఖీలు ముమ్మరం చేస్తాం



*శ్యాంనాయక్, జిల్లా రవాణా శాఖాధికారి*

వాహన ప్రమాదాలు అరికట్టేందుకు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తరచూ తనిఖీలు చేస్తూ లైసెన్సులు, వాహన సామర్థ్యంపై తప్పులుంటే చర్యలు తీసుకుంటున్నాం. పరిమితిని మించిన ప్రయాణికుల చేర్చే వారిని పట్టుకొని కేసులు పెడుతున్నాం. జరిమానా విధిస్తున్నాం. ప్రమాద స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డుల కోసం ర.భ శాఖ వారికి సూచించాం. ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి రెండు మండలాలో ఏఎంవీఐని నియమించి నిత్యం తనిఖీలు చేస్తాం. నిబంధనలు మీరిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.



# ఏదీ జలసిరి..!

**(మొదటి పేజీ తరువాయి)** కాలువల గుండా నీరు పారుతోంటే కొందరు రైతులు మోటార్ల ద్వారా తోడుకుంటున్నారు. అయితే ఈసారి వర్షాలు లేక పోవడంతో జలాశయం నీటి నిల్వ 6.1 టీఎంసీలకు పడిపోయింది. 243 మీ. పూర్తిస్థాయి నీటి మట్టం కాగా సోమవారం 238.15మీ. నీరుంది. తాజాగా కురిసిన వర్షాలు ఈ జలాశయంలో నీటి మట్టాన్ని ఏమాత్రం పెంచలేక పోయాయి. భారీ వర్షాలు వస్తేగాని ఇందులో నీటి మట్టం పెరిగే అవకాశం లేదు. ఎడమ కాల్వ ద్వారా 80 కూసెక్కుల నీటిని వదులుతున్నారు.

| | |
|---|---|
| **జలాశయం అంచనా వ్యయం** | **: రూ.873 కోట్లు.** |
| **ఆయకట్టు లక్ష్యం** | **: 45,500 ఎకరాలు.** |
| **ప్రస్తుతం నీరందున్న ఆయకట్టు** | **: సుమారు వెయ్యెకరాలు** |
| **(కొందరు కాలువల నుంచి మోటార్లతో తోడుకుంటున్నారు)** | |
| **పూర్తి నీటి సామర్థ్యం** | **: 10.393 టీఎంసీలు..** |
| **ప్రస్తుత నీటినిల్వ** | **: 6.103 టీఎంసీలు** |

### వట్టివాగు వట్టిపోతోంది

జిల్లాలో రెండు దశాబ్దాల క్రితమే పూర్తయిన ఆసిఫాబాద్ మండలంలోని వట్టివాగు జలాశయం రైతుల ఆశలు తీర్చడం లేదు. ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లోని 24,500ల ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సిన ఈ జలాశయం కాలువల దుస్థితి కారణంగా నాలుగువేల ఎకరాలకు కూడా తడి అందించలేని దుస్థితిలో ఉంది. వానలు బాగా పడి జలాశయం నిండుగా ఉన్నప్పటికీ గతేడాది చివరి ఆయకట్టుకు నీరు అందలేక వరి పొలాల్లో పశువులు మేపే దయనీయ స్థితిని చూశాం. ఈసారి వరుణుడు ముఖం చాటేయడంలో జలాశయంలో నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి పడిపోతోంది. జలాశయంలోకి వరద నీరు చేరేలా వానలు రానందున్న జలాశయంలో ఉన్న నీరుకూడా తగ్గిపోతోంది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షం కూడా ఇందులోకి నీటి చేర్చలేక పోయింది. కాల్వల్ని బాగు చేసి జలాశయంలోకి సింగరేణి ఓసీపీ ఓవర్ డంప్ చేరకుండా చర్యలు చేపట్టాలని రైతాంగం ఆందోళనలు చేపడుతున్న విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం ఆసిఫాబాద్‌లో 9 సెం.మీ. వర్షం కురిసినా ఎగువన భారీగా లేక పోవడంతో జలాశంలోకి కొత్తనీరు చేరలేదు. పైగా ఆయకట్టులోని వరిపొలాలకు కుడి, ఎడమ కాలువల ద్వారా 165క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో నీటిమట్టం రోజు రోజుకు పడిపోతోంది.

| | |
|---|---|
| **జలాశయం నిర్మాణ వ్యయం** | **: రూ. వంద కోట్లు.** |
| **ఆయకట్టు లక్ష్యం** | **: 24,500 ఎకరాలు.** |
| **ప్రస్తుతం నీరందుతున్న ఆయకట్టు** | **: 4000 ఎకరాలు** |
| **పూర్తి నీటి సామర్థ్యం** | **: 2.89టీఎంసీలు** |
| **ప్రస్తుత నీటి నిల్వ** | **: 1.074టీఎంసీలు.** |



చెలిమెల జలాశయంలో పడిపోయిన నీటిమట్టం

### చెలిమెల గలగలలేవి

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చలవతో 1998లో పూర్తయిన తిర్యాణి మండలంలోని చెలిమెలవాగు(ఎన్టీఆర్‌సాగర్) జలాశయం ఏనాడూ పూర్తి ఆయకట్టుకు నీరందించలేదు.

| | |
|---|---|
| **జలాశయ నిర్మాణ వ్యయం** | **: రూ.120కోట్లు.** |
| **ఆయకట్టు లక్ష్యం** | **: 6 వేల ఎకరాలు** |
| **ప్రస్తుతం నీరందే ఆయకట్టు** | **: 1500 ఎకరాలు (సుమారుగా)** |
| **పూర్తి నీటి సామర్థ్యం** | **: 0.37 టీఎంసీలు.** |
| **ప్రస్తుత నీటి నిల్వ** | **: 0.171 టీఎంసీలు.** |

కాలువల దుస్థితి దీనికి ప్రధాన కారణంగా. ఆరువేల ఎకరాలకు నీరందించాల్సిన ఈ జలాశయం రెండు వేల ఎకరాలను కూడా తడపలేక పోతోంది. ప్రతీ ఖరీఫ్‌లో నిండుకుండలా మారి మత్తడిపైనుంచి నీరు గలగలా పొర్లిపోయే ఈ జలాశయం ఈసారి నీరు లేక వెలవెల పోతోంది. వానలు లేక పోవడంతో జలాశయ నీటిమట్టం 326 మీ. నుంచి 322మీ.లకు పడిపోయింది. ఈ సారి కాలువల ఆధునికీకరణ పనులకు రూ.22కోట్ల మేర నిధుల వచ్చినప్పటికీ ఆ పనులు సకాలంలో పూర్తి కాలేదు. దీనికి తోడు వర్షాభావ పరిస్థితులు ఆయకట్టు రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ఉన్న కొద్దిపాటి నీటిలో 36క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు వదులుతున్నారు. వానలు కురుస్తున్నా జలాశయంలోని వరద నీరు రాలేదు.

**జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వేసిన పంటల్ని హెక్టార్లలో పరిశీలిస్తే**

| వరి | పత్తి | మక్క | జొన్న | కంది | పెసర | మినుము | సోయా |
|---|---|---|---|---|---|---|---|
| 881.5 | 95238 | 644 | 1808.9 | 10391 | 2218 | 897 | 3793 |



వట్టివాగు జలాశయంలోని నీరు

### ఎర్రవాగు నెర్రెవారుతోంది

సిర్పూరు నియోజకవర్గంలోని 11 వేల ఎకరాకలు సాగు నీరందించే ఉద్దేశంతో దశాబ్దన్నర కాలం కిత్రం దహెగాం మండలంలోని దివంగత ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు పేరున నిర్మించిన ఎర్రవాగు జలాశయం పరిస్థితి కూడా దయనీయంగానే ఉంది. జలాశయంలో పూడిక, కాలువల దుస్థితి కారణంగా నాలుగు వేల ఎకరాలకు కూడా సక్రమంగా సాగునీరు అందించలేక పోతోంది. ఈ ఏడాదే కాలువల ఆధునికీకరణకు రూ.2.65 కోట్లు నిధులు వచ్చినా ఆ పనులు పూర్తి చేయడానికి మరో ఏడాది కాలం పడుతుంది. ఈ జలాశయంలో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి పడిపోయే దశలో ఉంది. ఆయకట్టు కింద వరిపంట వేసుకున్న ఆయకట్టు దారులకు ప్రాజెక్టులో నీరు లేని పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఓ మీటర్‌మేర నీరు ఇందులోకి చేరినా ఆ మేరకు ఆయకట్టు వదులుతుండటంతో నీటి మట్టం పెరగడం లేదు. సోమవారం నీటిని నిల్వను పరిశీలిస్తే మూడో వంతు నీరుకూడా లేదు.

| | |
|---|---|
| **జలాశయ అంచనా వ్యయం** | **: రూ. 86 కోట్లు** |
| **ఆయకట్టు లక్ష్యం** | **: 11 వేల ఎకరాలు** |
| **ప్రస్తుతం నీరందే ఆయకట్టు** | **: 4 వేల ఎకరాలు** |
| **పూర్తి నీటి సామర్థ్యం** | **: 0.84 టీఎంసీలు** |
| **ప్రస్తుత నీటి నిల్వ** | **: 0.314 టీఎంసీలు** |



# బడి రాతను మార్చారు

● పచ్చని ఒడిలో.. సర్కారు బడులు
● ఆకుపచ్చ తోరణం.. చూడచక్కని వాతావరణం
● హరితపాఠాలు.. వనాల పెంపులో ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు

జైనూరు, న్యూస్‌టుడే

'భూమికి పచ్చని రంగేసినట్లు' అని ఓ సినీకవి గేయాన్ని రాశాడు. అది అక్షరాల నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం పేరుతో మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టింది. పచ్చదనం, పరిశుభ్రత పాఠ్యాంశంగా భావించి బోధించడంతోనే సరిపెడితే అంతటితో లక్ష్యం నెరవేరదని భావించిన మండలంలోని రాశిమెట్ట, శేఖుగూడ ప్రభుత్వ బడుల ప్రధానోపాధ్యాయులు.. వాటి అవసరాన్ని విద్యార్థులు అనుభవపూర్వకంగా తెలుసుకునేందుకు వీలుగా బడి ఆవరణలోనే ఆచరించి చూపి ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థులను భాగస్వామ్యులను చేస్తున్నారు. సామాజిక బాధ్యతను గుర్తు చేస్తున్నారు. కుమురం భీం జిల్లాలోని గిరిజన పాఠశాలల గురించి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

## నాడు అధ్వానం.. నేడు ఆదర్శం

జైనూరు మండలం మారుమూల గిరిజన గ్రామంలోని రాశిమెట్ట గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం ఒకప్పుడు సమస్యల లొగిళ్లకు నిలయం. మూడేళ్ల కాలంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.పార్వతి మదిలో తట్టిన ఆలోచనకు ఉపాధ్యాయులంతా ముందుకు రావడంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. నాలుగేళ్ల క్రితం 300 మంది పిల్లల సంఖ్య దాటని పాఠశాలలో నేడు 550 మంది చదువుకుంటున్నారు.



పాఠశాలలో అందమైన పూల మొక్కలు

నిండిన పాఠశాల ఆవరణ చదును చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. తన మదిలో తట్టిన ఆలోచనకు అనుగుణంగా పాఠశాల పక్కనే రోడ్డు విస్తరణ



రాశిమెట్ట ఆశ్రమోన్నత పాఠశాల

సఫలీకృతులయ్యారు. పెద్ద పెద్ద బండరాళ్లను జేసీబీ సహాయంతో తొలగించారు. ఫలితంగా రెండేళ్ల వ్యవధిలో చేసిన కష్టానికి సత్ఫలితాలు చూస్తున్నారు. పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేయడంతో పాటు ప్రహరీ చుట్టూ మొక్కలు పెంచుతున్నారు.

### పాఠశాలలో అడుగడుగునా మొక్కలే...

మండలంలోని రాశిమెట్ట ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో అడుగు పెడితే చాలు నందనవనాన్ని తలపిస్తోంది. లోపలి వరకు చక్కని దారి, ఇరువైపుల అందంగా విరబూసిన పువ్వులు, పచ్చని మొక్కలే దర్శనమిస్తుంటాయి. ఆవరణలో గుండ్రంగా అందమైన ఆకారంలో చామంతి, బంతి, గులాబి తదితర రకరకాల పూల మొక్కలను నాటి సంరక్షిస్తుండగా.. మరోవైపు ఖాళీ ప్రదేశంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. పాఠశాలలోని రక్షిత మంచి నీటి ట్యాంకు నుంచి వృథాగా పోయే నీటిని పైపుల ద్వారా కూరగాయల తోటకు మళ్లించి ఎంచక్కా కల్తీ లేని కూరగాయలు సాగు చేస్తూ పిల్లలకు రుచికరమైన కూరగాయల భోజనం వడ్డించేందుకు చర్యలు చేపట్టారు.. ఎత్తు పల్లాలు, గుంతలు, బండరాళ్లతో

పనులు కొన సాగుతుండటంతో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేశారు. సదరు గుత్తేదారు, అర్‌అండ్‌బీ అధికారులను ఒప్పించి తవ్విన మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా పాఠశాల ఆవరణలోని గుంతలమయమైన మైదానంలో పోయించారు. ఒకటి రెండు కాదు.. ఏకంగా 90 టిప్పర్ల మొరం మట్టిని వేయించి చదును చేయించడంలో

### సమష్టి కృషితోనే సాధ్యం



**- ఎ.పార్వతి, ప్రధానోపాధ్యాయురాలు, రాశిమెట్ట, జైనూరు**

పాఠశాలను ఉద్యానవనంలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషి ఎంతో ఉంది. రెండేళ్లుగా పాఠశాల ఆవరణలో పచ్చదనం పరుచుకునేలా ఎంతో శ్రమపడ్డాం. పిల్లలకు హరిత పాఠాలు బోధించడంతో పాటు హరితవనాల పెంపు అనుభవపూర్వకంగా తెలుసుకునేందుకు విద్యార్థులకు చక్కని అవకాశం లభించింది. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ఆవగతం చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పూట విద్యార్థులు ఆటపాటలతో ఆలసట తీర్చుకుంటున్నారు. విద్యార్థులు తమ సొంత ఇల్లుగా భావించి మొక్కలకు నీరు పోస్తూ కంటికి రెప్పలా సంరక్షించుకుంటున్నారు.

## ఆదర్శప్రాయుడు.. ఈ భీముడు



శేఖుగూడ పాఠశాల ఇదే

మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ ఏకోపాధ్యాయ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట్నాక్ భీంరావు కృషి ఫలితంగా కుమురం భీం జిల్లా జైనూరు మండలంలోని శేఖుగూడ ప్రభుత్వ పాఠశాల ప్రస్తుతం చూడముచ్చటగా రూపుదిద్దుకుంది.



పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీల్లో చిన్నారులు

2015లో ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చినప్పుడు ఒకే తరగతి గది 10 మంది పిల్లలు మాత్రమే ఉండేది. పాఠశాలలో కనీస వసతులు కరవే. అధికారుల సహాయంతో గదుల సంఖ్యను పెంచారు. స్వచ్ఛ భారత్ కింద మంజూరైన మరుగుదొడ్లను చక్కాగా నిర్మించారు. ప్రహరీ లేకపోవడంతో సొంత ఖర్చుతో రూ.10 వేల విలువైన పెన్సింగ్ తీగ అమర్చారు. హరితహారంలో భాగంగా ఆవరణలో మొక్కలను నాటారు. వాటి బాధ్యతలను చిన్నారులకు అప్పగించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కమిటీ వేసి విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ.. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. పాఠశాల గోడలను అందమైన చిత్రాలతో తీర్చిదిద్ది.. మహనీయుల ప్రత్యేకతను ఛాయచిత్రాల ద్వారా చాటి చెబుతున్నారు. చిన్నారులు కటిక నేలపై కూర్చోవడం ఇబ్బందిని గమనించి రూ.5 వేలు ఖర్చు చేసి కుర్చీలు కొన్నారు. నాడు మూసివేత దశలో ఉన్న పాఠశాలలో నేడు 35 మంది చిన్నారులు చదువుకుంటున్నారు.

### మనసుంటే మార్గముంది



**- కోట్నాక్ భీంరావు, ప్రధానోపాధ్యాయుడు, శేఖుగూడ, జైనూరు**

మనసుంటే మార్గముంది. నేటి పిల్లలే రేపటి పౌరులు. విద్యార్థి దశ నుంచి వారిని క్రమశిక్షణతో కూడిన విద్యబోధన, సామాజిక అంశాలపై భాగస్వామ్యం చేయాలి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. తొలుత పాఠశాలలో చక్కని ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని నిర్ణయించాం. తదనుగుణంగా పాఠశాల ఆవరణలో అందరమైన పూల మొక్కలు, నీడనిచ్చే చెట్లు నాటి సంరక్షించుకున్నాం. వృథాగా పోయే నీటిని మళ్లించి కూరగాయలు సాగు చేసి మధ్యాహ్న భోజనంలో రుచికరమైన భోజనం వడ్డించడంతో క్రమేణ పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగింది.

# దేవుడు మెచ్చేట్టు.. ప్రకృతి మురిసేటట్టు

పండగలు మన సాంప్రదాయాలకు ప్రతీకలు. ప్రకృతి ఆరాధనకు తార్కాణాలు. భక్తిప్రపత్తులకు వేదికలు. పర్యావరణ పరిరక్షణకు స్వాగత తోరణాలు. మన పూర్వీకులు ప్రతి పండక్కీ ఒక ప్రత్యేకను చూపించారు. ఆ పండగ తెచ్చే సంబరాలు మనతో పాటు మన పర్యావరణానికి ఏ మేరకు మేలు చేస్తాయో వివరించారు. అయితే నేటి తరం పండగల నిర్వహణలో అత్యుత్సాహానికి పోయి పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని నిర్వహిస్తున్న తీరే ఇందుకు నిదర్శనం. సంప్రదాయ మట్టి విగ్రహాలకు బదులు రంగురంగుల రసాయనాలతో సిద్ధం చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి కాలుష్యానికి దారులు తెరుస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ తరుణంలో పర్యావరణాన్ని కాపాడేందుకు నడుం బిగిస్తున్న పలువురు మట్టి వినాయకులే శ్రేష్ఠమని ప్రచారం చేస్తున్నారు. గణేష్ నవరాత్రుల్లో మట్టి ప్రతిమలనే పూజిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ఆదర్శ భక్తులపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

● మట్టి గణపతినే పూజిద్దాం..
● ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు..
● సహజ రంగులే వాడదాం..
● పర్యావరణ పరిరక్షకులు ఈ ప్రకృతి ప్రేమికులు



ఆసిఫాబాద్‌లో ఆకట్టుకుంటున్న ఇందాని రమేష్ తయారు చేసిన మట్టి విగ్రహాలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

మన దేశంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే గణేష్ నవరాత్రులు వీధివీధినా సందడిని తీసుకొస్తాయి. సహజంగా లభించే మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయాలి. నవరాత్రుల అనంతరం ఈ విగ్రహాలను జలంలో కలిపాలని పురాణాలు సూచిస్తున్నాయి. దీంతో పంచభూతాల్లో ఒకటైన భూమితోపాటు, జలాన్ని ఆరాధించిన వారవుతారు. నీటిలో సులువుగా కరిగిపోయే మట్టి వినాయకులు జలాన్ని కాని వాతావరణాన్ని కాని ఏవిధంగానూ కలుషితం చేయవు. విఘ్నేశ్వరుడి పూజకు వినియోగించే పూలు, పత్రి, కాయలు, పండ్లు, పాలాకుల విస్తర్లు, నైవేద్యాలు అన్నీ ప్రకృతి ప్రసాదించినవే. భగవంతుని పూజ అంటే ప్రకృతి పూజే అని పెద్దలు వివరిస్తుంటారు. ఇంత చక్కని సంప్రదాయాన్ని విస్మరించి ఆకర్షణ కోసం మట్టి ప్రతిమల స్థానంలో రసాయనాల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తయారు చేసిన విగ్రహాలకు రసాయన రంగులు పూసి పూజలు చేస్తే అది ప్రకృతిని ఆరాధించినట్లు ఎలా అవుతుందని పర్యావరణ వేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఆధునిక ప్రపంచంలో తినే ఆహారం, తాగే నీరు, పీల్చే గాలి ఇలా అన్నీ కలుషితమైపోతున్న తరుణంలో ప్రజల్లో ఇప్పుడిప్పుడే చైతన్యం రగులుతోంది. మట్టి గణపతులనే ప్రతిష్ఠిస్తామని పలు గణేష్ మండళ్లవారు ముందుకు రావడం స్వాగతించాల్సిన విషయం.

### పక్క రాష్ట్రాన్ని చూసి ఆచరిద్దాం

జిల్లాకు సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో రసాయనాలతో గణేష్, దుర్గా విగ్రహాల తయారీపై 2011నుంచి నిషేధం ఉంది. సరిహద్దులోని చంద్రపూర్ జిల్లా కేంద్రంలో మట్టిప్రతిమల తయారీకి ప్రాధాన్యం లభించింది. ఇక్కడ కొన్ని వందల కుటుంబాలు మట్టిప్రతిమల తయారీతో ఉపాధిపొందడంతో పాటు కాలుష్య నివారణకు ఎంతగానో తోడ్పడుతున్నారు. ఇక్కడ ఎవరైనా దొంగచాటుగా రసాయనాలతో విగ్రహాలు తయారు చేసినా స్థానిక ప్రజలే చైతన్యవంతులై ధ్వంసం చేస్తారని చంద్రపూర్‌లో మట్టి విగ్రహాల తయారీదారు గణేష్ 'న్యూస్‌టుడే'తో చరవాణిలో మాట్లాడుతూ వివరించారు. జిల్లా వాసులు ఇక్కడకొచ్చి వచ్చి మట్టి విగ్రహాలను తీసుకెళుతున్నారు.

### పల్లె నుంచి పట్టణాలకు వ్యాప్తి..

వాంకిడి మండల ఇందాని గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్ మొదట్లో చవితి పండక్కి తన ఇంట్లో మట్టితో చిన్నచిన్న వినాయక ప్రతిమలను చేసి గ్రామంలో కావాల్సిన వారికి ఇచ్చేవారు. ఇలా దుర్గాదేవీ, శారదా దేవీ విగ్రహాలను తయారు చేయడం మొదలెట్టాడు. గ్రామస్థుల కోరిక మేరకు పెద్ద వినాయక విగ్రహాలను కూడా గత కొద్ది సంవత్సరాలుగా సిద్ధం చేస్తున్నాడు. సమీప గ్రామాల వారు సైతం ఆర్డర్ ఇచ్చి విగ్రహాలను చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇందాని పరిసర గ్రామాల్లో మట్టి వినాయకులను పూజించేవారి సంఖ్య పెరిగింది. దీంతో మట్టి విగ్రహాల ప్రచారాన్ని పట్టణాలకు విస్తరించాలన్న ఆలోచనకు వచ్చారు. ఇందానిలోనే మహారాష్ట్రకు చెందిన విగ్రహ తయారీ కళాకారుల సహాయంతో ఆకర్షణీయమైన మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. రమేష్ కుమారులు రవి, ప్రశాంత్‌లు ఆసిఫాబాద్, మండల కేంద్రం వాంకిడిలో ఈ విగ్రహాలను ప్రదర్శనకు పెట్టారు.

### లయన్స్‌క్లబ్ వారు ఉచితంగా..



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆసిఫాబాద్ లయన్స్‌క్లబ్ వారు గత మూడేళ్లుగా వినాయక చవితి రోజున వందలాది మంది భక్తులకు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కాలుష్య నివారణ కోసం అందరూ మట్టివినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించాలని ప్రచారం చేపట్టారు.



### విగ్రహం కోసం మహారాష్ట్రకు..

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా రాష్ట్రీయ రహదారి పక్కన వివేకానంద గణేష్ మండలి వారు ఏర్పాటు చేస్తున్న గణేష్ మట్టి విగ్రహాన్ని మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి తీసుకొస్తున్నారు. అక్కడైతే కోరిన రూపాల్లో ప్రతిమకు ఏ రంగూ వేయకుండా మట్టి రంగులోనే ఆకట్టుకొనే విధంగా తయారు చేస్తారు. గతేడాది నిమజ్జనం రోజున ఉత్సవ సమితి వారు నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ఈ మట్టి వినాయకునికి బహుమతి లభించింది. పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ గణేష్ మండలి అధ్యక్షులు కాంద్రె విశాల్ మాట్లాడుతూ కేవలం భక్తే కాదు, పర్యావరణ రక్షణ కూడా ముఖ్యమే అంటున్నారు.

### నాలుగేళ్లుగా మట్టి విగ్రహమే



**- ఆర్.కృష్ణమూర్తి, గణేష్‌మండలి ఎన్జీవోస్ కాలనీ**

మా కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించినప్పటి నుంచి మట్టి వినాయకుడినే ప్రతిష్ఠిస్తున్నాం. జిల్లా కేంద్రంలో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న మాల్కడి తుకారాం వద్ద ఆర్డర్ ఇచ్చి మట్టి వినాయకులను కొనుగోలు చేస్తున్నాం. భక్తితో చేస్తున్న ఈ కార్యక్రమంతో మనుషులకు మేలు కలగాలే కాని కీడు కాకూడదని రసాయనాలతో తయారైన విగ్రహాల జోలికి వెళ్లడం లేదు.

### మట్టి వినాయకులే శ్రేష్ఠం



**- ఇందారపు మధుకర్ శర్మ, ప్రధాన అర్చకులు**

పురాణాల ప్రకారం చూసినా పూజకు మట్టి వినాయక ప్రతిమలే శ్రేష్ఠం. పంచభూతాల స్వరూపుడైన విఘ్నేశ్వరుడు ప్రకృతి ప్రేమికుడు. చెరువు మట్టిని తెచ్చి విగ్రహం చేయడం ఆనవాయితీ. ఆయనకు ప్రకృతిలో లభించే 21 రకాల పూలు, ఆకులతో పూజలు చేస్తారు. విగ్రహానికి ఔషధ గుణాలు వస్తాయి. ఆ విగ్రహాన్ని తిరిగి చెరువు నీటిలో వేయడంతో ఆ నీటికి, మట్టికి శక్తి వస్తుంది. ఏ విధంగా చూసినా మట్టి ప్రతిమలే మంచిది.

### ఇరవై ఏళ్లుగా మట్టి ప్రతిమలు సిద్ధం చేస్తున్నారు..



కుమురం భీం జిల్లా కేంద్రంలో మాల్కడి తుకారాం కుటుంబం ఇరవై ఏళ్లుగా మట్టి గణేష్ విగ్రహాలను తయారు చేస్తూ కాలుష్య నివారణకు తోడ్పాటునందిస్తున్నారు. ఈ ప్రాంతంలో పీవోపీ, రసాయనాలతో అందంగా తయారు చేస్తున్న విగ్రహాలతో పోటీపడి తన కళను ప్రకృతికి విరుద్ధంగా ఉపయోగించేది లేదన్న కట్టుబాటుతో తుకారాం ఆదర్శంగా నిలుస్తున్నారు. వినాయక ప్రతిమలతో పాటు దేవీ నవరాత్రుల సమయంలో దుర్గామాత, శారదామాత విగ్రహాలను సైతం మట్టితో తయారు చేసి ఈప్రాంతంలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా లభించే ఎర్రమట్టి, వరిగడ్డి, చెక్కలు, గోనె సంచులు, నీటి రంగులతో విగ్రహాలను ఆకర్షణీయంగా తయారుచేస్తున్నారు.



# సంకల్పమే గెలిచింది

● చిన్నతనంలోనే చూపును కోల్పోయిన అనిల్
● పట్టుదలతో ఉన్నత విద్యలో రాణిస్తూ...

దహెగాం, న్యూస్‌టుడే

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు మహాపురుషులవుతారు.. అన్నాడు ఓ కవి. మనిషి ఎదుగుదలకు కృషి, పట్టుదల, సంకల్పం ఉంటే ఎంతటి మహత్తరమైన పనినైనా సాధించవచ్చు. అలాంటి కోవకే చెందుతాడు దహెగాం మండల కేంద్రానికి చెందిన పందిర్ల అనిల్. చిన్నతనంలోనే చూపును కోల్పోయాడు. నేను ఏమి చేయలేను అనే నిరాసక్తతకు లోనుకాకుండా కష్టపడి విద్యలో రాణించాలని పట్టుదలతో కుటుంబ సభ్యుల సహకారంతో అంచెలంచెలుగా విద్యనభ్యసిస్తూ ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్నాడు.

దహెగాం మండల కేంద్రానికి చెందిన పందిర్ల రాజేశ్వరి-బాపు దంపులది పేద కుంటుంబం. వీరికి అయిదుగురు సంతానం. అందులో రెండోవాడైన అనిల్ చిన్నతనంలోనే ఇంటి వద్ద చోటు చేసుకున్న చిన్న ప్రమాదంలో కండ్లకు దెబ్బ తగలింది. శస్త్ర చికిత్స చేయించినా చూపురాలేదు. 1వ తరగతి నుంచి అయిదో తరగతి వరకు దహెగాం ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నాడు. ఆరు నుంచి 10వ తరగతి కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో గల అంధుల పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లోని చిన్నజీయర్‌స్వామి నేత్ర విద్యాలయంలో పూర్తి చేశాడు.

చూపు లేకున్నా విద్యలో చురుగ్గా ఉంటూ పలువురి మన్ననలు పొందుతూ ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్నాడు. తోటి విద్యార్థులతో పోటీ పడి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాడు. అనిల్ బ్రెయిలీ లిపి సాఫ్ట్‌వేర్ ఆధారంగా కంప్యూటర్‌ను అవలీలగా ఆపరేట్ చేస్తున్నాడు.

### ఆటల్లోనూ మేటి...

అనిల్ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నాడు. తాను పాఠశాల, కళాశాలల్లో నిర్వహించిన చెస్, క్రికెట్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను కైవసం చేసుకున్నాడు. కరీంనగర్ అంధుల పాఠశాలలో చదివే సమయంలో నిర్వహించిన చెస్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి అప్పటి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని కూడా అందుకున్నాడు. ఏరోజు కూడా నిరాసక్తతకు లోనుకాకుండా విద్యతో పాటు క్రీడల్లో చురుకుగా పాల్గొంటాడు. తన కుమారుడు అంధుడని ఏమి చేయలేడని మేం అధైర్య పడలేదని ఆనందంతో చెబుతున్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో పాటు గురువుల ప్రోత్సాహంతో ఈ విజయాలను సాధిస్తున్నానని అనిల్ గర్వంగా చెబుతున్నాడు. ఇష్టపడి చేస్తే ఏదీ కష్టం కాదని చెప్పుకొచ్చాడు.

# తొలిపొద్దు పొడిచింది

● నాడు గుడుంబా తయారీ.. నేడు స్వయం ఉపాధి
● ప్రభుత్వ చేయూతతో మారిన జీవితాలు



వాంకిడి, బెజ్జూర్, న్యూస్‌టుడే

వారంతా గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా(నాటు సారా)ను తయారు చేస్తూ రహస్యంగా విక్రయించుకుంటూ జీవనోపాధి పొందేవారు. చేసే పని చెడు అని తెలిసినా ఇతర పనులు చేయలేక, ఆర్థిక స్తోమతు సహకరించక ఈ పనినే చేసేవారు. ప్రభుత్వం గుడుంబా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. గుడుంబా స్థావరాలపై దాడులు, విక్రయించే వారిపై కేసులు నమోదు చేసింది. సారా తయారు చేసే కుటుంబాలకు ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పించి ఆదుకునేందుకు రూ.2 లక్షలు విలువ చేసే యూనిట్లను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వం సాయాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి పొందుతూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. వారి జీవితాల్లో వచ్చిన మార్పులపై 'న్యూస్‌టుడే' కథనం.

కుమురం భీం జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజవర్గంలోని మండలాల్లోని గిరిజన తండాలు, గూడాల్లో గుడుంబా విక్రయించే 46 మందిని గుర్తించి వారికి రూ.92 లక్షల విలువ చేసే యూనిట్లను మంజూరు చేశారు. స్వయం ఉపాధి పొందేందుకు ఆటోలు, కిరాణా దుకాణాలు, ఫొటో స్టూడియో, మేకలను మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే కొన్ని మండలాల్లో యూనిట్లు అందించగా మరికొన్ని మండలాల్లో అందజేయాల్సి ఉంది. ఆర్థిక సాయం పొందిన వారు మూడేళ్ల పాటు గుడుంబా విక్రయాలు చేపట్టనని హామీ పత్రం ఇవ్వడంతో పాటు, ఆయా మండలాల తహసీల్దార్ల ముందు బైండోవర్ చేశారు. ఒక వేళతిరిగి గుడుంబా విక్రయించినట్లు తేలితే రూ. లక్ష జరిమానా విధించి, అందించిన డబ్బులను రికవరీ చేస్తారు.

### 46 యూనిట్లు పంపిణీ

గుడుంబా తయారీ మానేసిన వారికి ప్రభుత్వం అందించే సహాయం డబ్బుల రూపంలో ఇస్తే ఉపయోగం లేకుండా పోతుందన్న ఉద్దేశంతో ఆబ్కారి శాఖా ఆధ్వర్యంలోనే లబ్ధిదారులు కోరుకున్న యూనిట్లను స్వయంగా కొనుగోలు చేసి ఇచ్చారు. జిల్లాలోని వాంకిడి, ఆసిఫాబాద్, తిర్యాణి, రెబ్బెన, బెజ్జూర్, దహెగాం, సిర్పూర్‌టి మండలాల్లోని గుడుంబా తయారీ మానేసిన వారిని ఎంపిక చేసి యూనిట్లను మంజూరు చేశారు. ప్రభుత్వం యూనిట్ల రూపేణా అందించిన రూ.2 లక్షలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు.

**కుమురం భీం జిల్లాలో మంజూరైన యూనిట్లు**

| ఆసిఫాబాద్: | సిర్పూర్: |
| --- | --- |
| 17 | 29 |

### గౌరవంగా జీవిస్తున్నారు..



ఈ చిత్రంలో ఆటో పక్కన నిలబడ్డ వ్యక్తి బెజ్జూర్ మండలం లంబడితాండా(మర్తిడి)కి చెందిన ధారావత్ బద్రి. గతంలో గుడుంబా తయారు చేస్తూ జీవనోపాధి పొందేవాడు. గుడుంబా తయారీ వృత్తిని వదులుకోవాలని పోలీసులు, ఆబ్కారి శాఖాధికారులు సూచించడంతో తయారీని వదులుకున్నాడు. గుడుంబా తయారీ మానుకున్న వారికి ప్రభుత్వం ఇచ్చే సహాయంలో భాగంగా ఇతనికి ఆటో యూనిట్‌ను మంజూరు చేశారు. ప్రస్తుతం ఆటో నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. ఇప్పుడు గౌరవంగా జీవిస్తున్నాడు.

### గుడుంబా తయారీ మానేసిన కుటుంబాలను ఆదుకుంటాం

**- ఎండీ మోహాసిన్ అలీ, సీఐ, ఆసిఫాబాద్**

ప్రభుత్వ ఆదేశాల మేరకు గుడుంబా తయారీ మానేసిన వారిని గుర్తించి, వారు స్వయం ఉపాధి పొందేందుకు యూనిట్లను అందజేశాం. మొదటి విడతగా గుర్తించిన వారికి యూనిట్లు అందజేశాం. లబ్ధిదారుల నుంచి గుడుంబా తయారీని మానేస్తున్నట్లు హామీ పత్రాన్ని తీసుకున్నాం. తహసీల్దార్ ముందు బైండోవర్ చేశాం. ఒక వేళ యూనిట్ పొందాక, తిరిగి గుడుంబా తయారు చేస్తే వారికి లక్ష జరిమానాతో పాటు ఇచ్చిన రుణాన్ని రికవరీ చేస్తాం.

### మేకల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటూ..



ఈ చిత్రంలో ఉన్న మహిళ రాహటె సుమన్‌బాయి. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే పదేళ్ల కిందట భర్త చనిపోయాడు. కొంతకాలం వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేది. మూడేళ్ల కిందట గుడుంబా తయారు చేసి అమ్మేది. చాలా సార్లు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వ సహాయంతో మేకలు పెంపకంతో గౌరవంగా కుటుంబాన్ని పోషిస్తోంది.

### ఆటో కోసం దరఖాస్తు చేసుకున్నా..



ఈయన పేరు భుక్యా దేవాజీ. గుడుంబా తయారీ మానేసిన వారికి ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలుసుకొని సంతోషపడ్డాడు. ఆటో రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. యూనిట్ మంజూరు చేస్తే గౌరవంగా బతుకుతానని సంబరపడుతున్నాడు.




## 'వారసత్వం ప్రకటించిన తర్వాతనే ఎన్నికలు'

**మందమర్రి:** సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను ప్రకటించిన తర్వాతనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి డిపెండెంట్ యువసేన ఆధ్వర్యంలో గనిపై ప్రచారం చేపట్టారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కె.కె-5 గనిపై యువసేన నాయకులు, కార్యకర్తలు గనిపై కార్మికులను కలిసి వారసత్వ ఉద్యోగాల అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజేశ్, సతీష్, రాజు, వెంకటేశ్, రాజుగౌడ్, ప్రవీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలి

**సీసీసీ(శ్రీరాంపూర్ గ్రామీణం):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంస్థ ప్రగతి సాధించాలంటే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలని సింగరేణి జీఎం(క్వాలిటీ) నాగభూషణరెడ్డి సూచించారు. బుధవారం సీసీసీలోని సింగరేణి అతిథి గృహంలో ఆయన ఏరియా అధికారులతో సమావేశమయ్యారు. బొగ్గు సరఫరాలో నాణ్యతతోపాటు సకాలంలో బొగ్గును వినియోగదారులకు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జైపూర్‌లోని సింగరేణి విద్యుత్తు కేంద్రంలో బొగ్గు నిల్వలు తగ్గిపోయాయని ఆయన తెలిపారు.

# వాస్తవ లాభాలు ప్రకటించాలి

## బొగ్గు గనులపై ఏఐటీయూసీ ధర్నాలు

**మందమర్రి/రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే:** సింగరేణి సంస్థ గడిచిన ఏడాది(2016-17 సంవత్సరం) ఆర్జించిన వాస్తవ లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బొగ్గు గనులు, విభాగాలపై ధర్నా కార్యక్రమాలను చేపట్టింది. బుధవారం మందమర్రి ఏరియాలోని మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో బొగ్గు గనులు, విభాగాలపై వేర్వేరుగా నిరసన కార్యక్రమాలను నిర్వహించింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు కలిసి గనులు, విభాగాలపై ర్యాలీలు, ధరాలు చేపట్టింది. యాజమాన్యం తీరును తప్పుపడుతూ కార్మికులు గనుల ప్రధాన కార్యాలయాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. మందమర్రి పట్టణంలోని కె.కె-1, 5, కళ్యాణిఖని ఉపరితల బొగ్గుగని, ఏరియా సింగరేణి వర్క్‌షాపు, సివిల్, స్టోర్స్ ఆవరణలో ఆందోళనలు జరిగాయి. అనంతరం ఆయా గనులు, విభాగాల బాధ్యులకు వినతిపత్రాలు అందజేశారు. రామకృష్ణాపూర్‌లోని ఆర్కే-1ఏ గనిపై ఏఐటీయూసీ ధర్నా కార్యక్రమం చేపట్టింది. అంతకు ముందు కె.కె-1, కె.కె-5, ఆర్కే-1ఏ గనులపై వేర్వేరుగా నిర్వహించిన ధర్నాలను ఉద్దేశించి యూనియన్ బ్రాంచి కార్యదర్శులు సలెంద్ర సత్యనారాయణ, ఎండీ.అక్బర్‌అలీ, కేంద్ర కమిటీ కార్యదర్శి పి.భానుదాస్, సహాయ కార్యదర్శులు భీమనాధుని సుదర్శనం, ఇప్పకాయల లింగయ్యలు మాట్లాడారు. 2016-17 సంవత్సరంలో 62 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తే కేవలం రూ.395.83 కోట్ల లాభాలు వచ్చాయని సింగరేణి యాజమాన్యం తప్పుడు లెక్కలు చెప్పుతుందన్నారు. ధర్నా కార్యక్రమాల్లో నాయకులు దేవసాని సాంబయ్య, బాపూజీ, పున్నపు శ్రీనివాస్, వెల్ది ప్రభాకర్, సామిశెట్టి రాజేశం, కొత్త తిరుపతి, సుదర్శన్ రెడ్డి, రాందాస్, ఆర్ఎస్.రాజు, శర్మ, ఎల్లయ్య, డి మనోహర్, ఎం.వెంకటేశ్వర్లు, కొమురరెడ్డి, తిరుపతి, కొండయ్య, లక్ష్మన్, ప్రవీన్, రాజేశం(మందమర్రి), కాదండి సాంబయ్య, గాజుల రాయమల్లు, నల్ల జనార్ధన్, ఎగుడ మొండి, కోమురయ్య, బానయ్య, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

**జైపూర్:** జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గని వద్ద బుధవారం ఏఐటీయూసీ నాయకులు గని మేనేజర్ ఓదెలుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏరియా ట్రేడ్‌మెన్ కార్యదర్శి వేణుమాధవ్ మాట్లాడుతూ వెంటనే వాస్తవిక లాభాలను ప్రకటించి 30 శాతం లాభాల వాటాను కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మురళి, ఫిట్ ఉపాధ్యక్షుడు మధుకర్, నాయకులు పోశం, రాజేంద్రప్రసాద్, సదానందం, నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరాంపూర్‌లో..

**శ్రీరాంపూర్ గ్రామీణం:** 2016-17 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు 30 శాతం వాటాను చెల్లించాలని కోరుతూ బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు, విభాగాలపై ఏఐటీయూసీ నాయకులు నిరసనలు తెలిపారు. అనంతరం వారు ఆయా గనుల అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్సార్పీ-3 గని వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య పాల్గొని మాట్లాడారు. సింగరేణి సాధించిన లాభాలను తప్పుగా ప్రకటించి కార్మికులకు తక్కువ వాటా ఇవ్వాలని చూస్తుందని ఆరోపించారు. అనంతరం ఏఐటీయూసీ నాయకులు ఎస్సార్పీ-3 గని మేనేజర్ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వీరమల్లు, మేక శ్రీనివాస్, మురళీ చౌదరి, నాగభూషణం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్సార్పీ-3 గని మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, తదితరులు

### ఇతర గనులపై..

గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ లాభాల్లో 30 శాతం వాటాను కార్మికులను ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు వివిధ గనులపై నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎస్సార్పీ-1 గని వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎం.కొమురయ్య, దాడి రాజయ్య, జుంగోని శంకర్, కమతం సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సార్పీ ఓసీపీలో సంఘం నాయకులు టి.మోహన్‌రెడ్డి, రాజమౌళి, బి.మల్లయ్య, కె.రాజయ్య, చేరాలు, ఐకే-1ఏ గనిలో వేణుమాదవ్, మురీ, పి.మధూకర్, గణపురం శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఆర్కే-7 గనిలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి కొట్టె కిషన్‌రావు, మారపెల్లి సారయ్య, కోడి వెంకటేశం, పి.రాజేందర్, ఆర్కే-న్యూటెక్‌లో ఎస్.భీమరాజు, సకినాల నర్సయ్య, ఎన్.రాజయ్య, బి.రాములు, ఆర్కే-8 గనిలో వి.బాల్‌రెడ్డి, ఎన్.వెంకటేశ్వరరావు, కొట్టె శంకరయ్య, శ్రీరాములు, యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆర్కే-6 గనిలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ల్యాగల శ్రీనివాస్, నాయకులు రాంచందర్, డీకొండ మల్లయ్య, నర్సయ్య, ఆర్కే-5 గనిలో బియ్యాని శ్రీనివాస్, పెసరి రాజయ్య, రాంచందర్, ఆర్కే-5బీలో ప్రసాదరెడ్డి, అగ్గు చంద్రయ్య, లింగయ్య, సీహెచ్‌పీలో సాంబశివరావు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆర్కే-6 గనిలో వినతిపత్రం సమర్పిస్తున్న బ్రాంచి కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు


కె.కె-1 గనిపై మాట్లాడుతున్న ఏఐటీయూసీ కార్యదర్శి సత్యనారాయణ

## మాదారం టౌన్‌షిప్‌లో సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

**తాండూరు:** బెల్లంపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని మాదారం టౌన్‌షిప్‌లో కార్మికేతరులు, విశ్రాంత కార్మికుల కుటుంబాల ప్రధాన సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హామీనిచ్చారు. ఇక్కడ దాదాపుగా 700 సింగరేణి క్వార్టర్లుండగా 200 క్వార్టర్లలో కార్మికేతరులు, విశ్రాంత కార్మిక కుటుంబాలు ఉంటున్నాయి. సింగరేణి సంస్థ నిబంధనల పేరుతో వారికి తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తుంది. తాజాగా 160 క్వార్టర్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేసింది. ఈపరిస్థితిని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించి సమస్య పరిష్కరించాలని కోరగా బుధవారం ఎమ్మెల్యే మాదారంలో పర్యటించారు. ఆయన అక్కడి ప్రజలు, మహిళలు, విశ్రాంత కార్మికులతో మాట్లాడారు. అనంతరం టౌన్‌షిప్‌లో శిథిలమైన క్వార్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మాదారం టౌన్‌షిప్‌లో ఈసమస్యపై ఇప్పటికే ఏరియా జీఎం రవిశంకర్‌తో పాటు సీఅండ్ఎండీ శ్రీధర్‌తోనూ మాట్లాడనని తెలిపారు. అయితే సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి మరోసారి ఉన్నతాధికారులతో చర్చించేందుకు వచ్చానన్నారు. ఖాళీ క్వార్టర్లలో నివసిస్తున్న కార్మికేతరులు, విశ్రాంత కార్మిక కుటుంబాలకు అండగా ఉంటూ వారి సమస్యను పరిష్కరిస్తానన్నారు. వారు నివాసముంటున్న ఇళ్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించి మరోసారి ఇబ్బంది లేకుండా చూస్తానని ఆయన వారికి హామీనిచ్చారు. ఈసందర్భంగా ఆయన ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌తో మాట్లాడారు. కార్మికేతరులు నివసిస్తున్న క్వార్టర్లకు శాశ్వతంగా విద్యుత్ సరఫరా చేసేలా అంచనాలు తయారు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు సురేష్‌బాబు, మండల తెరాస అధ్యక్షుడు దత్తుమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు సిరంగి శంకర్, తెరాస నాయకులు బానయ్య, దుగుట శ్రీనివాస్, తెబొగకాసం నాయకులు మల్రాజు శ్రీనివాస్‌రావు, మంగీలాల్ తదితరులు స్థానిక యువకులున్నారు.. టౌన్‌షిప్‌కు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక యువకులు గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. వీలైతే సింగరేణి సంస్థతో మాట్లాడి గ్రంథాలయం ఏర్పాటు చేసేలా చూస్తానని, కుదరని పక్షంలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయిస్తానని ఆయన హామీనిచ్చారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

## సమస్యలపై ఉద్యమిద్దాం: టీఎన్టీయూసీ

**రామకృష్ణాపూర్:** సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం కోసం ఉద్యమించాలని, రాష్ట్ర ప్రభుత్వం, గుర్తింపు సంఘం తెబొగకాసం కార్మికులను వాగ్దానాలతో మభ్యపెట్టి పబ్బం గడుపుకున్నాయని టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి బి.సంజయ్‌కుమార్ ఆరోపించారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి బుధవారం తొలిసారిగా రామకృష్ణాపూర్‌కు విచ్చేసిన ఆయనకు టీఎన్టీయూసీ, తెదేపా శ్రేణులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన ఆయన చట్టబద్ధతలేని ఉత్తర్వులు జారీ చేసి కార్మికవర్గాన్ని అన్యాయం చేశారన్నారు. కార్మికులు తమ సమస్యలను పరిష్కరించే వారి కోసం ఎదురుచూస్తున్నారని రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీఎన్టీయూసీ సత్తాను చాటేలా యూనియన్ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పలువురు మాట్లాడుతూ...టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సంజయ్‌కుమార్ కార్మికుల హక్కులు, డిమాండ్ల సాధన కోసం పనిచేయాలని, ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పేర్కొన్నారు. అనంతరం సంజయ్‌కుమార్‌ను రామకృష్ణాపూర్, మందమర్రి పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు గోపు రాజం, తుంగ వెంకటేశ్, శేఖర్, రాములు, ప్రతాప్, వాసాల సాగర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న తెదేపా, యూనియన్ శ్రేణులు

## పదో వేతన ఒప్పందం పరిష్కరించాలి

**మందమర్రి:** పదో వేతన ఒప్పందం సత్వరమే పరిష్కరించాలని, కోడ్ ఆఫ్ డిసిప్లెయిన్ మార్చడం, వారసత్వ ఉద్యోగాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) బొగ్గు గనులు, విభాగాలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. బుధవారం మందమర్రి ఏరియాలోని కె.కె-1, 5, ఆర్కే-1ఏ, రామకృష్ణాపూర్ సింగరేణి ఉపరితల బొగ్గు గని, మందమర్రి ఏరియా వర్క్‌షాపు, ఆర్కేపీ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వేర్వేరుగా నిరసనలు కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి సంకె రవిలు కార్మికులనుద్ధేశించి మాట్లాడారు. సింగరేణిలో కోడ్ ఆఫ్ డిసిప్లెయిన్ మార్చి, వారసత్వ ఉద్యోగాలను ప్రకటించిన తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా గనులు, విభాగాల సింగరేణి బాధ్యులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ జనలాఉద్దీన్, వి.అయిలయ్య, ఎ.సంజీవ్, రాయలింగు, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక సంబంధాల మెరుగుకు శ్రద్ధ తీసుకోవాలి

**సీసీసీ(శ్రీరాంపూర్ గ్రామీణం), న్యూస్‌టుడే:** సింగరేణిలో పారిశ్రామిక సంబంధాలను మెరుగు పరిచేందుకు పర్సనల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సింగరేణి జీఎం(వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్) ముజాహిద్ సూచించారు. బుధవారం సీసీసీలోని సింగరేణి అతిథి గృహంలో సింగరేణి పర్సనల్ అధికారుల, సంక్షేమాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సింగరేణి జీఎం మాట్లాడుతూ కార్మికుల సీఎంపీఎఫ్, గ్రాట్యూటీ, పింఛన్లు సకాలంలో అందించే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డీవైజీఎం(పీ) దీక్షితులు, పీఎం రమష్, ఏరియా ఇన్చార్జి డీవైజీఎం(పీ) కిరణ్, పర్సనల్ మేనేజర్లు ఆజ్మీరా తుకారాం, రాజేశ్వరరావు, వివధ గనుల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

**మందమర్రి:** మందమర్రి ఏరియాలోని ఎల్లందు క్లబ్‌లో మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల పర్సనల్ విభాగం అధికారుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం కొత్తగూడెం నుంచి వచ్చిన జీఎం(పర్సనల్, వెల్ఫేర్), సీఎస్సార్, పర్సనల్ అధికారుల సమక్షంలో ఈ సమావేశం జరిగింది. ఇందులో సంక్షేమ కార్యక్రమాలు, స్వచ్ఛ పక్వాడా నిర్వహణపై తీరుతెన్నులపై చర్చించారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా సింగరేణి జీఎం ఎం.రాఘవులు, జీఎం(పర్సనల్, వెల్ఫేర్) మస్ఊద్ ముజాహిద్‌లు మాట్లాడారు. డీజీఎం (పర్సనల్ కార్పొరేట్) బి.ఆర్ దీక్షితులు, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల డీజీఎంలు(పర్సనల్) పి.గోవిందరాజు, జె.కిరణ్, పర్సనల్ మేనేజర్(కార్పొరేట్) ఎస్.రమేష్, డివైపీఎం, పీఎం, సీనియర్ పర్సనల్ అధికారులు పాల్గొన్నారు.


సీసీసీలో మాట్లాడుతున్న సింగరేణి జీఎం ముజాహిద్

### ముగిసిన శిక్షణ శిబిరం

మందమర్రి ఏరియాలోని సింగరేణి సర్వే విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆటో కాడ్ సివిల్ త్రీడీపై శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఎడీసీసీ ఇన్‌ఫ్రోకాడ్ ప్రైవేటు లిమిటేడ్ ప్రతినిధి సుమన్ శిక్షణ తరగతుల శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో మందమర్రి ఏరియాలోని వివిధ గనులకు సంబంధించిన సర్వేయర్లు, సర్వే అధికారులు శిబిరంలో మెలుకువలు నేర్చుకున్నారు. మందమర్రి ఏరియా సింగరేణి జీఎం ఎం.రాఘవులు, ఏస్వోటూజీఎం కె.వెంకటేశ్వర్లు నేతృత్వంలో మందమర్రి ఏరియా సర్వే అధికారి ఎండీ.జైనులాబుద్దీన్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.


# నిలువెత్తు సుగుణం.. గణనాయకుడి రూపం

**దైవస్వరూపాల్లో విశిష్టమైనది. విలక్షణమైనది గణపతి రూపం. లంబోధరుడు మరుగుజ్జు అయినా ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకుని గణాధ్యక్ష పదవిని చేపట్టినవాడు గణపతి. కార్యసాధకులకు అవసరమైన లక్షణాలన్నీ గణేషుడిలో మూర్తీభవించాయి. అటువంటి ప్రత్యేకతలు కలిగిన గణనాథుడి శరీరంలోని ప్రతి అవయవానికి ఒక సందేశం ఉంది. వాటిని మన నిత్య జీవితంలో పాటిస్తే జీవితం బంగారుమయం అవుతుంది. ఆ వివరాలతో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..**

**ఏసీసీ(మంచిర్యాల), తాండూరు, న్యూస్‌టుడే**

గణనాథుడి రూపానికి వస్తే తల నుంచి తొండం వరకు, కళ్ల నుంచి కడుపు వరకు ప్రతి అవయవంలోనూ ఒక అంతరార్థం దాగి ఉంది. ఆధునిక యుగంలో మేనేజ్‌మెంట్ సూత్రాలు, కార్యసాధక లక్షణాలను గణపతి రూపంలో సమన్వయించి శాస్త్రజ్ఞులు, పండితులు విశ్లేషించారు. చిన్నపిల్ల వాడి నుంచి కళ్లు సరిగా కనపడని ముసలివాళ్ల వరకు తేలికగా అనుమానం లేకుండా గుర్తించగల ఆకారం వినాయకుడి సొంతం. ఏ మంచి పని ప్రారంభించాలన్నా ఇష్టదైవం ఎవరైనా విఘ్నేశ్వరుడిని స్మరించడం మంచి సంప్రదాయం.. ఇదీ వినాయకుని ప్రత్యేకత..

## వినాయకుడి ప్రతి అవయవంలోనూ అంతరార్థం ✦ ఆచరిస్తే జీవితం ఆనంద మయం



**పెద్ద తల:** చక్కటి ఆలోచన

**చిన్నకళ్లు:** నిశిత చూపు కలిగిన వాడిగా అర్థం వస్తుంది. ఏ విషయమైనా సూక్ష్మంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి.

**గొడ్డలి:** మానవుని బంధవిముక్తం చేయడం.

**చిట్టి నోరు:** ఆచితూచి మాట్లాడటం

**అభయహస్తం:** ఆధ్యాత్మిక చింతనలో భక్తులకు మోక్ష మార్గం ప్రసాదించడం.

**భారీ బొజ్జ:** జీవితంలోని మంచి చెడులన్నింటినీ ఇముడ్చుకోగల శక్తి కలిగిఉండటం

**చేటల్లాంటి చెవులు:** ఎదుటివారు చెప్పింది ఎక్కువ విని మంచిని స్వీకరించడం

**దండం:** శరణాగతులను అక్కున చేర్చుకోవాలి

**ఏకదంతం:** చెడును పోగొట్టుకొని మంచిని మాత్రమే నిలుపుకోవడం

**తొండం:** అత్యుత్తమ సామర్థ్యం, దేనినైనా స్వీకరించడం

**చేతిలో లడ్డు:** భక్తులకు పురస్కారాలు

**ఎలుక:** కోరికలను చిహ్నం. ఇవి ఎంత చిన్నగా ఉంటే జీవితం అంత సుఖమయం. వాటిని ఎప్పుడూ అదుపులో ఉంచుకోవాలి.

**ప్రసాదం:** కోరిన వరాలు

### పెద్దగా ఆలోచించు.. చిన్నగా ప్రారంభించు

✦ వినాయకుడి శరీర పరిమాణాన్ని గమనిస్తే ఆయన తల పెద్దదిగా ఉంటుంది. పాదాలు చిన్నవిగా ఉంటాయి. పెద్దగా ఆలోచించు.. చిన్నగా ప్రారంభించు అనే ముఖ్యమైన సూత్రానికి ప్రతీక. ఏ పనైనా ప్రారంభించే వేళ దానికి సంబంధించిన పూర్వపరాలు లాభనష్టాలు, అవకాశాలు, ప్రమాదాలు అన్ని కూలంకషంగా ఆలోచించాలి. ఆచరణలో చేయాల్సిన పనులను ఒకదాని తర్వాత మరొకటి అమలుచేయాలి. అన్ని ఒకేసారి చేయాలనే తొందర ఉండకూడదని నేర్చుకోవాల్సిన పాఠం.

### కార్యసాధకుడి అప్రమత్తత

✦ చిన్న కళ్లు సూక్ష్మ పరిశీలనకు, పెద్ద చెవులు శ్రద్ధగా వినడానికి, పొడవైన తొండంలో ఉన్న నాశిక.. దూరం నుంచే మంచి చెడులు, ప్రమాదాలు, అవకాశాలను పసిగట్టే నేర్పునకు సంకేతాలు. వీటి ఆధారంగా కార్యసాధకుడు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఏ చిన్న విషయాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. అన్ని స్వయంగా చూసి తెలుసుకోవడం సాధ్యంకాదు. సమర్థుడైన కార్యనిర్వాహకుడు.. కింది వారి మాటలను.. పైవారి ఆదేశాలను.. శ్రేయోభిలాషుల సూచనలను శ్రద్ధగా ఆలకించాలి. వాటిని తన అనుభవంతో కలగలిపి సమీప భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను అంచనా వేయగలగాలి. దీనంతటికి కావాల్సింది నిరంతర అప్రమత్తతే. శత్రువైన సింహాన్ని స్వప్నంలోకి కూడా రానివ్వకుండా ఏనుగు ఒక కంటితో నిద్ర పోతుందని ప్రతీతి. కార్యసాధకుడి అప్రమత్తత ఆ స్థాయిలో ఉండాలి.

*వక్రతొండ మహాకాయ*
*కోటిసూర్య సమప్రభా..*
*నిర్విఘ్నం కురుమేదేవా*
*సర్వకార్యేషు సర్వదా!..*

**ముల్లోకాల్లో ముందుగా పూజలు అందుకునే దేవదేవుడు గణేషుడు. ఏ శుభకార్యం చేసినా, వ్రతం చేసినా దేవతా మూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠించినా, భజనలు ఇలా ఏ కార్యక్రమానికైనా వినాయకుడి ప్రార్థన చేసిన తర్వాతే ప్రారంభించడం ఆనవాయితీ. అటువంటి వినాయకుడు ఒక రకమైన రూపం గజ ముఖంతో ఏకదంతంతో ఉండి మిగతా దేవాతామూర్తులకు విభిన్నంగా ఉంటారు.**

### మాటలతో తక్కువ.. చేతలతో ఎక్కువ

వినాయకుడి నోరు పెద్దశబ్దం చేయగల శక్తిగలది. అయినప్పటికీ తొండం వెనుక దాగి ఉంటుంది. మన అభిప్రాయాలు మాటల ద్వారా తక్కువగాను, చేతల ద్వారా ఎక్కువగాను వ్యక్తం కావాలనే సూత్రానికి ఇది ప్రతీక. కార్యరంగంలో నిర్వాహకుడిగా అయినా, ఉద్యోగిగా అయిన మాటల స్థానం చేతల తర్వాతే అని గుర్తించాలి. మనమీద ఇతరులు ఏర్పరుచుకునే అభిప్రాయం మన చేతలను బట్టే ఉంటుంది. పెద్ద పొట్ట నాలుగు చేతులతో కూడిన భారీ ఆకారం పని సామర్థ్యానికి గుర్తు. రెట్టింపు పని చేసేందుకు సిద్ధపడాలి.

వినాయకుని రూపంలోని సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి. ఆలోచించి అడుగు వేయాలి. చేసే పనిపై శ్రద్ధ పెట్టాలి. అప్పుడే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

### ఆయన ఆకారం సద్గుణాలు నేర్పుతోంది

**అప్పాల శ్యాంప్రణీత్‌శర్మ, వేదపండితుడు, అచ్చలాపూర్**



ఆదిదేవుడిగా పూజలందుకునే వినాయకుడి ఆకారం మనకు ఎన్నో సద్గుణాలను నేర్పిస్తోంది. ఆయన శరీరంలోని ఒక్కో అవయవం ఒక్కో మంచిని సూచిస్తుంది. ఆయన రూపం గొప్ప విషయాలను తెలియజేస్తుంది. ఏ పరిస్థితుల్లోనైనా, ఎవరికైనా తమ ప్రవర్తన, నడవడిక, ఆలోచన శక్తి మంచి చెడులను వివరిస్తూ విఘ్నేశ్వరుడు తన అవయవాల ద్వారా సన్మార్గాన్ని బోధిస్తాడు. ఒక్కో అవయవంలో ఒక్కో నీతి కనిపిస్తుంది.

### మట్టి గణపతినే పూజించాలి

**– కొమ్మెర దత్తమూర్తిశర్మ, పంచాంగకర్త, చెన్నూరు**



**చెన్నూరు:** స్కంధ పురాణం ప్రకారం ధర్మరాజు రాజ్య భ్రష్టుడై అరణ్యంలో సంచరిస్తున్న సమయంలో సూత పౌరాణికుడితో ఏ వ్రతం చేస్తే రాజ్యం పొందుతానని అడిగారు. అప్పుడు ఆయన వినాయక వ్రతం ఆచరణతో తిరిగి రాజ్యం పొందుతావని.. వినాయకుని ప్రతిమను.. **'ప్రశస్త్యం గణనాథస్య స్వర్ణం రౌత్యం మథా కృతం అథవా మృణ్మయం కురియాత్'** అని చెప్పారు. అంటే..బంగారం, వెండి లేక మట్టితో చేసిన వినాయక ప్రతిమతోనే వ్రతం ఆచరించాలి. మృణ్మయం ఉద్దేశం మనం తయారు చేసిన ప్రతిమ నిమజ్జనానంతరం వెంటనే పృథ్వితత్వంలో కలవాలి. జడ పదార్థాలతో చేసిన ప్రతిమ పర్యావరణ దూషితం అని అర్థం.

# సంస్కరణల పేరుతో దోపిడీ

## అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.రంగన్న

**భైంసా, న్యూస్‌టుడే:** పాలక ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నాయని అఖిలభారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)రాష్ట్ర కార్యదర్శి కె.రంగన్న విమర్శించారు. భైంసా పట్టణంలోని ఎన్ఆర్ గార్డెన్స్‌లో ఆ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంలో సంస్కరణలంటూ రైతులను మోసం చేసున్నాయన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో, నానాటికి పెరుగుతున్న పెట్టుబడి వ్యయంతో రైతులు సతమతమైతున్నారని, వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కష్టకాలంలో పాలకులు అమలుచేసే వ్యవసాయ విధానాలు బడా దోపిడీదారులకు వ్యవసాయాన్ని అప్పజెప్పేందుకు యత్నిస్తున్నారాని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలనకు వ్యవసాయంలోకి అనుమతించడం అందులో భాగమే అన్నారు. బ్యాంకుల్లో రుణాలు లభించక రైతులు ప్రైవేటు వడ్డీవ్యాపారుల వద్దకు వెళ్లి అప్పులపాలవుతున్నారన్నారు. అయినా ప్రభుత్వాలు మేల్కోవడం లేదన్నారు. దీంతోనే రైతులు నానాటికి వ్యవసాయ రంగం నుంచి దూరమవుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయరంగ నిపుణుడు స్వామినాథన్ కమిషన్ సూచనలను పాలకులు పట్టించుకోకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. సంవత్సరాల తరబడి సాగు నీటి రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విలువైన జలవనరులను సముద్రంపాలుచేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ సంఘం రైతుల వైపు నిలబడి వారికి వెన్నుదన్నుగా నిలిచి పోరాటాలు చేస్తుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నంది రామయ్య, ఉపాధ్యక్షుడు జె. రాజు, సీపీఐ న్యూడెమోక్రసీ రాష్ట్రనాయకుడు టి. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కె.రాజన్న, నాయకులు ఎం.శంకర్, తిరుపతిరావు, భీంరావు, లక్ష్మణ్, డి. ప్రభాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కె.రంగన్న

# 26న కబడ్డీ ఎంపిక పోటీలు

**ఏసీసీ, న్యూస్‌టుడే:** ఈనెల 26న కబడ్డీ అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా విద్యాధికారి రవికాంత్ రావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రేని రాజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ విశ్వశాంతి పాఠశాలలో జరిగే ఈ పోటీల్లో ప్రతి పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. క్రీడాకారులు 2001 తర్వాత జన్మించి, బాలురు 57 కిలోలు, బాలికలు 53 కిలోల లోపు బరువు ఉండాలని వివరించారు. ఆసక్తి గలవారు తమ గుర్తింపు పత్రాలతో ఉదయం 9 గంటలకు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడికి రిపోర్ట్ చేయాలన్నారు. పూర్తి వివరాలకు చరవాణి(9912029691, 9440141328)లను సంప్రదించాలని కోరారు.

Junior Inter
**STUDY PLAN**
**CHEMISTRY**

ప్రతిభ

*A top ranker says that clear cut strategy, clarity of concepts, memorising the formulae and focussed preparation are essential for grand success. Systematic planning helps to get good score in competitive exams. By doing so one can reach the goal easily.*

# The 'brain of chemistry' is..



**Writer:**
**A.N.S. Sankara Rao**
**Subject Expert**

Read Chemistry regularly early in the morning in order to retain chemistry for ever. Identify most repeated VSAQs (2 Marks), SAQs (4 Marks), LAQs (8 Marks) from previous I.P.E. papers. It is comfortable to answer in LAQs, SAQs and VSAQs order for 100% score in B.I.E. Most of the times some of the VSAQs are not repeated from few lessons, so one must learn all VSAQs given at chapter end, intext, inbox and solved questions.

### For Very Short Answer Questions

**(SAQs - 2 Marks)**

Put more efforts on States of matter, Stoichiometry, Thermodynamics, Chemical equilibrium & Acids-bases, Alkali & Alkaline earth metals, Group 13 & 14 elements, Environmental Chemistry and Organic Chemistry.

### For Short Answer Questions

**(SAQs - 4 Marks)**

Learn questions from States of matter, Stoichiometry, Thermodynamics, Chemical equilibrium and Acids - Bases, $H_2$ & Its compounds, 13th & 14th groups, Chemical bonding and Organic Chemistry.

### For Long Answer Questions

**(LAQs - 8 Marks)**

3 LAQs are coming only from Atomic Structure, Classification of elements, Chemical bonding and Organic Chemistry.

### Atomic Structure

**(8 Marks)**

★ **For I.P.E.:** LAQs 1) 4 Quantum numbers 2) Postulates, limitations of Bohr's model of H atom, line spectrum of H atom.

★ **For competitive exams:** Rydberg's equation, work function, K.E., P.E., T.E., de Broglie, Heisenberg's uncertainty principle related problems and concepts. Quantum numbers, shapes of orbitals, quantum mechanical model, radial nodes and angular nodes.

### Classification of Elements And Periodicity in Properties

**(8 Marks)**

★ **For I.P.E:** LAQs 1) $I.E._1$ & $I.E_2$, Comparison, Factors effecting 2) s, p, d, f block elements 3) Periodic property def. & their variation in group & period- I.E, E.N., E.G.E., atomic radius, nature of oxides.

★ **For competitive exams:** Criss - Cross rule, position of elements, valency, types of radii, iso electronic and all the periodic properties (exceptions trends in groups, periods and both).

### Chemical Bonding And Molecular Structure

**(4 + 4 or 8 Marks)**

We can consider this lesson as back bone of entire chemistry. Clarity of each & every concept is very important for all types of exams.

★ **For I.P.E:** LAQs 1) Hybridisation (def. & sp, $sp^2$, $sp^3$ types) 2) MOED of $O_2$ & $N_2$– their bond order & magnetic nature.

**SAQs:** 1) Hybridisation of $PCl_5$ & $SF_6$
2) Hydrogen bond, types
3) Dipole moment def., applications
4) Dative bond def., examples



5) Postulates of VSEPR theory.

★ **For competitive exams:** Complete MOT, VSEPR Theory, formal charge, hybridisation, Hydrogen bond, Fajan's rules, dipole moment, no. of lone pairs - bond pairs and bond parameters.

### States of Matter : Gases and Liquids

**(2 + 4 Marks)**

★ **For I.P.E.:** SAQs: 1) Postulates of Kinetic molecular theory of gases 2) Deduction of gas laws: Avogadro, Boyle, Charle's, Dalton, K.E, Graham's law 3) Derivation of ideal gas equation 4) Graham's law (def. & problem) 5) Dalton's law (def. & problem) 6) 3 types of speeds (def. & problem) and solved problems 4.4 to 4.6.

★ **VSAQs:** 4, 10, 15, 18, 19, 22, 32 to 35, 42, 43, 45 and 4.7 to 4.10

★ **For competitive exams:** Vander Waal's equation, K.E., problems on 3 types of speeds, Graham's Law, Dalton's law and concepts of viscosity, Surface tension.

### Stoichiometry

**(2 + 4 Marks)**

Stoichiometry is heart of chemistry. Art of learning physical chemistry lessons and some of the Inorganic chemistry lessons are well linked with this lesson.

★ **For I.P.E:** SAQs: 1) Balancing of redox reactions in acid medium & basic medium 2) E.F. & M.F. related problems.

★ **VSAQs:** 1, 3, 5 to 8, problems on w-w, w-v, v-v and equivalent weights solved problems: 5.1, 5.2, 5.4, 5.6 to 5.9, 5.14 law of definite proportions, law of multiple proportions.

★ **For competitive exams:** Significant figures, accuracy, precise, oxidation numbers, M, N, m, x, Eq. Wts, E.F., M.F., oxidising and reducing agents, mole concept, stoichiometric calculations.

### Thermodynamics

**(4 or 2 + 2 marks)**

★ **For I.P.E.:** SAQs: 1) Hess's law 2) $C_P - C_V = R$ 3) Problems on types of Enthalpies.

★ **VSAQs:** 2, 14, 22, 25, 29, 32, 37 and intext questions 6.3, 6.4, 6.11, 6.12

★ **For competitive exams:** State function, path function, 1st, 2nd, 3rd laws of thermodynamics, entropy, enthalpy of formation, combustion, H, E, G related problems, criteria of spontaneity ($\Delta G$, $\Delta H$, $\Delta S$ linked), extensive and intensive properties.

### Chemical Equilibrium & Acids - Bases

**(2 + 4 Marks)**

★ **For I.P.E:** SAQs: 1) Lechatlier's principle (def. & synthesis of $SO_3$ & $NH_3$) 2) $K_C$, $K_P$ relation for $SO_3$, $NH_3$ equilibria 3) Lewis theory 4) Buffer solutions (def, types, examples, buffer action, problems) 5) Salt Hydrolysis def. & nature of 3 types of salt solutions 6) Solubility - Solubility product - common ion effect and intext questions 7.14, 7.15, 7.17, 7.25 to 7.28.

★ **VSAQs:** 1, 4, 5, 7, 11, 12, 13, 24, 26, 30, 31, 69. Intext Questions: 7.2, 7.5, 7.7, 7.11, 7.14, 7.15, 7.17, 7.25 to 7.28.

★ **For competitive exams:** $Q_C$ & $K_C$, $K_C$ & $K_P$ relation, problems on pH, $K_w$, $K_a$, $K_b$, $K_c$, Ksp, buffer solutions and salt hydrolysis of different salts.

### Hydrogen & Its Compounds

**(4 Marks)**

★ **For IPE:** SAQs: 1) Utility of $H_2$ as fuel 2) Temporary & Permanent hardness of water calgon (or ion exchange method). 3) All types of hydrides 4) Oxidising and reducing properties of $H_2O_2$. 5) Preparation of $H_2O_2$ by auto oxidation method & electrolytic method.

★ **VSAQs:** There is a possibility of asking two 2 marks questions like What is syn gas/ Coal gasification/ Auto protolysis/ Uses of $D_2O$/ M.P., B.P. of $D_2O$/ 3 isotopes of H/ Use of $H_2$ in welding of high melting metals/ Water is amphoteric in Bronsted sense/ Why B.P. of $H_2O$ is greater than $H_2S$?

★ Chapter end questions: 1, 2, 4, 5, 9, 10, 11, 15, 16, 19, 33.

★ **For competitive Exams:** Types of hydrides, problems on $H_2O_2$ & Hardness of water. Comparison of physical properties of $H_2$ & $D_2$, $H_2O$ & $D_2O$, Calgon & ion exchange methods.

### Alkali & Alkaline Earth Metals

**(2 + 2 Marks)**

★ **For IPE:** VSAQs: Biological importance of $Ca^{+2}$, $Mg^{+2}$, $Na^+$, $K^+$, Lesson end questions: 3, 4, 5, 6, 11, 12, 14 to 28, 33, 34, 36, 37, 42, 43. Why is $KO_2$ is paramagnetic? What is the Oxi. state of K in $KO_2$?

★ **For competitive exams:** Order of hydrated ions size, order of density, SRPs, reducing strength, solubility, lattice enthalpies of IA metals, Na-K pump, IA, IIA metal solutions in $NH_3$ (liq.), Uses of Cu-Be, Mg-Al alloys, Mg $CO_3$. It is advisable to make notes of key points & trends of periodic properties (especially anamalous properties) of 1st to 18th groups.

### Group -13 Elements

**(2 + 2 or 4 Marks)**

★ **For I.P.E.:** SAQs: 1) Borax bead test 2) Structure of Diborane 3) Preparation & Chemical Properties of $B_2H_6$.

★ **VSAQs:** 1) Formula of borazine & Its common name. 2) Inert pair effect def. Stability of $Tl^{+1}$ Salts. 3) Hybridisation of B in Borazine & Diaborane.
4. Structure of Borazole & Orthoboric acid.

★ **For competitive exams:** Physical properties, Inert pair effect, structural aspects of diborane, borax, boric acid, chemical properties of diborane, borax bead test, in text, inbox questions.

### Group - 14 Elements

**(2 + 2 or 4 Marks)**

★ **For I.P.E:** SAQs: 1) Difference in properties of diamond and graphite 2) Write a short note on allotropy, catenation, inert pair effect, green house effect.

★ **VSAQs:** 1 to 31, 34d, 41, 42, 43c, 44, 45a, b, 48, 50 a, b, c, uses of Zeolites, silicones, what are fullerenes? $CCl_4$ doesn't dissolve in water but $SiCl_4$ dissolves. Why?

★ **For competitive exams:** Inert pair effect, uses & structures of Silicates, Silicones, Zeolites, pH of $H_2CO_3/H_2CO_3^-$ system, structure of fullerene, Types of Oxides, hydrolysis of compounds.

### Environmental Chemistry

**(2 + 2 Marks)**

★ **For I.P.E.:** VSAQs: Sink, receptor, BOD, COD, pollutant, contaminant, TLV, Eutrophication, BOD values of clean and polluted water, DO (def. values of cold water & air), green house effect, acid rains (def., gases, causes, ill effects), chapter end questions 23, 29, 1, 2, 6, 15, 17.

★ For competitive exams: All key points.

### Organic Chemistry

**(2 + 4 + 4 or 2 + 8 = 10 Marks)**

Organic chemistry is the 'brain of chemistry' as it is well connected to fundamentals of other lessons like chemical bonding. Highest weightage is given to this lesson. Once the logic of this lesson is known, one can score good marks in all types of exams. It is very essential to learn all the basics, concepts & their applications to score good marks in EAMCET, NEET, BITSAT, JEE Mains & Advanced like exams.

★ **For I.P.E.:** LAQs: 2 preparations & all chemical properties of $C_2H_2$, $C_2H_4$, $C_6H_6$

★ **SAQs:** 11 to 17, 32, 37, 39, 42, 43, 49, 57 and 59.

★ **VSAQs:** Isomers of $C_3H_6O$, What is polymerization? IUPAC Nomenclature (names & structures), chapter end questions: 1 to 8, 27 and solved problems 13.1 to 13.12, 13.19, 13.20 to 13.25, 13.30, 13.34, 13.36, 13.38.

★ **For competitive exams:** Identification of prefix, root word, primary & secondary suffix in organic compounds make IUPAC nomenclature easier. All named reactions, qualitative & quantitative analysis calculations, reactions, types of isomerism, conformers of ethane, electron displacement reactions, directional influence of functional groups in monosubstituted benzene, reaction mechanisms, conversions, bond parameters several revisions are required to retain Organic chemistry in mind.

జనరల్ స్టడీస్

ఎకానమీ

ప్రతిభ

భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో అతిపెద్ద పరోక్ష పన్ను సంస్కరణగా ఆవిర్భవించిన వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) 2017 జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. దేశ మార్కెట్లను ఏకీకృతం చేసేలా ఒకే పన్ను విధానం రావడం వల్ల వస్తువులు ఎక్కడైనా ఒకే ధరకు లభించడమే కాకుండా, దాదాపు 17 పరోక్ష పన్నులు ఇప్పుడు ఒకే పన్నుగా అవతరించాయి. 'గుడ్ అండ్ సింపుల్ టాక్స్'గా ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని అభివర్ణించారు.

# జీఎస్టీని మొదట అమల్లోకి తెచ్చిన దేశం?



రచయిత
- దాడి నారాయణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్

## జీఎస్టీ పరిణామక్రమం

జీఎస్టీ ఆలోచన 1986-87 లోనే మన దేశంలో మొగ్గ తొడిగింది. గత పదిహేడేళ్లలో సుదీర్ఘ కసరత్తు జరిగి 2017 లో అమల్లోకి వచ్చింది. 2000 లో నాటి ఎన్డీయే సర్కారు హయంలో ఏర్పాటుచేసిన ఆర్థిక సలహా కమిటీ సూచనల మేరకు అసిమ్‌దాస్ గుప్తా నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత పన్ను సంస్కరణలను వేగవంతం చేసే లక్ష్యంతో 2003 లో విజయ్ కేల్కర్ నేతృత్వంలోని కమిటీ 12 వ ఆర్థిక సంఘం సూచించినట్లుగానే జీఎస్టీని తీసుకురావాలని 2005 లో సిఫారసు చేసింది. జీఎస్టీని 2010 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తామని నాటి యూపీఏ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. ఆ తర్వాత 2011 లో యూపీఏ ప్రభుత్వం లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టింది. జీఎస్టీ కమిటీ ఛైర్మన్ పదవి నుంచి అసిమ్‌దాస్ గుప్తా తప్పుకోవడంతో కె.ఎం.మణికి ఆ బాధ్యతలు అప్పగించారు. ఇలా చాలారోజులు ఈ బిల్లు రాజకీయాల మధ్య నలిగిపోయింది. చివరికి 2015 లో లోక్‌సభలో, 2016 లో రాజ్యసభలో ఆమోదం పొంది 2017 జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 160 కి పైగా దేశాల్లో అమల్లో వున్న జీఎస్టీని 1954 లో ఫ్రాన్స్ తొలిసారిగా అమల్లోకి తీసుకొచ్చింది. మన దేశంలో జీఎస్టీ మండలి 18 సార్లు సమావేశమైంది.

### జీఎస్టీ అంటే...

పన్నెండేళ్ల కిందట అమల్లోకి వచ్చిన వ్యాట్ (VAT) లో ఎన్నో లోపాలు, లొసుగులు ఉండటం, వివిధ రాష్ట్రాల్లో, వివిధ రకాల పన్నులు, పన్ను రేట్లు ఉండటంతో ఒక సమగ్ర పన్ను విధానాన్ని రూపొందించాల్సి వచ్చింది. సేల్స్‌టాక్స్, సర్వీస్‌టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, ఎంట్రీ టాక్స్, పర్చేజ్ టాక్స్ అనే రకరకాల పన్నుల స్థానంలో 'ఒకే పన్ను'గా అమల్లోకి వచ్చిందే జీఎస్టీ. దీనివల్ల దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలవుతుంది. దేశంలో ఇప్పుడు ప్రతి వస్తువుకీ ఎక్కడైనా ఒకే శ్లాబులో పన్ను పడుతుంది. అయితే వివిధ రకాల వస్తువులు, సేవల వర్గీకరణను బట్టి వాటిపై విధించే పన్నుల శ్లాబులు దేశమంతా 0, 5, 12, 18, 28 శాతాలుగా విధిస్తారు. జీఎస్టీ పూర్తి స్వరూపాన్ని తెలుసుకుంటే అది మంచో చెడో, లాభమో, నష్టమో మనం అర్థం చేసుకోవచ్చు.

### జీఎస్టీ ప్రభావం... అంచనా

సాధారణ పౌరుడి మీద ఈ కొత్త పన్ను ప్రభావం ఎలా ఉండబోతోంది? అసలు సామాన్యుడికి అంతిమంగా ఒరిగేదేంటన్న ప్రశ్న చిక్కుముడిలాగే మిగిలిపోయినా వినియోగదారుడే రాజు అనే జీఎస్టీ మౌలిక స్ఫూర్తి సాకారం కావడానికి, దాని ప్రతిఫలాలు పొందడానికి కొంతకాలం వేచిచూడక తప్పదు. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జీఎస్టీ మండలి మున్ముందు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సామాన్యులు రోజువారీ ఉపయోగించే వస్తువుల్లో 81% సున్నా నుంచి 18% లోపు పన్ను పరిధిలోకి వచ్చాయి. తద్వారా సంస్థలు పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు అందిస్తున్నాయో లేదో చూడటానికి 'యాంటీ ప్రాఫిటీరింగ్' కమిటీ పనిచేస్తుంది. ఈ కమిటీకి ధరలు తగ్గించని సంస్థల లైసెన్స్‌ను రద్దు చేసే హక్కు ఉంటుంది.

అలాగే సంస్థలకు 'ఇన్‌పుట్ క్రెడిట్' వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. వ్యాట్‌లో వివిధ దశల్లో విధించే పన్ను స్థానంలో జీఎస్టీ రావడం వల్ల ఒకే పన్ను విధానం అమలవుతోంది. దీంతో లభించే ఇన్‌పుట్ క్రెడిట్ పన్ను చెల్లింపులను ప్రోత్సహిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యాపారి దగ్గర 1000 రూపాయలకి ఒక వస్తువును కొని, దాన్ని 1500 కి తిరిగి అమ్మితే, రెండో వ్యాపారి పై 500 రూపాయలకు పన్నుకడితే సరిపోతుంది. మొదటి 1000 రూపాయలకు మొదటి వ్యాపారే పన్నుకట్టాడు కాబట్టి, రెండో వ్యాపారికి ఇన్‌పుట్ క్రెడిట్ లభ్యమవుతుంది. ఇది సంస్థలకు పన్ను భారాన్ని తగ్గిస్తుంది.

అలాగే ఒక వస్తువు ఏ ప్రాంతంలో తయారైనా, అది చివరిగా ఏ ప్రాంతంలో వినియోగమవుతుందో, ఆ ప్రాంత రాష్ట్రానికే దాని తాలూకు పన్ను దక్కుతుంది. తత్ఫలితంగా ఎక్కువ కొనుగోలు శక్తి ఉన్న రాష్ట్రాలకు పన్నుల ఆదాయం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అలాగే గతంలో వేర్వేరు రాష్ట్రాల మధ్య సరకు రవాణా పన్నులు ఎక్కువగా ఉండటంతో చిన్న రాష్ట్రాలు వెనకడుగు వేసేవి. ఇప్పుడు వెనకబడిన రాష్ట్రాలు తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా రవాణా చేయగలుగుతాయి. దేశంలో ఎగువ మధ్యతరగతి ప్రజలు, సంపన్నులపైనా, చిన్న వ్యాపారులపైనా, ప్రముఖ బహుళజాతి సంస్థలపైనా జీఎస్టీ భారంగానే ఉందనవచ్చు. ఎంట్రీటాక్స్ రద్దుతో చెక్‌పోస్టుల్లో అవినీతికి అడ్డుకట్ట పడుతుందని చెప్పవచ్చు. ప్రతి వ్యాపారి, సంస్థ పన్ను రిటర్నుల నిర్వహణంతా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేయాలనే నిబంధన ఉండటంతో దీనిలో నమోదు చేసుకున్న ఏ వ్యాపారీ పన్నుల నుంచి తప్పించుకోలేడు. కాబట్టి వ్యవస్థలో నల్లధనం ఎంతో కొంత తగ్గే అవకాశం ఉంది. అలాగే పన్ను చెల్లింపుదార్లకు జీఎస్టీ బిల్లు రాయితీలు, ప్రయోజనాలు కల్పిస్తుండటంతో సంస్థలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు సన్నద్ధత వ్యక్తం చేస్తాయి. జీఎస్టీ పరిధిలోకి వచ్చే ప్రతి వ్యాపారికీ జీఎస్టీ కంప్లయిన్స్ రేటింగ్ లభిస్తుంది. సంస్థలు ఈ రేటింగ్ పెంచుకునే క్రమంలో సమర్థంగా పనిచేస్తాయి. మన జీడీపీలో పన్నుల వాటా పెరుగుతుంది. ఇతర దేశాలతో పోలిస్తే ప్రస్తుత మన జీఎస్టీ రేట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ రాబోయే కాలంలో పన్నుల ఆదాయం, పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం వల్ల పన్నురేట్లు తగ్గే అవకాశం ఉంది. ఈ చారిత్రాత్మక పన్ను వల్ల సామాన్యులు కొన్ని లాభాలను అందుకోవడమే కాదు, కొన్ని త్యాగాలకు సిద్ధపడకా తప్పదు. కొన్ని వస్తువులపై పన్ను భారం తగ్గినట్లు కనిపించినా సేవా పన్నుల రూపంలో తిరిగి రాబట్టుకోవడం జీఎస్టీ ప్రత్యేకత.

### జీఎస్టీ స్వరూపం - అమలు

వస్తువు తయారీ నుంచి వినియోగదారుడికి చేరేవరకూ వివిధ దశల్లో అదనపు విలువపై పన్నుభారం పడటం జీఎస్టీ ప్రత్యేకత. సరఫరాదారుడు లేదా వినియోగదారుడు ఉన్న ప్రదేశంలో పన్ను వసూలుచేసే 'గమ్యం ఆధారిత' పన్ను దీనిలో భాగం. జీఎస్టీ మండలి సిఫారసు మేరకు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు జీఎస్టీ రేట్లను ప్రకటిస్తాయి. అంటే ఒక వస్తువు లేదా సేవపై పన్ను తగ్గించాలన్నా పెంచాలన్నా అది జీఎస్టీ కౌన్సిల్‌కే సాధ్యం. ఈ మండలిలో కేంద్ర ఆర్థికమంత్రి ఛైర్మన్‌గా, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉంటారు. 0, 5, 12, 18, 28 శాతం పన్నురేట్లతో పాటు, బంగారం, బంగారు ఆభరణాలపై 3% ప్రత్యేక జీఎస్టీని ప్రతిపాదించారు. కొన్ని వస్తువులపై ప్రత్యేక సెస్సులు విధించి ఇలా వసూలైన ఆదాయాన్ని జీఎస్టీ అమలుతో ఆదాయాన్ని కోల్పోతున్న రాష్ట్రాలకు నష్టాన్ని భర్తీ చేయటానికి కేటాయిస్తారు. ద్వంద్వ జీఎస్టీ విధానాన్ని, సమీకృత జీఎస్టీ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సదుపాయంతో పన్నుపై పన్ను లేకపోవడం వల్ల పన్నుల పరిధి విస్తృతమై, ధరలు తగ్గి, పన్ను ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. జీఎస్టీతో రాష్ట్రాల పన్ను రాబడి తగ్గితే, దాన్ని వచ్చే అయిదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం భర్తీ చేస్తుంది. జీఎస్టీ అమలుకు 'జీఎస్టీ నెట్‌వర్క్' (GSTN) పేరుతో లాభాపేక్షలేని ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి - వ్యాపారులకు మధ్య, కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జీఎస్టీ అమలు విషయంలో ఏదైనా వివాదం తలెత్తితే దాని పరిష్కారానికి జీఎస్టీ కౌన్సిల్ ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది.

రూ.20 లక్షల కంటే అధిక వార్షిక వ్యాపారాదాయం ఉన్నవారంతా జీఎస్టీ పరిధిలోకి వస్తారు. దిగుమతులను అంతర్రాష్ట్ర లావాదేవీగా పరిగణించి IGST విధిస్తారు. ఎగుమతుల మీద జీఎస్టీ ఉండదు. సెక్యూరిటీ లావాదేవీలకు, SEZ యూనిట్లకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే మద్యం, పెట్రోలియం ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న పన్నులనే విధిస్తారు. వీటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురాలేదు. వీటిని ఎప్పుడు తీసుకురావాలనే అంశంపై జీఎస్టీ కౌన్సిల్ భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటుంది.

**రద్దయ్యే కేంద్ర పన్నులు..**
*కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ (CVD) ప్రత్యేక అదనపు కస్టమ్స్ డ్యూటీ, సేవాపన్ను.*

**రద్దయ్యే రాష్ట్ర పన్నులు..**
*రాష్ట్ర వ్యాట్ (VAT), కేంద్ర అమ్మకం పన్ను, విలాస సుంకం, ప్రవేశ పన్ను, వినోద పన్ను (స్థానిక సంస్థలు విధించేవి మినహా) ప్రకటనలపై పన్ను, కొనుగోలు పన్ను, లాటరీలు, పందెం, జూదంపై పన్ను.*

### జీఎస్టీపై అపోహలు - వివిధ రంగాలపై ప్రభావం

దేశంలో అన్ని రంగాల పురోగమనమే ధ్యేయంగా దూసుకొచ్చిన జీఎస్టీ సమాఖ్య స్ఫూర్తికి చక్కటి ఉదాహరణ. వివిధ రాష్ట్రాల మధ్య ఆరోగ్యకర పోటీకి ఆస్కారమిస్తుంది. అయితే ఏదైనా కొత్త సంస్కరణ అమల్లోకి వచ్చినప్పుడు కొన్ని రంగాలపై సానుకూల, మరికొన్నింటిపై ప్రతికూల ప్రభావం చూపించవచ్చు. మరికొన్నింటిపై ఏ విధమైన ప్రభావం ఉండకపోవచ్చు. అయితే జీఎస్టీ అమల్లో ప్రభుత్వ కృషితో పాటు పన్ను చెల్లింపుదార్లు, వ్యాపారుల సహకారం ముఖ్యం. దాదాపు 130 కోట్ల మంది జనాభా, 2.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశాన్ని ఏకీకృతంగా రూపుదిద్దడం సామాన్యమైన విషయం కాదు. స్వాతంత్ర్యానంతరం అమల్లోకి వచ్చిన అతిపెద్ద పరోక్ష పన్నుల సంస్కరణగా దీన్ని ప్రశంసిస్తున్నారు. అయితే జీఎస్టీ వల్ల ధరలు పెరుగుతాయనేది అపోహ మాత్రమే. నిత్యావసరాలు, ఆహార పదార్థాలపై పూర్తిగా పన్ను తొలగించారు. రాష్ట్రాలకు ఆదాయం తగ్గినా 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రామాణికంగా వచ్చిన రాబడికి 14% అదనంగా ఇస్తారు. ఏటా ఇలా లెక్కించి లోటును భర్తీచేస్తారు. వ్యాపారులకు ఆన్‌లైన్‌లో నమోదు వల్ల పన్ను విధానం మరింత సరళీకృతమవుతుంది. రాష్ట్రాలకు పన్నుల ద్వారా వచ్చే రాబడిలో జీఎస్టీ పరిధిలోకి వచ్చేది 38 శాతం వరకు మాత్రమే ఉంటుంది. కొత్త వ్యవస్థలోకి మారడానికి కంపెనీలు ఏకకాల భారీ వ్యయాలను మోయాల్సి ఉన్నా దీర్ఘకాలంలో లాభాలే పొందుతాయి. రవాణా కంపెనీలకు అత్యధిక ప్రయోజనం ఉంటుంది. రాష్ట్రాలకు సేవా పన్నుల నుంచి అదనపు రాబడి వస్తుంది.

జీఎస్టీ వల్ల ఎఫ్ఎంసీజీ (FMCG) దీర్ఘకాలంలో ప్రయోజనం కలిగి సరఫరా మెరుగుపడి, 81 శాతం ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. అయితే బ్యాంకింగ్, బీమా, టెలికాం సేవలు మరింత ప్రియం కానున్నాయి. ఆభరణాల ధరలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. వాహన రంగంలో విలాసవంతమైన కార్లపై పన్నుభారం తగ్గే అవకాశం ఉంది. అయితే జీఎస్టీ మండలి దీనిపై సమీక్ష జరిపితే, భవిష్యత్తులో వాహన రంగ ధరల్లో స్వల్పహెచ్చు తగ్గులు సంభవించవచ్చు. ఎలక్ట్రానిక్స్ రంగంపై జీఎస్టీ ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. బొగ్గుపై పన్నురేటు తగ్గడంతో సిమెంట్‌పై జీఎస్టీ ప్రభావం స్వల్పంగానే ఉంది. ఇనుము, ఉక్కు రంగాలకు కొంత సానుకూలత ఉంది.

ఇటీవల జీఎస్టీ మండలి సమావేశంలో అదనంగా 66 రకాల వస్తువులపై పన్నుపోటును జీఎస్టీ మండలి ఉపసంహరించింది. అలాగే జీఎస్టీ రాక ముందు వివిధ రాష్ట్రాలు చేపట్టిన వివిధ అభివృద్ధి, ఉత్పాదక ప్రాజెక్టులపై ఈ రేట్ల ప్రభావాన్ని జీఎస్టీ మండలి సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఆయా ప్రాజెక్టులను అప్పటి పన్నురేట్లకు అనుగుణంగా చేపట్టారు. అలాగే సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన ఇ-వే బిల్లుల విధానానికి తాజాగా ఇటీవల దిల్లీ జీఎస్టీ సదస్సులో మార్గం సుగమం చేశారు. ముందు దూరంగా ఉండిపోయిన జమ్మూ-కశ్మీర్‌ను ఈ పన్ను పరిధిలోకి తేగలిగారు.

12 వందలకు పైగా వస్తువులు, అయిదువందల రకాల సేవలకు ఇతమిద్ధంగా పన్నురేట్లు ఖరారైనా శ్లాబులో వర్గీకరించడంలో నెలకొన్న గందరగోళాన్ని రానున్న కొద్ది నెలల్లో పరిష్కరించాలి. గతంలో సుబ్రహ్మణ్యన్ కమిటీ అన్ని రకాల వస్తువులు, సేవలపై ఏకరూప పన్ను 15 - 15.5% ఉండాలని ప్రతిపాదించింది.

పన్నురేట్లు హేతుబద్ధ స్థాయిలో ఉంటే, చెల్లింపులు స్వచ్ఛందంగా, నిజాయతీగా జరుగుతాయని 'ఆడంస్మిత్' ఏనాడో పేర్కొన్నారు. శ్లాబుల సంఖ్యను కనిష్ఠ స్థాయికి కుదించి, పన్నురేట్లను సహేతుకంగా స్థిరీకరించే దీర్ఘకాలిక లక్ష్యంతో ముందడుగు వేస్తే జీఎస్టీ ధ్యేయం నెరవేరినట్లే.

### మాదిరి ప్రశ్నలు

**1.** వస్తు, సేవల పన్ను ఎప్పటినుంచి అమల్లోకి వచ్చింది?
1) 2017 జనవరి 1 2) 2017 మార్చి 1
3) 2017 ఏప్రిల్ 1 4) 2017 జులై 1

**2.** జీఎస్టీని 'గుడ్ అండ్ సింపుల్ టాక్స్'గా ఎవరు అభివర్ణించారు?
1) నరేంద్ర మోదీ 2) అరుణ్ జైట్లీ
3) ప్రణబ్ ముఖర్జీ 4) ఎం. వెంకయ్యనాయుడు

**3.** జీఎస్టీ మండలి (GST Council) కి నేతృత్వం వహించేదెవరు?
1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి
3) కేంద్ర ఆర్థికమంత్రి 4) కేంద్ర పరిశ్రమల మంత్రి

**4.** జీఎస్టీని 1954 లో మొదటిసారిగా అమల్లోకి తెచ్చిన దేశం ఏది?
1) ఇంగ్లండ్ 2) ఫ్రాన్స్ 3) జర్మనీ 4) ఇటలీ

**5.** జీఎస్టీలో విధించే వివిధ రకాల పన్ను శ్లాబుల శాతం ఎంత?
1) 4, 11, 17, 27 2) 5, 12, 18, 28
3) 6, 13, 19, 29 4) 7, 14, 20, 30

**6.** ప్రస్తుతం మన దేశ జీడీపీ (GDP) లో పన్నుల వాటా ఎంత?
1) 14% 2) 15% 3) 16% 4) 17%

**7.** జీఎస్టీఎన్ (GSTN) మొదటి ఛైర్మన్ ఎవరు?
1) నవీన్ కుమార్ 2) ప్రకాష్ కుమార్
3) నితిన్ మిశ్రా 4) రాజీవ్ కుమార్

**8.** జీఎస్టీలో భాగంగా దేశంలో విధించే పన్ను రూపాలు ఏవి?
1) CGST 2) SGST 3) IGST 4) పైవన్నీ

**9.** జీఎస్టీల పరిధిలోకి వచ్చే వార్షిక వ్యాపారాదాయ పరిమితి ఎంత?
1) రూ. 10 లక్షలు 2) రూ. 15 లక్షలు
3) రూ. 20 లక్షలు 4) రూ. 25 లక్షలు

**10.** జీఎస్టీ కోసం రాజ్యాంగంలో సవరించిన ఆర్టికల్ ఏది?
1) 278 ఎ (1) 2) 299 ఎ (1)
3) 279 ఎ (1) 4) 280 ఎ (1)

**11.** జీఎస్టీ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రథమంగా రాటిఫై (Ratify) చేసిన రాష్ట్రం ఏది?
1) హరియాణా 2) అసోం
3) గుజరాత్ 4) పంజాబ్

**12.** 1 జులై 2017 న ఏ రాష్ట్రంలో జీఎస్టీ అమలు ప్రారంభం కాలేదు?
1) పశ్చిమ్ బంగ 2) ఒడిశా
3) జమ్మూ - కశ్మీర్ 4) పైవేవీకావు

**జవాబులు**

| | | | |
|---|---|---|---|
| 1-4 | 4-2 | 7-1 | 10-3 |
| 2-1 | 5-2 | 8-4 | 11-2 |
| 3-3 | 6-3 | 9-3 | 12-3 |

మీ అభిప్రాయాలు పంపాల్సిన మెయిల్ ఐడీ
pratibhadesk@eenadu.net

# హాయ్! బుజ్జీ!!

# చుకుచుకు కాదు... రయ్ రయ్!



**కొత్త రైలు బళ్లు వస్తున్నాయ్... బుల్లెట్టుల్లా దూసుకెళ్లిపోతాయ్... తొందరగా గమ్యాన్ని చేర్చేస్తాయ్... వివరాలు చదివేయమంటున్నాయ్...**

## 1 మొదటి స్థానం నాదే!

- చైనాలో ప్రపంచంలోనే వేగవంతమైన రైళ్లు త్వరలోనే పట్టాలెక్కుతున్నాయి. ఎప్పుడంటే వచ్చే సెప్టెంబరు 21 నుంచే.
- బీజింగ్ నుంచి షాంఘైల మధ్యే.
- వీటిని ఫక్సింగ్ రైళ్లని పిలిచేస్తున్నారు.
- వీటి ప్రత్యేకత ఏమంటే ఇప్పుడు ఉన్న వాటి కంటే వేగంగా గరిష్ఠంగా గంటకు 400 కిలోమీటర్లకుపైగా వేగాన్ని అందుకుంటాయి. అయితే ప్రమాదాలు జరగకుండా ఉండటానికి గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసేలా ఏర్పాట్లుచేశారు.
- 1250 కిలోమీటర్ల దూరాన్ని నాలుగున్నర గంటల్లోనే చేరతాయి. అంటే హైదరాబాద్ నుంచి కాశీకి వెళ్లినంత దూరం మరి!

## 2 ఇప్పటికిదే రారాజు!

- ఇప్పుడు నడుస్తున్న రైళ్లలో ఎక్కువ వేగంగా ప్రయాణించే రైలు ఏదబ్బా అంటే హార్మోనీ సీఆర్‌హెచ్ 380ఏ.
- గరిష్ఠంగా ఇది గంటకు 379 కిలోమీటర్ల వేగంతో పరిగెట్టేస్తుంది.
- విద్యుత్‌శక్తితో పనిచేసే ఇది చైనాలోని షాంఘై, నాన్‌జింగ్‌ల మధ్య తిరుగుతోంది.
- ఒకేసారి 494 మందిని మోసుకుపోగలదు.
- ఈ దేశానికే చెందిన సీఎస్ఆర్ కింగ్డో సైఫో లోకోమోటివ్ అండ్ రోలింగ్ స్టాక్ సంస్థ దీన్ని తయారు చేసింది.

## 3 నాదిక మూడో స్థానం!

- ఇప్పుడు పట్టాలపై పరుగులు తీస్తున్న వాటిలో రెండో వేగవంతమైన రైలు ఏజీవీ ఇటాలో.
- గరిష్ఠంగా గంటకు 359 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.
- ఇటలీలోని రోమ్, నేపల్స్ మధ్య రాకపోకలు సాగిస్తుంది.
- ఫ్రాన్స్ సంస్థ ఆల్స్టోమ్ దీన్ని తయారు చేసింది.
- మనకు కావలిసినట్లు మార్చుకునే సీట్లు, టీవీ, వైఫై లాంటి సౌకర్యాలూ దీనిలో ఉన్నాయి.

## 4 భారత్‌లో..

- మన దగ్గర ఇప్పటి వరకు బుల్లెట్ రైలే లేదు. మరి కొన్నేళ్లలో దీన్ని చూడొచ్చు. అలహాబాద్, ముంబయిల మధ్య ఈ లైను పనులు జరుగుతున్నాయి.
- అయితే ప్రస్తుతం మన దేశంలో అత్యంత వేగంగా ప్రయాణించే రైలు గతిమాన్ ఎక్స్‌ప్రెస్. ఇది సెమీ హైస్పీడ్ రైలు.
- మన రాజధాని దిల్లీ, ఆగ్రాల మధ్య తిరుగుతుందిది. అంటే 233 కిలోమీటర్ల దూరాన్ని 1:45 నిమిషాల్లో చేరుకుంటుంది.
- ఇది గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు.

### మీకు తెలుసా?

- మొదటి బుల్లెట్ రైలు పుట్టింది జపాన్‌లో.
- 1930 నుంచీ దీనిపై ప్రయోగాలు మొదలయ్యాయి.
- ఇది 1964లో పట్టాలెక్కింది.

### బుల్లెట్ రైలు తర్వాతేంటి?

- బుల్లెట్ రైలే వేగమనుకుంటే దాన్ని మించినది ఇంకోటీ వస్తోందండోయ్. అదే హైపర్‌లూప్.
- గంటకు 700కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందిది. అంటే హైదరాబాద్ నుంచి విజయవాడకు దాదాపు 20 నిమిషాల్లోపే వెళ్లిపోవచ్చు.

### పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Put = పెట్టు
- కపటం = మోసం

> మన లోపల శత్రువు లేనంత వరకు బయటి శత్రువు మనల్ని భయపెట్టలేదు
>
> – గౌతమ బుద్ధుడు

### చిలిపి ప్రశ్న

రోజూ వెండి గ్లాసుతో నీళ్లు తాగితే ఏమవుతుంది?

- జి. అన్నాజీరావు, పొందూరు

### నవ్వుల జల్లులు!

**టీచర్:** శీనూ! 'రంగస్థలం' అనే పదం ఇరవై సార్లు రాయమంటే పది సార్లే రాశావేం?

**శీను:** నేను లెక్కల్లో కూడా వీకే టీచర్!

- బి. రామారావు, నిజామాబాద్

**కిరణ్:** ఎందుకు అలా డల్‌గా ఉన్నావు?

**రాము:** కాలికి దెబ్బ తగిలింది హోమ్‌వర్క్ చేయలేదు...

**కిరణ్:** కాలికి దెబ్బ తగిలితే చేత్తో రాయడానికేం?

**రాము:** ఆ చేత్తోనే కదరా కాలికి మందు రాసేది!

- కె. గోవింద్, ఆముదాలవలస

### కవలలేరి?



### సరదా పదాలు

ఇక్కడున్న తెలుగు పదాల సమానార్థకాల్ని పక్కనే ఉన్న ఆంగ్ల అక్షరం ఉచ్చారణ వచ్చేలా గడులు నింపగలరా?

| | | | |
|---|---|---|---|
| 1. బీజం | V ☐ ☐ | 5. పెళ్లి | V ☐ ☐ |
| 2. గెలుపు | V ☐ ☐ | 6. అమ్మకం | V ☐ ☐ |
| 3. ఖరీదు | V ☐ ☐ | 7. నమ్మకం | V ☐ ☐ |
| 4. ఆశ్చర్యం | V ☐ ☐ | 8. పద్ధతి | V ☐ ☐ |

- ఎం. అప్పాజీకృష్ణ, బెంగళూరు

### గబగబా అనండి

పళ్లెంలో అక్షంతలు, కళ్లంలో పక్షులు

### సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 6 | | | | | 5 |
| | 2 | 5 | | | 9 | 6 | | |
| 8 | | | | | 2 | | | |
| 4 | 9 | 6 | | 2 | | | | |
| | 1 | 7 | 5 | | 4 | 9 | 6 | |
| | | | | 6 | | 1 | 4 | 7 |
| | | | 4 | | | | | 8 |
| | | 2 | 8 | | | 7 | 9 | |
| 5 | | | | | 1 | | | |

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3x3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

జవాబులు:

**సరదా పదాలు:** 1. విత్తనం 2. విజయం 3. విలువ 4. విచిత్రం 5. వివాహం 6. విక్రయం 7. విశ్వాసం 8. విధానం

**కవలలేరి:** ఖ,గ

**చిలిపి ప్రశ్న:** దాహం తీరుతుంది!

**సుడోకు:**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 3 | 1 | 6 | 4 | 8 | 2 | 7 | 5 |
| 7 | 2 | 5 | 3 | 1 | 9 | 6 | 8 | 4 |
| 8 | 6 | 4 | 7 | 5 | 2 | 3 | 1 | 9 |
| 4 | 9 | 6 | 1 | 2 | 7 | 8 | 5 | 3 |
| 3 | 1 | 7 | 5 | 8 | 4 | 9 | 6 | 2 |
| 2 | 5 | 8 | 9 | 6 | 3 | 1 | 4 | 7 |
| 1 | 7 | 3 | 4 | 9 | 6 | 5 | 2 | 8 |
| 6 | 4 | 2 | 8 | 3 | 5 | 7 | 9 | 1 |
| 5 | 8 | 9 | 2 | 7 | 1 | 4 | 3 | 6 |

### ఎందుకు? ఏమిటి? ఎలా?

## గుడ్లగూబలు మెడల్ని ఎందుకలా తిప్పుతాయి?

**ప్రశ్న:** గుడ్లగూబ తన మెడను అంతలా వెనక్కి ఎందుకు తిప్పుతుంది?

- ఎం. నరేష్, 9వ తరగతి, నల్గొండ

**జవాబు:** గుడ్లగూబలు(owls) పగటిపూట సూర్యుని వెలుతురులో సరిగా చూడలేవు. అందువల్ల అవి రాత్రివేళల్లోనే తమ ఆహారాన్ని వేటాడుతాయి. రాత్రి వేళల్లో బాగా చూడ్డానికి అవసరమయ్యే కాంతిని రాబట్టుకోవడానికి వాటికి విశాలమైన కళ్లు వాటిలో గొట్టాల రూపంలో ఉండే కనుగుడ్లు ఉంటాయి. ఈ కనుగుడ్లు గొట్టాల రూపంలో ఉండటంతో అటూ ఇటూ కదిలించడం అంత సులభం కాదు. అందువల్ల గుడ్లగూబలు తమ తలల్ని వెనక్కి తిప్పుతాయి. వాటి మెడలో అదనంగా ఉండే ఎముకలు అలా తిప్పడానికి సాయపడతాయి. ఆ విధంగా గుడ్లగూబలు తనకు ఆహారంగా ఉండే జీవులకు ఏ మాత్రం తెలియకుండా తమ స్థానాల్లో కదలకుండానే తలల్ని 270 డిగ్రీల మేర తిప్పి వాటి ఉనికిని గుర్తించి వేటాడగలవు.



- ప్రొ॥ ఈ.వి.సుబ్బారావు, హైదరాబాద్

# కట్టలు తెగిన అవినీతి

**(మొదటి పేజీ తరువాయి)** కట్టపై వేశారు. దీంతో చినుకుపడితేనే కట్ట బురదగా మారుతోంది. ఘాట్‌ల నిర్మాణంలో తగుపాళ్లలో సిమెంట్ వినియోగించలేకపోవడం వల్ల కంకర బయటకు కనిపిస్తోంది. కట్టపై భాగంలోని నీరు వెళ్లడానికి వీలుగా అవతలి వైపు సిమెంటుతో నిర్మించిన కాలువలు సైతం కంకర తేలుతున్నాయి. పాత అలుగుకే మరమ్మతులు చేశారు. పెంచిన కట్ట ఎత్తును అనుసరించి అలుగును ఒకవైపు పెంచారు. ఈ నిర్మించిన అలుగు గోడ వంకరటింకరగా కంకర తేలుతూ అస్తవ్యస్తంగా ఉంది. ప్రస్తుతం మరో ఘాట్ నిర్మాణం జరుగుతోంది.

సిర్పూర్-టి మండల కేంద్రంలో నిర్మిస్తున్న మినీట్యాంక్‌బండ్ కట్ట సైతం చెరువు పూడిక మట్టితోనే ఏర్పాటు చేశారు. దీంతో ఇటీవలి వర్షాలకు కట్టపై భాగంలో అనేక చోట్ల పగుళ్లు తేలింది. ఈ చెరువు పరిధిలో ఆరు వందల ఎకరాల్లో అన్నదాతలు వరి పంటను ఏటా పండించేవారు. చెరువు ఆధునికీకరణ పనుల వల్ల మట్టి పనులు మాత్రమే ప్రస్తుతం చేశారు. నెలల తరబడి పనులు అడుగుముందుకు పడకపోవడం వల్ల ఆయకట్టు రైతుల్లో నిరాశ అలుముకుంది. మట్టి కట్ట పనుల వల్ల పాత కాలువల తూములు పూడుకుపోవడంతో చుక్కనీరు రైతుల పొలాలకు అందడం లేదు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో ఎండుతున్న పంటలకు నీరందించలేక పోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు.


కట్ట కాలువలది నాసిరకం పనులే


మట్టి పనులకే పరిమితమైన సిర్పూర్-టి మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం

మిషన్ కాకతీయ ఒకటో విడతలో 177 చెరువు పనులకు రూ. 40.50 కోట్లు, రెండో విడతలో 123 చెరువుల పునరుద్ధరణకు రూ. 12.35 కోట్లు వ్యయం చేశారు. మూడో విడతలో 53 కొత్త చెరవులు మంజూరు కాగా ఇందుకు రూ. 8.18 కోట్లను కేటాయించారు. రెండో విడతలో 34 చెరువు పనులు అసంపూర్తిగానే ఉండగా, మూడో విడతలో మంజూరైన చెరువు పనులు ప్రారంభ దశను దాటడం లేదు.


రాఘపూర్ చెరువు అలుగు అస్తవ్యస్తపు నిర్మాణం

## బిల్లులు చెల్లించలేదు

*– గుణవంత్‌రావు, ఈఈ, నీటి పారుదల*

మినీట్యాంక్‌బండ్‌ల పనులను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పనులు నాణ్యంగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తాం. ఇప్పటి వరకు మినీట్యాంక్‌బండ్‌ల పనులకు ఎవరికి బిల్లులు చెల్లించలేదు. చెరువు మట్టినే కట్టకు వినియోగించవచ్చు. సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

## భవన నిర్మాణ కార్మికులకు వృత్తి నైపుణ్య శిక్షణ

**మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:** మంచిర్యాల జిల్లాలోని కార్మిక శాఖలో పేర్లు నమోదు చేసుకొని కార్డులు కలిగి ఉన్న భవన నిర్మాణ కార్మికులకు 15 రోజులు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథ్ తెలిపారు. శిక్షణ కాలంలో భోజన వసతి, రోజుకు రూ. 300 వేతనం, గుర్తింపు ధ్రువీకరణ పత్రం ఇస్తామని తెలిపారు. ప్లంబర్, మేషన్, ఎలక్ట్రిషన్ విభాగాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, భవన నిర్మాణ సంఘం నమోదు కార్డు, నాలుగు పాస్‌ఫొటోలతో ఈ నెల 26లోపు సీసీసీలోని న్యాక్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. మిగతా వివరాలకు చరవాణి నెం. 9866004325 సంప్రదించాలని తెలిపారు.

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: **ఆరాధన:** వినాయకచవితి సందర్భంగా రేపటి స్పెషల్ ఆరాధనలో కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయ విశేషాలు; శ్రీ సామవేదం ప్రత్యేక ప్రవచనం 'శ్రీ గణేశ గీత' పూజ్యశ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ వినాయక చవితి దివ్యాశీస్సులు, 06-30: **అన్నదాత**, 07-00: **ఈటీవీ న్యూస్**, 07-30: **శుభమస్తు:** శిరిడిసాయికి హారతి సమర్పిస్తే ఎలాంటి ఫలితాలొస్తాయి; ఇల్లు నిర్మించే స్థలాన్ని శుద్ధి చేయడం ఎలా? (రేపటి స్పెషల్ శుభమస్తులో బ్రహ్మశ్రీ చాగంటి విశేష ప్రవచనం 'శ్రీ వినాయకవ్రతం'; అదృష్ట భాగ్యాన్నిచ్చే శ్రీ గణేశవాస్తు వివరాలు), 08-30: **టాలీవుడ్ టైమ్**, 09-00: **ఈనాడు సినిమా: తొలిచూపులోనే...** (కల్యాణ్‌రామ్, ఆకాంక్ష).

**మధ్యాహ్నం**

12-00: **అభి'రుచి':** ఘుమ ఘుమలు 'దొండకాయ పల్లీ ఇగురు' మీచేతి వంట 'మిక్స్‌డ్ వెజ్ పికిల్', 'ఆలూ తోటకూర వేపుడు', జస్ట్ ఎ మినిట్ 'క్యాప్సికం ఫ్రిట్టర్స్' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు** (విధి 2) (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్–2** (రిపీట్), 05-30: **ఆడాళ్ళా మజాకా:** రావులపాలెంలో పరవళ్ళు తొక్కిన అతివల ఉత్సాహం, 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

**రాత్రి**

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్**, 09-30: **జబర్దస్త్:** కడుపుబ్బ నవ్వించే కామెడీ షో...), 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

### ఈటీవీ ప్లస్

| | |
|---|---|
| **ఉదయం** 11:00 | కిక్ రిపీట్ |
| **మధ్యాహ్నం** 12:00 | జబర్దస్త్ రిమిక్స్ |
| 01:00 | ఆనందోబ్రహ్మ రిపీట్ |
| 01:15 | డిజె రిపీట్ |
| 01:30 | పటాస్ రిపీట్ |
| 02:00 | అల్లరే అల్లరి రిపీట్ |
| 02:30 | సరదాగా కాసేపు రిపీట్ |
| 03:00 | తారక్ మామా అయ్యోరామ రిపీట్ |
| 03:30 | ఈ-జంక్షన్ రిపీట్ |
| **సాయంత్రం** 04:30 | ఎక్స్‌ప్రెస్ రాజా |
| 05:00 | జిల్ జిల్ జిగా |
| 06:00 | అమృతం రిపీట్ |
| 06:30 | ఎక్స్‌ప్రెస్ రాజా |
| **రాత్రి** | |
| 07:30 | తారక్ మామా అయ్యోరామ |
| 08:00 | పోవే..పోరా |
| 09:00 | పటాస్ |
| 09:30 | మైకేల్ మదన్ కామరాజు |
| 09:45 | ది బ్రేకప్ కన్సల్టంట్ |
| 10:00 | ఆనందోబ్రహ్మ |
| 10:15 | డిజె |
| 10:30 | తారక్ మామా అయ్యోరామ రిపీట్ |
| 11:00 | పటాస్ రిపీట్ |
| 11:30 | ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్ |

### ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
★ డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

### ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: **కాబోయే అల్లుడు** (రాజేంద్రప్రసాద్, కల్పన), 10-00: మార్నింగ్ షో: **హంతకులొస్తున్నారు జాగ్రత్త!** (రామకృష్ణ అంజలి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: **ఆడుతూ పాడుతూ...** (శ్రీకాంత్, సునీల్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: **జీవితమే ఒక సినిమా** (వరుణ్‌రాజ్, గీతాంజలి), రాత్రి: 7-00: ఫస్ట్ షో: **రామరాజ్యం** (జగ్గయ్య, సావిత్రి), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

### ఈటీవీ అభిరుచి

**ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో** - ఎగ్ క్రేప్స్ & తెలగపిండి రవ్వ బాత్, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో** – అవకాడొ క్రీప్స్ & తెలగపిండి మిక్స్డ్ వెజిటబుల్ ఊతప్పం, **ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు** – అటుకుల బర్ఫీ & కరివేపాకు అన్నం, **ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు** – పన్నీర్ మఖనీ రైస్, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (వృద్ధ వయసు వారికోసం)** – ఫిష్ కర్రీ విత్‌అవుట్ ఆయిల్, **ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్"** - అక్కి రోటీ & రాజంకి చట్నీ, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** - మూరీ ఘూంటో (బెంగాలీ క్యూసైన్), **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్** – బెల్లం రవ్వ హల్వా, **మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - కేరళ స్టైల్ చికెన్ కర్రీ, **మ.12.45: సూప్స్ & స్టార్టర్స్** - షెజ్వాన్ బ్రొకోలీ పీనట్ టిక్కీ, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్)** – జపనీస్ ఫిష్ సూప్ అండ్ ప్రాన్స్ & ఫిష్ క్యాబేజి, **మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - బచ్చలికూర అవపెట్టిన కూర పులుసు, **మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్** – పన్నీర్ టమాటో మసాలా, **మ.2.30: చోటా షెఫ్** – పొటాటో క్యాబేజి బాల్స్, **మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి** – స్వీట్‌కార్న్ మష్రూమ్ సూప్, **మ.5.15: స్నాక్స్** - బ్రెడ్ దహీ వడ.

### ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: మధుమేహం... ఆధునిక చికిత్సలు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, కొమ్ముచిక్కల, పశ్చిమగోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

### ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ విజయ గణపతి ఆలయం, ఖమ్మం, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: మధుమేహం... ఆధునిక చికిత్సలు, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).



# గొర్రెల్లో కాలిపుండు వ్యాధి



ప్రస్తుతం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఈ అంటువ్యాధి అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతోంది. కాలిపుండు వ్యాధి గొర్రెల పెంపకందార్లకు తీరని ఆర్థిక నష్టాన్ని కలుగ చేస్తుందని సదాశివనగర్ మండల పశువైద్యాధికారిణి గీతమాలిక తెలిపారు.

వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా కురిసి, నేలలు చిత్తడిగా తయారై, ఆ నేలల మీద మందలు తిరిగినప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. పచ్చిక బయళ్లలో మురుగునీటి సౌకర్యం సరిగా లేక నీరు నిలిచినప్పుడు, ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. గిట్టలు వంకర తిరిగి ఉన్నప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. వ్యాధి సోకిన గొర్రెల ద్వారా వ్యాధి ఇతర గొర్రెలకు వ్యాప్తి చెందుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉండి, గిట్టలకు దెబ్బలు తాకినప్పుడు వ్యాధి త్వరగా వ్యాప్తి చెందుతుంది.

**వ్యాధి లక్షణాలు:** ★ ముందుగా మందలోని కొన్ని గొర్రెలు ఒకటి లేదా రెండు కాళ్లు కుంటుతూ నడుస్తాయి.

★ గొర్రెల గిట్టల మధ్యభాగం ఎర్రగా కందుతుంది.

★ వ్యాధి సోకిన గొర్రె ముడికాళ్ల మీద గెంతుతుంది.

★ గొర్రెలు మేత సరిగా మేయవు. బరువు తగ్గుతాయి.

★ ఎర్రగా కందిన భాగం ఉబ్బి, చీము పట్టి నల్లగా కమిలిపోతుంది.

★ ఈ భాగంపై తొడుగు ఏర్పడి, అదే క్రమేణా ఊడిపోయి, చెడువాసన వస్తుంది.

★ వ్యాధి తీవ్రంగా ఉంటే గిట్టలు కూడా ఊడిపోయే ప్రమాదం ఉంది.

**చికిత్స:** ★ వంకరగా తిరిగి ఉన్న గిట్టలను హూఫ్‌కట్టర్ తో గాని స్కాల్‌పేల్‌తో గాని ట్రిమ్మింగ్ చేయాలి. ట్రిమ్మింగ్ చేసే ముందు పరికరాలను యాంటీసెప్టిక్ ద్రావణంతో శుభ్రపరచాలి.

★ వ్యాధి సోకిన గిట్టలను 8 శాతం మైలుతుత్తం ద్రావణంలో గాని 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణంలో గాని 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో రోజుకు రెండుసార్లు కడిగి పురోసిన్ లేదా నెబాసల్ఫ్ ఆయింటుమెంట్ రాయాలి.

★ బాగా చెడిపోయిన గిట్టలను 5 శాతం ఫార్మాలిన్ ద్రావణంలో గానీ గంటసేపు ఉంచితే వ్యాధి త్వరగా నయమవుతుంది.

★ వైద్యం చేయించే గొర్రెలను మందతో పాటు పంపకుండా, సిమెంటు కాంక్రీటు నేల మీద కనీసం రెండు గంటల పాటు ఉంచి తదుపరి శుభ్రమైన పచ్చిక బయళ్లలో మేపాలి.

★ పశువైద్యుని సలహా మేరకు పెన్సిలిన్ వంటి యాంటి బయోటిక్ మందులు వాడాలి.

**నివారణ చర్యలు** ★ వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేసి, ఆరోగ్యవంతమైన గొర్రెలకు ఈ వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తపడాలి.

★ మందను చిత్తడి నేలలో, నీరు నిలిచే ప్రదేశాలలో నిలుపకుండా ఎత్తయిన పొడి ప్రదేశాలలో నిలపాలి.

★ వ్యాధి సోకిన గొర్రెలు మేసిన ప్రదేశాలలో ఆరోగ్యవంతమైన మందను మేపకూడదు.

★ వర్షాకాలంలో మందను 10 శాతం జింకుసల్ఫేట్ లేదా 4-8 శాతం కాపర్‌సల్ఫేట్ లేదా 5 శాతం ఫార్మాలిన్ ద్రావణం కలిగిన ఫుట్‌బాత్‌ల ద్వారా నడిపించాలి.

★ గొర్రెల కాపరి వ్యాధిగ్రస్తమైన గొర్రెలకు డ్రెస్సింగ్ చేసిన తదుపరి పరికరాలను, చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ఇతర గొర్రెలకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తపడాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్ (కామారెడ్డి జిల్లా)

# మొక్కజొన్నలో కాండంతొలిచే పురుగు

కాండంతొలిచే పురుగుల వల్ల మొక్కజొన్నకు 40-50 శాతం పంటనష్టం వాటిల్లుతుంది. మొక్క మొలకెత్తిన 10-40 రోజులు వరకు ఈ పురుగు ఆశిస్తుంది. దీని తల్లి రెక్కల పురుగులు పంట లేని కాలంలో కలుపు మొక్కలు మీద, పొలం గట్ల మీద గుడ్లు పెడతాయి. ఇవి 5-6 రోజుల్లో పొదిగి పిల్ల లార్వాలు బయటకు వస్తాయి. ఈ పిల్ల పురుగులు మొదట ఆకులపై పత్రపరితాన్ని గోకి తింటాయి. తరువాత ఆకు ద్వారా కాండం లోపలికి చేరుకుంటాయి. కాండం లోపల పదార్థాన్ని కూడా గోకి తినడం వల్ల ఆకులు విచ్చుకున్నప్పుడు పొడవాటి చిల్లులు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వాలు ఎదుగుతున్న కొద్ది లోపల అంకురం తినడం వల్ల మొవ్వు ఎండిపోతుంది. మొవ్వు చేత్తో పీకితే సులువుగా ఊడి వస్తుంది. దీనిని 'డెడ్‌హార్ట్' అంటారు. కాండం లోపల చూస్తే గుండ్రని లేదా 'ఎస్' ఆకారపు సొరంగాలు ఏర్పడుతాయి. మొక్కలు చనిపోయి పంటకు తీవ్రనష్టం వాటిల్లుతుంది.

**చేపట్టాల్సిన సస్యరక్షణ:** ★ పంట కాలంలో కలుపు మొక్కలు చెత్త-చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలి.

★ పురుగు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి.

★ కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు మొలకెత్తిన 25-30 రోజులకు ఆకు సుడుల్లో వేయాలి.

★ పురుగును సమర్థవంతంగా నివారించగలుగుతాం.

★ పైరు మొలకెత్తిన 10-12 రోజులకు మోనోక్రోటోఫాస్ 320 మి.లీ., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే పురుగును సమర్థవంతంగా నివారించవచ్చు.



# ముడుచుకుంటే సాధారణం.. రెక్కలు విప్పితే ఎంతందం..!!

క్లిక్... క్లిక్

సీతాకోక చిలుక సాధారణ స్థితిలో ముడుచుకొని ఉన్నప్పుడు చూస్తే మామూలుగానే కనిపిస్తుంది. అలాంటి పరిస్థితిలో మన కళ్లకు అది ఎక్కువగా కనిపించదు. రెక్కలు విప్పుకొని రెపరెపలాడుతున్నప్పుడు మాత్రం ఆ అందం చూసేందుకు రెండు కళ్లు చాలవనిపిస్తుంది. మామడలో ఒక సీతాకోక చిలుక కొద్ది వ్యవధిలోనే ఇలా రెండు రూపాల్లో కనపించిన దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది.

- న్యూస్‌టుడే, మామడ



నేటి చిత్రం

# నాడు హోదా.. నేడు వృథా

స్కూటర్.. ఒకప్పుడు మధ్యతరగతి ప్రజలకు ఇది కలలవాహనం. కుటుంబ వాహనంగా ఎంతోమంది అభిమానాన్ని చూరగొన్నది. కాలక్రమంలో వచ్చిన మార్పులకు ఇది నేడు ఇదిగో ఇలా వృథా కిందకు వచ్చేసింది. లూనాపై గ్రామాల్లో తిరుగుతూ తుక్కును సేకరించే ఓ చిరువ్యాపారి పాడైపోయిన ఓ స్కూటర్‌ను కొనుగోలుచేసి తన వాహనంపై తీసుకెళ్తున్న దృశ్యం బుధవారం జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ సమీపంలో 'న్యూస్‌టుడే' తన కెమెరాకు చిక్కింది.

- న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం

# రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

## ● కార్ఫ్‌బాల్ అండర్-17, 19 జిల్లా జట్ల ఎంపిక

**ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** కార్ఫ్‌బాల్ జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల స్థాయి(జోనల్‌స్థాయి) పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని మాత్రమే జట్లకు ఎంపిక చేశామన్నారు. అండర్-17 క్రీడాకారులకు ఆదిలాబాద్‌లోనే రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని, అండర్-19 క్రీడాకారులకు హైదరాబాద్‌లో వచ్చే నెలలో ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు పక్షం రోజుల పాటు జిల్లా కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్, బోనాఫైడ్, జనన ధ్రువీకరణ పత్రాలు సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. ఈ జట్లకు శిక్షకులుగా జె.రాష్ట్రపాల్, జె.సాయికుమార్ వ్యవహరిస్తారని తెలిపారు.

**అండర్-17 జిల్లా జట్టు:** ఎం.శివాణి, సంజన, ఎం.ఉర్మిళ, పి.పూజ, సంబుద్ధ, లక్ష్మణ్, ఆశిష్‌మణి, సమీర్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.1 ఆదిలాబాద్), హెచ్.కె.భూమిక, ఎన్.నమ్రత, వంశీ(గౌతమ్ మోడెల్ స్కూల్, ఆదిలాబాద్), ఎం.అవంతిక(సెయింట్ థామస్ ఉన్నత పాఠశాల నిర్మల్), టి.మానస, రాకేశ్(జడ్పీఎస్ఎస్ పెండల్‌వాడ), ప్రణిత్(కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆదిలాబాద్), సతీశ్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2 ఆదిలాబాద్). స్టాండ్‌బైలుగా పల్లవి, సుప్రియ, సందేశ్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.1 ఆదిలాబాద్), ప్రశాంత్(గౌతమ్ మోడెల్ స్కూల్ ఆదిలాబాద్)

**అండర్-19 జిల్లా జట్టు:** జె.మానస, కె.సుశ్మిత, సాయిపుష్ప, సంధ్యారాణి, పల్లవి, అవంతిక, సంగీత, మనీష(టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఆదిలాబాద్), నందకుమార్, శివప్రసాద్, వినయ్, పృథ్వీ, అక్షయ్(విద్యార్థి జూనియర్ కళాశాల ఆదిలాబాద్), నితీన్, షేక్ రియాజ్(నలంద జూనియర్ కళాశాల ఆదిలాబాద్), రాకేశ్(పూలాజీబాబా జూనియర్ కళాశాల ఉట్నూరు). స్టాండ్‌బైలుగా ద్రుపద, ఎం.మనీష(టీఎస్‌డబ్ల్యూఆర్ జేసీ, ఆదిలాబాద్).



ఎంపికైన అండర్-17 కార్ఫ్‌బాల్ జిల్లా జట్టు



అండర్-19 కార్ఫ్‌బాల్ జిల్లా జట్టు

# నిండిన కడెం... ముమ్మరంగా వరి నాట్లు

## ★ ఖరీఫ్ పనుల్లో రైతుల నిమగ్నం

**దండేపల్లి, న్యూస్‌టుడే:** నిన్నటి వరకు చుక్క నీరు లేక బీళ్లుగా ఉన్న భూములు... ఈ ఖరీఫ్‌లో నాటు వేస్తామో లేదో పంటలు పండుతాయా లేదో అని ఆందోళన వ్యక్తం చేసిన రైతుల్లో ఆనందం నెలకొంది. జిల్లావ్యాప్తంగా రెండు రోజుల కిందట కురిసిన వర్షాలతో కడెం జలాశయం నిండటంతో పాటు వ్యవసాయ బావులు, వాగులు, చెరువుల్లోకి నీరు రావడంతో ఖరీఫ్ పనులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ప్రస్తుతం చాలా చోట్ల రైతులు పొలాలను నాటుకు సిద్ధం చేయడం, నాటు వేయడం తదితర పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు. కడెం జలాశయం కింద జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలో 40వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు లేకపోవడంతో కనీసం సగం కూడా నాట్లు పూర్తి కాలేదు. రెండు రోజుల కిందట కురిసిన వర్షాలతో కడెం జలాశయం నిండి కాల్వలకు సమృద్ధిగా నీరు వదలడంతో ఆయకట్టుతో పాటు చెరువులు, వాగుల కింద నాట్లు ఊపందుకున్నాయి. రైతులు పొలం పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు.



పొలం దున్నుతున్న రైతు



నాటు వేసేందుకు నారు తీసుకుని వెళ్తున్న మహిళలు



డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా వస్తున్న కడెం నీరు

# క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి: ఎంవీఐ

## ● అట్టహాసంగా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

**ఏసీసీ, న్యూస్‌టుడే:** విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంవీఐ వివేకానందరెడ్డి అన్నారు. చదువుతో పాటు ఇతర క్రీడారంగాల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథిగా సీఐ సుధాకర్‌తో పాటు ఆయన హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందాలంటే ఆటలు తప్పనిసరి అన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అతిథులు కొద్దిసేపు ఫుట్‌బాల్ ఆడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 మందికి పైగా క్రీడాకారులు తరలివచ్చారు. మైదానంలో తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. జిల్లా విద్యాధికారి రవికాంత్‌రావు ఆదేశాల మేరకు విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రేని రాజయ్య అధ్యక్షతన మైదానంలో అన్ని ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో డీటీడీఓ గంగారాం, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, సాక్షర భారత్ జిల్లా బాధ్యుడు పురుషోత్తం నాయక్, మండల విద్యాధికారి దాసరి శ్రీనివాస్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాధ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బీజుకరువిల్లా, మంచిర్యాల స్పోర్ట్స్‌క్లబ్ కార్యదర్శి చంద్రమోహన్‌గౌడ్, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణ, పీఈటీ సంఘం నాయకులు మీనారెడ్డి, బెల్లం శ్రీనివాస్, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పోటీలను పురస్కరించుకుని ఇటీవల బదిలీ అయిన మంచిర్యాల సీఐ సుధాకర్‌ను క్రీడా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంవీఐ వివేకానందరెడ్డి, సీఐ సుధాకర్ తదితరులు



ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన క్రీడాకారులు